PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 217 | విజయవాడ, మంగళవారం 12 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 12 March 2024 | Rs

ప్రొఫెసర్ సాయిబాబా కేసులో 'మహా' సర్కారుకు షాక్

- తీర్పుపై స్టేకు సుప్రీం నిరాకరణ

7



8

ఓవరాల్‌గా 'ఓపెన్ హైమర్' సత్తా
సందడిగా 'ఆస్కార్' వేడుకలు

ఎన్నికల ముంగిట అమల్లోకి సిఎఎ

- నోటిఫై చేసిన కేంద్రం
- అమలుచేయబోమన్న కేరళ
- అదే బాటలో మరో నాలుగు రాష్ట్రాలు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) మళ్లీ తెరపైకి తెచ్చింది. వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాల వ్యతిరేకత మధ్య ఈ వివక్షాపూరిత చట్టం అమలుకు నిబంధనలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫై చేసింది. కేరళతో సహా అయిదు రాష్ట్రాలు ఈ పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందుగానే సిఎఎను అమలులోకి తెస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇటీవలే హూంకరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడానికి ముందే కేంద్రం సవరించిన సిఎఎ నిబంధనలను నోటిఫై చేయడంలో ఆంతర్యం తెలియనిదేమీ కాదు. ఫాసిస్టు హిందూత్వను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితోనే అది ఈ పని చేసింది ముస్లింల పట్ల వివక్ష చూపే ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని 2019 డిసెంబరు 11న పార్లమెంటులో ప్రతిపక్షాల బహిష్కరణ మధ్య అత్యంత అప్రజాస్వామికమైన రీతిలో ఆమోదింప జేసుకుంది. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబరు31 లేదా అంతకుముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి భారత దేశానికి వలసవచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు పౌరసత్వాన్ని మంజూరు చేస్తుంది. ముస్లింలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా మిగతా 7లో



సోమవారం ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్శిటీ క్యాంపస్‌లో విద్యార్థులు నిరసన తెలుపుతున్న దృశ్యం

భగ్గుమన్న జామియా మిలియా

న్యూఢిల్లీ : సిఎఎ నిబంధనల నోటిఫైని వ్యతిరేకిస్తూ జామియా మిలియా ఇస్లామియా యూనివర్శిటీ క్యాంపస్‌లో నిరసనలు పెల్లుబికాయి. ముస్లిం స్టూడెంట్స్ ఫెడరేషన్ నేతృత్వంలో విద్యార్థులు ఈ నిరసనలకు దిగారు. వీరికి ఉపాధ్యాయులు కూడా మద్దతు తెలిపాయి. ఢిల్లీ పోలీసులకు, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యుఐ) కూడా ఈ నిరసనలకు మద్దతు తెలిపింది. 'రాజ్యాంగ విరుద్ధమైన సిఎఎను అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌యుఐ జామియా మిలియా ఇస్లామియా నిరసన తెలుపుతుంది' అని ఎన్‌ఎస్‌యుఐ యొక్క జామియా యూనిట్ ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యార్థుల నిరసనల నేపథ్యంలో క్యాంపస్‌లో భారీ ఎత్తున పోలీసులను మోహరించారు.

జామియా యాక్టింగ్ వైస్-ఛాన్సలర్ ఎక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, "క్యాంపస్‌లో ఎలాంటి ఆందోళనలు అనుమతించం. అలాగే బయటి వ్యక్తులను క్యాంపస్ సమీపంలోకి అనుమతించం' అని చెప్పారు.



బైజూస్ ఆఫీసులు మూసివేత!

- 25 శాతం మందికే వేతనాలు

బెంగళూరు : తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ దేశవ్యాప్తంగా తన కార్యాలయాలను మూసివేస్తుందని సమాచారం. బెంగళూరులోని హెడ్ ఆఫీసు మినహా 300 బైజూస్ ట్యూషన్ సెంటర్లను నిలిపివేస్తోందని మనీకంట్రోల్ రిపోర్ట్ చేసింది. ఉద్యోగులను ఇంటి నుంచి పని చేయాలని సూచించింది. మరోవైపు తన ఉద్యోగుల్లో 25 శాతం మందికే ఫిబ్రవరి నెల పూర్తి వేతనాలు అందించిందని సమాచారం. వారంతా తక్కువ వేతనం ఉన్నవారే. మిగతా వారికి పాక్షిక చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. కొందరు పెట్టుబడిదార్లు నిధులను బ్లాక్ చేయడంతో కంపెనీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వేతనాలు చెల్లిస్తున్నామని బైజూస్ యాజమాన్యం ఇటీవల ఉద్యోగులకు లేఖలు పంపిన విషయం తెలిసిందే.

అసైన్డ్ భూముల కుంభకోణంలో రూ.4,400 కోట్ల స్కామ్

- చంద్రబాబు, నారాయణపై సిఐడి ఛార్జిషీట్

2



విజయవాడలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా (వార్త 3లో)

బాండ్ల వివరాలు వెల్లడించాల్సిందే

- ఈ రోజు సాయంత్రం వరకు గడువు
- ఎస్‌బిఐ దరఖాస్తును కొట్టేస్తూ సుప్రీం
- 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఇసి వెబ్‌సైట్‌లో ఉండాలి
- రాజకీయ నిధుల్లో పారదర్శకత దిశగా ఇదొక అడుగు : సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను మంగళవారం సాయంత్రానికల్లా ఎన్నికల సంఘానికి ఎస్‌బిఐ సమర్పించాల్సిందేనని సుప్రీం కోర్టు సోమవారం స్పష్టం చేసింది. గడువు మరింత పొడిగించాలన్న స్టేట్ బ్యాంక్ దరఖాస్తును చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. గడచిన 26 రోజుల్లో ఏం చేశారని నిలదీసింది. ఎస్‌బిఐ సమర్పించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఈ నెల 15 (శుక్రవారం) సాయంత్రం 5 గంటలకల్లా ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

రాజకీయ పార్టీలకు కాసుల వర్షం కురిపించిన ఎలక్టోరల్ బాండ్ల దాతలు, గ్రహీతల సమాచారం ఇచ్చే గడువును పొడగించాలని ఎస్‌బిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను, అలాగే ఎస్‌బిఐ కోర్టు ధిక్కారంపై సిపిఎం, ఎడిఆర్, కామన్ కాజ్‌లు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను సోమవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎస్‌బిఐ తరపున హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. విరాళాలు మిగతా 7లో



మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేర్చండి

- అధికారులకు సిఎం ఆదేశం
- పులివెందులలో రూ.861.84 కోట్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, పులివెందుల టౌన్

అభివృద్ధి ఫలాలను ప్రజలందరికీ చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో రూ.861.84 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధి రాష్ట్రానికి ఆదర్శనీయంగా ఉందన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువవుతున్నాయా? లేదా? అనేది అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మొదటగా కడప రోడ్డులో నాబార్డు, ఆర్‌ఐడిఎఫ్ సంయుక్తంగా రూ.500 కోట్లతో 50 ఎకరాల్లో నిర్మించిన 627 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వైఎస్‌ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలు, రూ.70 లక్షలతో వైఎస్‌ఆర్ జంక్షన్‌లను ఆయన ప్రారంభించారు. నల్లపురెడ్డిపల్లిలో ప్రభుత్వం, పాడా సంయుక్తంగా ఐదెకరాల్లో రూ.20 కోట్లతో నిర్మించిన ఇంటెగ్రేటెడ్ అరటి ప్యాక్ హౌస్, రూ.38.15 లక్షలతో నిర్మించిన మిగతా 7లో

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

- ముస్లింలకు సిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి -అమరావతి

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. మంగళవారం నుంచి నెలరోజులపాటు రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా ముస్లిములకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సిఎంఒ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 'నెలరోజులపాటు అత్యంత నియమనిష్టలతో కఠిన ఉపవాస వ్రతం ఆచరించే రంజాన్ మాసం ముస్లిములకు ఎంతో పవిత్రమైనది. రంజాన్ ప్రారంభం కానున్న సందర్భంగా ముస్లిములందరికీ శుభాకాంక్షలు' అని సిఎం పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణంతోనే సమగ్రాభివృద్ధి

- వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోడీ

7

బిజెపికి 6 ఎంపి, 10 ఎమ్మెల్యే స్థానాలు

- జనసేనకు కోత
- బాబు నివాసంలో కుదిరిన ఒప్పందం



బిజెపి నాయకులతో సమావేశమైన పవన్ కల్యాణ్, చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు కూడా సాధించని బిజెపి తాజా ఎన్నికల్లో ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. ఉండవల్లిలోని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నివాసంలో సోమవారం జరిగిన మూడు పార్టీల నేతల కీలక భేటీలో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో చంద్రబాబునాయుడుతో పాటు, కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు జైజయంత్ పాండా, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఎనిమిది గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశం సాగింది. బిజెపి నాయకులు తాము అడిగిన సీట్లను ఇచ్చి తీరాల్సిందేనని పట్టు పట్టినట్లు సమాచారం. బేరసారాలకు పెద్దగా అవకాశం లేకపోవడంతో ఆ సీట్లను ఎలా సర్దుబాటు చేయాలన్న అంశంపైనే ప్రధానంగా చర్చ సాగినట్లు తెలిసింది. చివరకు జనసేనకు ఇప్పటికే ప్రకటించిన సీట్లలో భారీ కోత పడింది. దీంతో ఒక ఎంపి స్థానంతోపాటు, మూడు అసెంబ్లీ సీట్లను ఆ పార్టీ వదులుకోవాల్సివచ్చింది. గతంలో జనసేనకు 24 అసెంబ్లీ, మూడు లోక్‌సభ సీట్లను టిడిపి కేటాయించిన సంగతి తెలిసిందే. బిజెపికి సర్దుబాటు చేయాల్సిరావడంతో తాజాగా 21 అసెంబ్లీ, 2 ఎంపి స్థానాలకు జనసేన పరిమితమైంది. తొలుత ప్రకటించిన సీట్లపైనే జనసేన కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమైన విషయం తెలిసిందే. తాజాగా మరిన్ని సీట్లలో కోత పెట్టడంతో ఎలా స్పందిస్తారో చూడాల్సిఉంది. తాజా ఒప్పందం ప్రకారం తెలుగుదేశం పార్టీ 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ మేరకు టిడిపి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అయితే, ఏయే స్థానాలను ఏ పార్టీలకు కేటాయించారన్న దానిపై స్పష్టత రాలేదు. దానికి సంబంధించిన కసరత్తు ఇంకా జరుగుతోందని ఆ ప్రకటనలో తెలిపారు. చర్చల ప్రక్రియ జరుగుతుండగానే నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పోటీ చేస్తారని పవన్ కళ్యాణ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో మొత్తం 100 స్థానాలకు బిజెపి కూటమి రాష్ట్రంలో అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

సీట్ల లెక్క ఇలా...

పార్టీ	ఎంపి స్థానాలు	ఎమ్మెల్యే స్థానాలు
బిజెపి	6	10
టిడిపి	17	144
జనసేన	2	21

చైనా ఆధునీకరణపైనే దృష్టి!

- జిన్‌పింగ్ దార్శనికతకు మద్దతు
- ముగిసిన సిపిపిసిసి 14వ జాతీయ వార్షిక సమావేశాలు



14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌లో రెండో రోజు సోమవారం సెషన్‌లో జిన్‌పింగ్, ఇతర చైనా నాయకులు

బీజింగ్ : చైనా ఆధునీకరణపైనే పూర్తిగా దృష్టి సారిస్తూ చైనా అత్యున్నత రాజకీయ సలహా సంప్రదింపుల సంస్థ చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సిపిపిసిసి) 14వ జాతీయ కమిటీ సమావేశాలు ఆదివారంతో ఇక్కడ ముగిశాయి. రెండు సెషన్లుగా జరిగిన ఈ సమావేశాల్లో రాజకీయ సలహాదారులు పలు అంశాలపై సమర్ధవంతమైన, ఆచరణాత్మకమైన చర్చలు జరిపారు. దీర్ఘకాలంగా నలుగుతున్న సమస్యలతో పాటు కొత్తగా ముందుకొస్తున్న సమస్యలపైనా వారు దృష్టి సారించారు. అలాగే కృత్రిమ మేథస్సు (ఎఐ) అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్ళడానికి వ్యూహ రచనతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై వారు చర్చించారు. జాతీయాభివృద్ధి నుండి జీవనోపాధి వరకు అన్ని అంశాలు ఈ సమావేశాల్లో చర్చకు వచ్చాయి. ఈ సవాళ్ళన్నీ సమర్ధవంతంగా ఎదుర్కొని, అధిగమించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సిపిపిసిసి సంకల్పించింది.

ఈ సంస్థ జాతీయ కమిటీ చైర్మన్ వాంగ్ హ్యునింగ్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ, చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) నేతృత్వంలో చైనా ఆధునీకరణకు సంబంధించి మెరుగైన అవగాహన కలిగిఉండాలన్నారు. వివిధ కోణాల్లో చైనా ఆధునీకరణను మరింత ముందుకు తీసుకెళ్ళడంపై ఈ ఏడాది అనేక ప్రతిపాదనలు వచ్చాయి. కృత్రిమ మేథస్సు (ఎఐ)ను అభివృద్ధిపరచడం వంటి కొత్త అంశాలతో పాటూ దీర్ఘకాలంగా వున్న సమస్యలు - జననాల రేటును పెంచడం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పేద ప్రాంతాల అభివృద్ధికి దోహదపడడం వంటి అంశాలపై కూడా సవివరంగా చర్చలు జరిగాయి. కొత్త వాతావరణంలో ఈ పాత సమస్యలకు పరిష్కారాలు ఏ విధంగా అందించాలనే అంశంపై రాజకీయ సలహాదారుల నుండి అనేక సూచనలు, ప్రతిపాదనలు అందాయి.

రాజకీయ తీర్మానం

తైవాన్ సమస్యను పరిష్కరించేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యూహాన్ని అధ్యయనం చేసి అమలు చేయాల్సిందిగా సిపిపిసిసి సభ్యులను రాజకీయ తీర్మానం కోరింది. ఆదివారం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. మాతృభూమితో తైవాన్ శాంతియుత పునరేకీకరణ తప్పనిసరిగా జరిగి తీరుతుందని ఆ తీర్మానం ఉద్ఘాటించింది. తైవాన్ జలసంధి వ్యాప్తంగా వివిధ రంగాల్లో అభివృద్ధి కోసం అన్ని దేశభక్తియుత శక్తులను ఏకతాటిపైకి తీసుకురావాలని కోరింది. హాంకాంగ్ ప్రజలు హాంకాంగ్‌ను, మకావో ప్రజలు మకావోను పాలిస్తున్నారని, అత్యంత మిగతా 7లో

'మిషన్ దివ్యాస్త్ర' సక్సెస్

ఢిల్లీ : రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో.. బహుళ లక్ష్యాలను ఛేదించగల అగ్ని-5 (ఎంఐఆర్ వి) క్షిపణిని మొదటిసారి విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ అధునాతన క్షిపణిని 'మల్టిపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్ (ఎంఐఆర్ వి) సాంకేతికతతో అభివృద్ధి చేశారు. దీనిద్వారా ఒకే క్షిపణి సాయంతో అనేక వార్‌హెడ్లను వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు. ఆసియా యావత్తూ దీని పరిధిలోకి వస్తుంది. అగ్ని-5 విజయవంతంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్షం వ్యక్తంచేశారు. డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలకు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. అణ్వాయుధ సామర్థ్యం ఉన్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-5'కి.. ఐదు వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంది. అగ్ని-1 నుంచి అగ్ని-4 రకం క్షిపణులు 700-3,500 కి.మీ. మధ్య దూరాన్ని ఇవి చేరుకోగలవు. అవన్నీ మన రక్షణ బలగాలకు అందుబాటులోకి వచ్చాయి.



విశాఖ స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం ఎదుట రహదారిపై నిరసన తెలుపుతున్న మహిళా కార్మికులు

నూతన వేతనాలు అమలు చేయాల్సిందే

'ఉక్కు' ప్రధాన పరిపాలన భవనం ఎదుట మహిళా కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

నూతన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ మహిళా కార్మికులు సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా చేశారు. విశాఖ ఉక్కు సామర్థ్యానికి తగ్గ ఉత్పత్తి జరపాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కలపాలని, నూతన వేతనాలు అమలు చేయాలని ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఉత్పత్తికి సరిపడా ముడి సరుకు అందజేయాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినదించారు. మహిళా కార్మికుల ధర్నాకు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, యువ కార్మికులు మద్దతుగా నిలబడి నిరసనలో పాల్గొన్నారు. అనేక సవాళ్లతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు సాధించినప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయంతో తమ ఆశలు అడియాసలయ్యాయని మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఈ ప్రాంత అభివృద్ధికి ఆటంకంగా మారుతుందన్నారు. విశాఖ ఉక్కుకు మద్దతుగా పెద్ద ఎత్తున ప్రజా సంఘాలు ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడం ద్వారా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలమన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఇప్పటివరకు అనేక ఉద్యమాలు జరిగినా మహిళా కార్మికులు నిరసన తెలపడం ఇదే ప్రథమం.

'సర్దుబాటు' తప్పదు

- రైల్వేలకు యూనిట్‌కు రూపాయి పెంపు
- విద్యుత్‌ టారిఫ్‌ విడుదల చేసిన ఎపిఇఆర్‌సి



టారిఫ్‌ను విడుదల చేస్తున్న సివి నాగార్జునరెడ్డి, ఠాకూర్‌ రామసింగ్‌, పి. వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్‌ వినియోగదారులపై వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా ఫ్యూయల్‌ అండ్‌ పవర్‌ పర్చేజ్‌ కాస్ట్‌ అడ్జస్ట్‌మెంట్‌ (ఎఫ్‌పిపిసిఎ) ((ఇంధన కొనుగోలు సర్దుబాటు ఛార్జీలు)) భారం పడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి నెల వినియగదారుల నుంచి రెండు ఎఫ్‌పిపిసిఎ చార్జీలను, ఒక ట్రూఅప్‌ చార్జీలను వసూలు చేస్తూ మూడు భారాలను వినియోగదారుల నుంచి పిండితున్నాయి.ఎఫ్‌పిపిసిఎ యూనిట్‌కు 40పైసలు తగ్గకుండా డిస్కంలు వసూలు చేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మూడు డిస్కంలు సుమారు రూ.5000కోట్లు ఎఫ్‌పిపిసిఎ రూపంలో వసూలు చేశాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా ఎఫ్‌పిపిసిఎ చార్జీల భారం వినియోగదారులపై ఉంటుందని ఆంధ్రప్రదేశ్‌ విద్యుత్‌ నియంత్రణ మండలి(ఎపిఈఆర్‌సి) ఛైర్మన్‌ జస్టిస్‌ సివి నాగార్జున రెడ్డి వెల్లడించారు. అయితే ఈ భారం సాధ్యమైన మేరకు తక్కువ చేసి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా టారీఫ్‌ రూపొం దించామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్‌ టారీఫ్‌ను సోమవారం విజయవాడలో విడుదల చేశారు. గృహా వినియోగదారులపై ఎలాంటి భారం మోపలేదని చెప్పిన ఛైర్మన్‌ ఎఫ్‌పిపిసిఎ చార్జీలు కొనసాగుతాయని చెప్పారు. విద్యుత్‌ పంపిణీ సంస్థలకు సకాలంలో రాష్ట్రప్రభుత్వం చెల్లించాలని, చెల్లింపులు ఆలస్యమయితే వడ్డీ చెల్లించాల్సి ఉంటుందనే నిబంధనను 2024-25 విద్యుత్‌ టారీఫ్‌లో పొందుపరిచామని తెలిపారు. రైల్వేకు డిస్కంలు ప్రస్తుతం అందిస్తున్న టారీఫ్‌ను రూ.5.50ల నుంచి రూ.6.50లకు పెంచేందుకు అనుమతి ఇచ్చిన్నట్లు తెలిపారు. వార్షిక ఆదాయ అవసరాలుగా డిస్కంలు రూ.56,573.03 కోట్లు ప్రతిపాదించాయని, ఇందులో రూ.56,501.81కోట్లకు అనుమతి ఇచ్చిన్నట్లు చెప్పారు. ఆదాయ లోటును డిస్కంలు రూ.13,624.67కోట్లుగా చూపాయని తెలిపారు. డిబిటి, ఇతర సబ్సిడీలు కూడా కలుపుకుంటే లోటు రూ.15,299.18 కోట్లుగా కమిషన్‌ నిర్ణయించిందన్నారు. ఈ మొత్తం లోటును చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తమకు లేఖ ద్వారా తెలిపిందన్నారు. గ్రీన్‌ టారిఫ్‌ను రూ.1కు పెంచాలన్న డిస్కంల ప్రతిపాదననుఆమోదించలేదని చెప్పారు. విద్యుత్‌ వాహన చార్జీంగ్‌, స్టేషన్లకు అందించే విద్యుత్‌ సేవా ఖర్చును పెంచాలన్న ప్రతిపాదనను కూడా అంగీకరించలేదన్నారు. సగ్గు బియ్యం మిల్లులను సీజనల్‌ పరిశ్రమల విభాగంలో చేర్చిన్నట్లు చెప్పారు. పౌల్ట్రీ క్షేత్రాలు కార్యకలాపాలకు అనుబంధంగా ఉన్న కార్యాలయం, సిబ్బంది క్వార్టర్స్‌ విద్యుత్‌ వినియోగంలో 5శాతం పౌల్ట్రీ కేటగిరి కింద అనుమతించిన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎపిఇఆర్‌సి సభ్యులు ఠాకూర్‌ రామసింగ్‌, పి వెంకట రామరెడ్డి, జెన్‌కో ఎండి కెవిఎన్‌ చక్రధర్‌ బాబు, ఎపిసిపిడిసిఎల్‌ సిఎండి కె సంతోష్‌ రావు పాల్గొన్నారు.

బిజెపి గురించి మాట్లాడరేం?

- వైసిపికి వి శ్రీనివాసరావు సూటిప్రశ్న

ప్రజాశక్తి-పాలకొల్లు(పశ్చిమగోదావరి జిల్లా)

బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలోనూ రాష్ట్ర విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయని బిజెపి కేంద్ర ప్రభుత్వంపైగానీ, మోడీపైగానీ సిఎం జగన్‌ మాట్లాడలేదెందుకని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. బిజెపి పట్ల వైసిపి వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయన పాలకొల్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జత కట్టడం రాష్ట్రానికి హానికరమన్నారు. రాష్ట్రానికి శత్రువైన బిజెపిని గత ఐదేళ్లలో వైసిపి పల్లెత్తు మాట అనలేదని తెలిపారు. ఎన్‌డిఎలో ప్రత్యక్షంగా లేకపోయినా బిజెపినిగానీ, మోడీనిగానీ అన్ని విధాల సమర్థించిందని గుర్తు చేశారు. జగన్‌ కలబొల్లి కబుర్లు చెబితే ఉపయోగం లేదని, బిజెపి పట్ల తమ వైఖరి స్పష్టం చేయకపోవడమంటే మైనార్టీలను మోసగించడమేనని, రాష్ట్రాభివృద్ధిని కాలరాయడమేనని విమర్శించారు. రాష్ట్రంలో 22 ఎంపీ సీట్లు, 52 శాతం ఓట్లు వైసిపికి ఇచ్చినా ఇంకా 25 ఎంపీలు, 175 ఎంఎల్‌ఎలు కావాలని జగన్‌ కోరుకోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. ఈ భారీ మెజార్టీతో తిరిగి రాష్ట్రాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టడానికేనా? అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి ఏ ఒక్క సందర్భంలోనూ బిజెపితో వైసిపి పోరాడలేదని, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు, రాజధాని నిధుల గురించి నిలదీయలేదని గుర్తు చేశారు. కనీసం పార్లమెంట్‌లోనూ పోరాడలేదన్నారు. కేంద్రంలోని బిజెపి తమకు 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెబుతోందని, ప్రజలకు విద్య, వైద్యం, మైనార్టీల హక్కులు రక్షించడానికి రాజ్యాంగ సవరణ చేస్తే తమకు అభ్యంతరం లేదని, రాజ్యాంగంలోని లౌకికవాదం తీసివేయడానికి కుట్ర చేస్తే తాము అంగీకరించబోమని తేల్చి చెప్పారు. రాజ్యాంగ సవరణపై టిడిపి, జనసేన, వైసిపి తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్‌ చేశారు. దేశంలో ఇండియా వేదిక బలపడుతోందని, దీంతో, మోడీ భయపడుతున్నారని వివరించారు. మేదరమెట్ల సిద్ధం సభకు రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శించారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీకి జగన్‌ నాలుగుసార్లు భూమి పూజ చేశారని, ఇప్పటికీ ఒక ఇటుక కూడా పడలేదని తెలిపారు. రైతులు గిట్టుబాటు ధర కోసం కేంద్రంపై పోరాడితే కనీసం జగన్‌ తన వైఖరి స్పష్టం చేయలేదని, పార్లమెంట్లో కనీసం రైతుల సమస్యపై వైసిపి ఎంపీలు మాట్లాడలేదని గుర్తు చేశారు. ఎలక్ట్రోరల్‌ బాండ్ల వివరాలు ఎస్‌బిఐ తక్షణం బహిర్గతం చేయాలని శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఎస్‌బిఐ జాప్యం చేయడం దారుణమన్నారు. సిపిఎం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్‌, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్‌ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను ఒంటి గంట వరకే నిర్వహించాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎండల తీవ్రత నేపథ్యంలో మార్చి నెల నుంచి జూన్‌ వరకూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఒంటి గంటకు సెంటర్లను మూసివేసి ఇంటికి వెళ్లేలా అవకాశం కల్పించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ (సిఐటియు) కోరింది. ఈ మేరకు స్త్రీ, శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ, డైరెక్టర్‌కు యూనియన్‌ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఎన్‌సిహెచ్‌ సుప్రజ సోమవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతోందని, సెంటర్లకు వస్తున్న ప్రీ స్కూల్‌ పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మార్చి నుంచి జూన్‌ నెల వరకూ సెంటర్లను ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నడపాలని కోరారు. కొన్నిచోట్ల 1000, 1200 మంది ఉన్నచోట కూడా మినీవర్కర్లు పనిచేస్తున్నారని, వారికి పనిభారం పెరిగిందని వివరించారు. వారికి ఎటువంటి సెలవులూ ఇవ్వడం లేదని, సమానంగా వేతనాలు ఇవ్వాలని, వేసవి సెలవులు మినీవర్కర్లకు అమలు చేయాలని కోరారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ డ్రైవర్లకు కనీస వేతనం చెల్లించాలి

- యూనియన్‌ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో డ్రైవర్లందరికీ కనీస వేతనాలు చెల్లించి ఆదుకోవాలని ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో దాదాపు 500 మంది డ్రైవర్లు ఈ ఎక్స్‌ప్రెస్‌ల విధి నిర్వహణలో ఉన్నారని, వారికి నెలకు రూ.7,870 మాత్రమే చెల్లిస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఈ ఉద్యోగులకు అవుట్‌సోర్సింగ్‌ కింద వేతనం రూ.18,500 చెల్లించాలని, చట్ట ప్రకారం వీక్లీ ఆఫ్‌లు, పండగ రోజుల్లో సెలవులు అమలు చేయాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా 104 వాహనాల్లో డ్యూటీలు చేయించకూడదన్నారు. ప్రమాద, ఆరోగ్య బీమా, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయడంతోపాటు వైద్యారోగ్యశాఖ చేపట్టే వివిధ నియామకాల్లో ఈ డ్రైవర్లకు వెయిటేజీ కల్పించాలని డిమాండ్‌ చేశారు.

అసైన్డ్‌ భూముల కుంభకోణంలో రూ.4,400 కోట్ల స్కామ్‌

- చంద్రబాబు, నారాయణపై సిఐడి ఛార్జిషీట్‌

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి నిర్మాణంలో అసైన్డ్‌ భూముల కుంభకోణంలో టిడిపి ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకూ రూ.4,400 కోట్ల స్కామ్‌ చేసినట్లు ఎపి సిఐడి పేర్కొంది. ఈ మేరకు సోమవారం విజయవాడలోని ఎసిబి కోర్టులో సిఐడి ఛార్జిషీట్‌ దాఖలు చేసింది. టిడిపి ప్రభుత్వం జిఓ నెంబరు 41 ద్వారా మందడం, వెలగపూడి. రాయపూడి, ఉద్దండరాయుని పాలెం తదితర గ్రామాల్లో 1,100 ఎకరాల మేర అసైన్డ్‌ భూములను సమీకరించినట్లు పేర్కొంది. ఇందులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ, తుళ్లూరు మాజీ తహశీల్దారు అన్నె సుధీర్‌బాబు, రామకృష్ణ హౌసింగ్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఎమ్‌డి అంజనీకుమార్‌ అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొంది. అసైన్డ్‌ భూములను కాజేసేందుకు రికార్డులను కూడా ట్యాంపరింగ్‌ చేసినట్లు ఆరోపించింది. అమరావతి రాజధానిలో భారీ భూ దోపిడీ, క్యాపిటల్‌ సిటీ ప్లాన్‌తో భూ దోపిడీకి పాల్పడినట్లు సిఐడి పేర్కొంది. గతేడాది స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కేసులో చంద్రబాబును 52 రోజులపాటు జైలులో వుంచిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరో కేసులో ఛార్జిషీట్‌ వేయడం పట్ల టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

హక్కుల కోసం ఐక్య పోరాటాలు

- ఎమ్మెల్సీ కెఎస్‌ లక్ష్మణరావు
- పర్సా శతజయంతిని పురస్కరించుకుని సావనీర్‌ ఆవిష్కరణ



సావనీర్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ సిఐటియు అగ్రనేత పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో తమ హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని ఎమ్మెల్సీ కెఎస్‌ లక్ష్మణరావు కోరారు. పర్సా శతజయంతిని పురస్కరించుకొని గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర సదస్సు సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ను సోమవారం బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో లక్ష్మణరావు ఆవిష్కరించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న వేతనాల పెంపు, ఎనిమిది గంటల పనివిధానం, ఇతర అనేక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో సిఐటియు నేతృత్వంలో అంగన్‌వాడీలు, మున్సిపల్‌ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఆశా, విఆర్‌ఎలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి కొన్ని హక్కులు సాధించుకున్నారని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పర్సా సత్యనారాయణ శతజయంతి రాష్ట్ర సెమినార్‌ నిర్వహణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

మధ్య తరగతి ఉద్యోగుల సమన్వయ కమిటీ కన్వీనర్‌ వి.వి.కె.సురేష్‌, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు, మోసం

- భరించలేక చిరువ్యాపారి ఆత్మహత్యాయత్నం





గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శరత్‌ కుమార్‌ ప్రక్కన శరత్‌కుమార్‌ రాసిన లేఖ

ప్రజాశక్తి- మేడికొండూరు (గుంటూరు జిల్లా)

అసలు కంటే వడ్డీ అధికంగా వసూలు చేయడంతోపాటు ఉన్న కొద్దిపాటి పొలాన్నీ కాజేసిన వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక బిసి సామాజిక తరగతికి చెందిన చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. దీనిపై బాధితుడు లేఖ రాయడంతోపాటు సెల్ఫీ వీడియో తీసుకున్నారు. బాధితుని కథనం ప్రకారం... మేడికొండూరుకు చెందిన వేములకొండ శరత్‌కుమార్‌ కూరగాయల విక్రయిస్తూ ఉంటారు. వ్యాపార అవసరాల కోసం స్థానిక వడ్డీ వ్యాపారి నెలకుదిటి చైతన్య వద్ద రూ.5 లక్షలను కొన్నాళ్ల క్రితం తీసుకున్నారు. అప్పుతోపాటు వడ్డీని రూ.10 లక్షల వరకు విడతల వారీగా చెల్లించారు. అయితే, ఈ తర్వాత శరత్‌కుమార్‌ తల్లిదండ్రులను చైతన్య పిలిపించారు. 'మీ అబ్బాయి అప్పు తీసుకున్నాడు. వడ్డీ చాలా అయింది. కొంత కట్టినా ఇంకా రూ.10 లక్షలు కట్టాలి. అప్పునకు బదులుగా శరత్‌కుమార్‌, ఆయన సోదరుని పేరుతో సర్వే నంబర్‌ 21/2లోని నివాస స్థలాన్ని ఇవ్వాలి' అని ఒత్తిడి చేశారు. ఇందుకు శరత్‌కుమార్‌ తల్లిదండ్రులు అంగీకరించారు. చైతన్య అంతటితో ఆగకుండా శరత్‌కుమార్‌ కుటుంబం నివాసం ఉండే పోరంబోకు స్థలంలోని ఇంటిపైనా కన్నేశారు. ఆ ఇంటిని తనఖా పెట్టించి లోన్‌ ఇప్పిస్తామని శరత్‌కుమార్‌ తల్లిదండ్రులను నమ్మించారు. లోన్‌ పొందడానికి అవసరమైన రిజిస్ట్రేషన్‌ పత్రాలనూ రెవెన్యూ, రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో పుట్టించారు. రూ.7 లక్షల లోన్‌ మంజూరవగా దాన్ని కూడా ముందుగానే పథకం ప్రకారం రాయించుకున్న చెక్కులతో డ్రా చేసుకున్నారు. లోన్‌ తమ ఖాతాలో జమైనట్లు శరత్‌కుమార్‌ తల్లిదండ్రులకు ఫోన్‌ మేసేజ్‌ రాగా దాన్ని తీసుకుని వారు బ్యాంకుకు వెళ్లారు. తీరా ఆ డబ్బులు డ్రా అయినట్లు శరత్‌కుమార్‌ తెలుసుకొని తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో, లేఖ, సెల్ఫీ వీడియో ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం స్థానిక కోల్డ్‌ స్టోరేజీ సమీపంలో పురుగుల మందు తాగారు. వెళ్తున్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా, వారు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్‌)కు ఆయనను తరలించారు. విషయం తమ దృష్టికి వచ్చిందని, ఆస్పత్రి నుండి బాధితుని వాగ్మూలం వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని మేడికొండూరు సిఐ డి.జయకుమార్‌ తెలిపారు.

భర్త దారుణ హత్య

తట్టుకోలేక గుండెపోటుతో భార్య మృతి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



మూర్తిరావు, శోభ దంపతులు

అనంతపురం జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కాంట్రాక్టు అధ్యాపకుడిని ఆయన మేనల్లుడు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ హత్యను కళ్లారా చూసిన అధ్యాపకుడి భార్య గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పామిడి మండల కేంద్రానికి చెందిన మూర్తిరావు గోఖలే (59), ఆయన భార్య శోభ (56)లు అనంతపురంలోని జెఎన్‌టియు కళాశాల వద్ద ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. మూర్తిరావు అనంతపురంలోని అనంత లక్ష్మి ప్రయివేటు ఇంజనీరింగ్‌ కళాశాలలో ప్రిన్సిపల్‌గా చేసేవారు. ఇటీవల ఆ ఉద్యోగాన్ని వదిలేసి ఎస్‌కె యూనివర్సిటీలో ప్రయివేటు అధ్యాపకునిగా చేరారు. శోభ శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పిన్నదరి ఉన్నత పాఠశాలలో బయాలజీ సహాయకురాలిగా పని చేస్తున్నారు. మూర్తిరావు కు తన అక్క కుమారుడు ఆదిత్యతో గత కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. మూర్తిరావు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని ఉద్యోగం ఇప్పించక పోగా డబ్బులూ వెనక్కి ఇవ్వకపోవడంతో ఆదిత్య ఆయనపై కోపం పెంచుకు న్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదిత్య ఆదివారం రాత్రి మూర్తిరావు ఇంటికి వచ్చి ఉద్యోగం విషయంపై గొడవపడ్డాడు. ఈ ఘర్షణ అధికమై మూర్తిరావును ఆదిత్య తనతో పాటు తెచ్చుకున్న కత్తితో దారుణంగా పొడిచి హత్య చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం అయ్యి మూర్తిరావు అక్కడిక్కడే మరణించారు. కళ్లేదుటే భర్త మరణాన్ని చూసిన శోభ షాక్‌కు గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకేసారి భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఆదిత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'బేవరేజెస్‌' ఎమ్‌డిని బదిలీ చేయాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి బేవరేజెస్‌ కార్పొరేషన్‌ ఎమ్‌డి వాసుదేవరెడ్డిని బదిలీ చేయాలని టిడిపి కోరింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు సోమవారం లేఖ రాశారు. రాష్ట్రంలో మద్యం ఉత్పత్తి చేస్తున్న డిస్టిలరీలు ఎక్కువ శాతం అధికార పార్టీ నాయకుల ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఓటర్లకు లిక్కర్‌ పంపిణీ చేసేందుకు వైసిపి నాయకులు ఇప్పటికే పెద్దయెత్తున స్టాక్‌ పెట్టుకున్నారని అన్నారు. బేవరేజెస్‌ కార్పొరేషన్‌, ఎక్సైజ్‌శాఖ, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తోందని పేర్కొన్నారు.

కొండెపి, పాతపట్నం నియోజకవర్గాల్లో ప్రభుత్వ అధికారులు వైసిపి కార్యకర్తల్లా మారారని టిడిపి పొలిట్‌ బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్‌.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి విడివిడిగా రెండు లేఖలు రాశారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో జగన్‌ విఫలం : కనకమేడల

సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణను విస్మరించి రాష్ట్రంలో తీవ్ర దుర్భిక్షానికి జగన్‌ ప్రభుత్వం కారణమైందని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రకుమార్‌ విమర్శించారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. మేదరమెట్లలో జగన్‌ నిర్వహించింది సిద్ధం కాదని, మయసభ అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు.

లోకేష్‌ నిర్వహిస్తున్న శంఖారావం సభలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతూ డిజిపికి వర్ల లేఖ రాశారు.

చిలకలూరిపేట సభకు నిర్వహణ కమిటీలు

టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడిగా ఈ నెల 17న చిలకలూరిపేటలో నిర్వహించనున్న సభకు ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేస్తూ అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. అచ్చెన్నాయుడుతో పాటు, టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌, నాయకులు అనగాని సత్యప్రసాద్‌, జివి ఆంజనేయులు, గొట్టిపాటి రవికుమార్‌, నిమ్మల రామానాయుడు, కిలారు రాజేష్‌, జనసేన నుంచి గద్దె వెంకటేశ్వరరావు, రియాజ్‌, చిల్లపల్లి శ్రీనివాస్‌, బిజెపి నుంచి పాతూరి నాగభూషణం, దయాకర్‌ రెడ్డితో కలిసి సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. వీటితో పాటు వేదిక నిర్వహణ కమిటీ, సభా ప్రాంగణం కమిటీ, ఫుడ్‌ అండ్‌ వాటర్‌ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

- పాత్రికేయులపై దాడుల నివారణకు కమిటీ
- రాష్ట్ర ప్రభుత్వానికి ఎపిడబ్ల్యుజెఎఫ్‌ వినతి



ఐఅండ్‌పిఆర్‌ జాయింట్‌ డైరెక్టర్‌ కస్తూరికి వినతిపత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌.వెంకట్రావు, జి.ఆంజనేయులు తదితరులు

ప్రజాశక్తి- విజయవాడ

ప్రభుత్వం జారీ చేసిన జిఓను అమలు చేసి జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌ వర్కింగ్‌ జర్నలిస్ట్స్‌ ఫెడరేషన్‌ (ఎపిడబ్ల్యుజెఎఫ్‌) నాయకులు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ జాయింట్‌ డైరెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీని నియమించాలని, జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకం కొనసాగించాలని కోరారు. విజయవాడలోని ఐ అండ్‌ పిఆర్‌ కమిషనర్‌ కార్యాలయంలో జాయింట్‌ డైరెక్టర్‌ కస్తూరిని ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌.వెంకట్రావు, జి.ఆంజనేయులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎంబి.నాథన్‌ కలిశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడిని కోరారు. జిల్లాలో కమిటీలు ఇప్పటికే జాబితాలను తయారు చేశాయని, ఫిబ్రవరిలో మరో వారం రోజులు అవకాశం కల్పించినందున మరికొంతమంది జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకున్నారని, ఈ నేపథ్యంలో తుది జాబితాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై దాడుల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం హోంమంత్రి నేతృత్వంలో వెంటనే హైపవర్‌ కమిటీని నియమించాలని, జిల్లాల్లోనూ ఇటువంటి కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వోద్యోగులకు ఎటువంటి రక్షణ ఉంటుందో అటువంటి చట్టబద్ధమైన రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 31వ తేదీతో జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకం గడువు ముగిసిపోతుందని, దాని కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జెడి కస్తూరి స్పందిస్తూ ఈ మూడు అంశాలపై ఆర్థిక శాఖకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్లకు, ఎస్‌పిలకు ఎపిడబ్ల్యుజెఎఫ్‌ నాయకులు ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు.

పరిశ్రమలు నిర్మించని భూములను వెనక్కు తీసుకుంటాం

- చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది : లోకేష్‌
- అనంతపురంలో ముగిసిన శంఖారావం సభలు



శంఖారావం సభలో ప్రసంగిస్తున్న నారా లోకేష్‌

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'లేపాక్షి నాలెడ్జి హబ్‌, సైన్స్‌ సిటీ పేరుతో రైతుల నుంచి సేకరించిన వేలాది ఎకరాల భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక ఆ భూములను వెనక్కు తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ అన్నారు. ఆ భూముల్లో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిఎస్‌టి వలన చేనేత కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అధికారంలోకి వస్తే చేనేత వస్త్రాలపై చెల్లించాల్సిన జిఎస్‌టిని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో చేపట్టిన శంఖారావ సభలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఆయన అనంతపురం, తాడిపత్రి నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఈ సభల్లో లోకేష్‌ మాట్లాడుతూ.. వైసిపి నిర్వహించిన సిద్ధం సభకు బాహుబలి టైటిల్‌ వేసి పులకేశి సినిమా చూపించారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క మాట అయినా జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారా? అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం అమలు చేశాకే ఓటు అడుగుతానని చెప్పారని, ఇప్పుడు ఏం చెప్పి ఓట్లు అడుగుతారని నిలదీశారు. ఏటా డిఎస్‌సి నిర్వహిస్తామని, ఏడాదికి 6300 కానిస్టేబుల్‌ పోస్టులను భర్తీ చేస్తామని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ఏటా పద్ధతి ప్రకారం నోటిఫికేషన్లు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ఐదేళ్ల కాలంలో మైనార్టీలపై దాడులు పెరిగాయని, నంద్యాలలో ఒక కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లాలో ఎమ్మెల్యే కూతురుకంటే మైనార్టీ బాలికకు ఎక్కువ మార్కులు వస్తున్నాయని, టిసి ఇచ్చి పంపిస్తే ఆ బాలిక ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే బిసిలకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తామని, ఆదరణ పథకానికి రూ. ఐదు వేల కోట్లు ఖర్చు పెడతామని హామీ ఇచ్చారు. చంద్రన్న బీమా కింద రూ. పది లక్షలు, పెళ్లి కానుక కింద రూ. లక్ష రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌ చౌదరి, తాడిపత్రి మున్సిపల్‌ చెర్మన్‌ జెసి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి, ఇతరులను అరెస్టు చేయబోం

- హైకోర్టుకు సిఐడి హామీ

ప్రజాశక్తి-అమరావతి

జిఎస్‌టి ఎగవేత, బోగస్‌ ఇన్వాయిస్‌లతో నిధుల మళ్లింపు అభియోగాల కేసులో నిందితులుగా ఉన్న టిడిపికి చెందిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతోపాటు ఇతరులను అరెస్టు చేయబోమని హైకోర్టుకు సిఐడి హామీ ఇచ్చింది. ఈ కేసులో ప్రత్తిపాటి పుల్లారావు భార్య వెంకాయమ్మ, కుమార్తె స్వాతితోపాటు ఇతరులు జోగేశ్వరరావు, బొగ్గవరపు అంకమ్మరావు, బొగ్గవరపు నాగమణి, బిఎస్‌ఆర్‌ ఇన్ఫ్రాటెక్‌ లిమిటెడ్‌ ఇండియా ఎమ్‌డి బలుసు శ్రీనివాసరావు నిందితులుగా ఉన్నారు. సిఐడి వినతి మేరకు కేసు విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్‌ జస్టిస్‌ టి మల్లికార్జునరావు సోమవారం ప్రకటించారు. ఎపి స్టేట్‌ డైరెక్టరేట్‌ ఆఫ్‌ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌ (ఎపిఎసిఆర్‌ఎ) డిప్యూటీ డైరెక్టర్‌ ఎస్‌ సీతారామిరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్‌ ఇవ్వాలని వారంతా హైకోర్టును ఆశ్రయించారు.

ఇదే కేసులో ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను విచారణ చేసే నిమిత్తం పది రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు విజయవాడ ఫస్ట్‌ అడిషనల్‌ చీఫ్‌ మెట్రోపాలిటన్‌ మేజిస్ట్రేట్‌ కోర్టులో వేసిన పిటిషన్‌ను అక్కడి కోర్టు తిరస్కరించింది. ఈ చర్యను సిఐడి సవాల్‌ చేస్తూ హైకోర్టులో క్రిమినల్‌ రివిజన్‌ పిటిషన్‌ దాఖలు చేసింది. దీనిపై సోమవారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాలు రాతపూర్వక వాదనలు తెలియజేయాలని జస్టిస్‌ టి మల్లికార్జునరావు ఆదేశించారు. విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

జెవివి నేత అనుమకొండ సురేష్‌ ఇకలేరు

ప్రజాశక్తి- హైదరాబాద్‌, గ్రేటర్‌ విశాఖ బ్యూరోలు



జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య సబ్‌కమిటీ కన్వీనర్‌ అనుమకొండ సురేష్‌ (60) సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా కేన్సర్‌ వ్యాధితో బాధపడుతున్న ఆయన యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకుని కోలుకున్నారు. మళ్లీ వ్యాధి తిరగబడడంతో పది రోజుల క్రితం కుటుంబసభ్యులు ఆయనను ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం సురేష్‌ మృతి చెందారు. భౌతికకాయాన్ని తెల్లాపూర్‌లోని ఆయన కుమార్తె ఇంటికి తరలించారు. మంగళవారం ఉదయం తెల్లాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సురేష్‌ మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. 1995లో సిపిఎంలో సురేష్‌ చేరారు. 'ప్రజాశక్తి'లో కొంతకాలం పనిచేశారు. మెడికల్‌ రిప్రజెంటేటివ్‌ సంఘం రాష్ట్ర నాయకునిగా, విశాఖ సిటీ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శిగా సేవలందించారు. సురేష్‌ మృతి పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ప్రజాశక్తి ఎడిటర్‌ బి. తులసీదాస్‌, సిజిఎం అచ్యుతరావు సంతాపం తెలిపారు.

వివేకా హత్యకేసు నిందితుడు శివశంకర్‌ రెడ్డికి బెయిల్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో: మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి బెయిల్‌ మంజూరైంది. ఆయన బెయిల్‌ పిటిషన్‌పై వాదనల అనంతరం షరతులతో కూడిన బెయిల్‌ మంజూరుచేస్తూ తెలంగాణ హైకోర్టు సోమవారం తీర్పు ప్రకటించింది.

నిడదవోలు నుంచి కందుల దుర్గేష్

- ఆరో పేరును ప్రకటించిన జనసేన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గానికి కందుల దుర్గేష్ పేరును జనసేన పార్టీ సోమవారం ప్రకటించింది. తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా 24 అసెంబ్లీ స్థానాలను పొందిన జనసేన మొదట ఐదు పేర్లను మాత్రమే ప్రకటించింది. కందుల దుర్గేష్ రాజమండ్రి రూరల్ సీటును ఆశించారు. పొత్తులో సీట్ల సర్దుబాటు కొలిక్కి రాకముందే తూర్పుగోదావరి జిల్లా జనసేన కార్యకర్తల సమావేశంలో కందుల దుర్గేష్ రాజమండ్రి రూరల్ నుంచి పోటీ చేస్తారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఆ స్థానం నుంచి టిడిపి సీనియర్ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో పవన్‌కల్యాణ్‌తోపాటు కందుల దుర్గేష్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడి ఆ స్థానం టిడిపికే కేటాయించేలా, ప్రత్యామ్నాయంగా నిడదవోలును కేటాయిస్తామని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు కందుల దుర్గేష్ కూడా ఒప్పుకోవడంతో సీనియర్ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరికి లైన్ క్లియర్ అయ్యింది.

జైల్లో యువకుడు మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

విజయవాడ సబ్ జైల్లో యువకుడు మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. సబ్‌జైల్లో అనుమానాస్పదంగా మృతిచెందిన రజక యువకుడు వాడపర్తి గంగాధర తిలక్ కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. విజయవాడలో తిలక్ కుటుంబ సభ్యులను పలువురు రజక సంఘం నాయకులతో కలిసి సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ.. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద తిలక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపిచారని, అయితే అతను రిమాండ్‌కు వెళ్లి 24 గంటలు గడవకముందే మృతిచెందటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై స్పందించి, మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. రిమాండ్‌లో ఉన్న వ్యక్తి మృతికి కారణమైన వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర నాయకులు కోరట్ల శ్రీనివాసరావు, మహేష్ తదితరులు ఉన్నారు

బిజెపి, మోడీది నల్లడబ్బు రాజకీయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌బిఐ కార్యాలయాల వద్ద ఆందోళనలు



విశాఖ జైలురోడ్డు సమీపంలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఆ వివరాలను తొక్కిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం, ఎస్‌బిఐ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌బిఐ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. బిజెపి, మోడీ నల్లడబ్బు రాజకీయాలు చేస్తున్నారని, దొంగ డబ్బుతో రాజకీయం చేస్తున్న బిజెపికి పరిపాలించే అర్హత లేదని పలువురు నేతలు అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన ఎస్‌బిఐ చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అవినీతిని అంతం చేస్తామని చెప్పి మోడీ అధికారంలోకి వచ్చారని, అవినీతికి బిజెపిని కేంద్రంగా మార్చారని విమర్శించారు. దేశంలోని నల్ల ధనమంతా వారి వద్దే ఉందని ఆరోపించారు. కార్పొరేట్ల నుంచి ముడుపులు తీసుకుని బాండ్ల వివరాలను వెల్లడించకుండా కప్పిపుచ్చుతున్నారని, వారు నీతిమంతులైతే వివరాలను ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. వివరాల వెల్లడికి గడువు కావాలని ఎస్‌బిఐ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి కుట్రలు ప్రజలకు తెలిసిపోతుందనే భయంతోనే వివరాలను ఇవ్వకుండా ఎస్‌బిఐపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. తెలియని వారి నుంచి 2014-19 మధ్య బిజెపికి 45 శాతం నిధులు వచ్చాయని, ఇది ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన లెక్కలేనని తెలిపారు. 90 శాతం బాండ్లు బిజెపికే వచ్చాయన్నారు. వచ్చే ఎన్నికల్లో లక్షల కోట్ల రూపాయాలను వెదజల్లి గెలవాలని మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌పై కూడా బిజెపి కుట్రలు పన్నుతోందన్నారు. కార్పొరేట్ల నిధులు పొందిన వైసిపి, టిడిపిలు తేలుకుట్టిన దొంగల్లాగా బాండ్లపై మౌనం వహించడం తగదన్నారు. కార్పొరేట్ల నిధులను, ఎలక్ట్రోరల్ బాండ్లను తిరస్కరించిన ఏకైక పార్టీ సిపిఎం అని అన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో అవినీతిని చట్టబద్ధం చేసిన మోడీ ప్రభుత్వ తీరును కోర్టులో సిపిఎం సవాలు చేసిందన్నారు. అంబానీ, అదాని వంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ సర్కార్‌ను, బిజెపితో జత కడుతున్న వారిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. సిపిఎంకు, వామపక్షాలకు మద్దతునివ్వాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం ప్రధాన ఎస్‌బిఐ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పాల్గొన్నారు. బాపట్లలో స్టేట్ బ్యాంక్ ప్రధాన శాఖ వద్ద చేపట్టిన ఆందోళనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పాల్గొన్నారు.

విశాఖపట్నం పాత జైలురోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంక్ ప్రధాన బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనకాపల్లి, అల్లూరి, ఉమ్మడి కడప, చిత్తూరు, విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా కోనసీమ జిల్లాల్లో ఎస్‌బిఐ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. పల్నాడు, గుంటూరులో ఎస్‌బిఐ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జ్యూట్‌మిల్లు కార్మికులు

నీలం జ్యూట్ మిల్లు లాకౌట్ ఎత్తివేయాలి

- కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నీలం జ్యూట్ మిల్లు అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని, పరిశ్రమను తెరిపించి ఉపాధి కల్పించేందుకు జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని, పరిశ్రమను వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. నీలం జ్యూట్ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు మాట్లాడుతూ..యాజమాన్యం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఈ నెల నాలుగున లాకౌట్ ప్రకటించి 650 మంది కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికశాఖ అధికారులతో సంయుక్త సమావేశానికి పిలిచినా యాజమాన్యం రాకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల శ్రమతో లాభాలు గడించిన యాజమాన్యం కార్మికులతో సంప్రదించకుండా, ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా లాకౌట్ ప్రకటించడం కార్మిక చట్టాలను తుంగలో తొక్కడమేనని తెలిపారు. లాకౌట్‌పై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నీలం జ్యూట్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, నక్క సూరిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

'మిమ్స్' యాజమాన్యానికి పోలీసుల వత్తాసు

- సిఐటియు నాయకులు తమ్మినేని, టివి రమణ సహా 13 మంది అరెస్టు



సిఐటియు నాయకుల ఇంటి వద్ద అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిమ్స్ యాజమాన్యానికి పోలీసులు వత్తాసు పలికారు. మిమ్స్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో యాజమాన్యం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి పోలీసులను ఉపయోగించి సిఐటియు నాయకులపై నిర్బంధానికి పాల్పడుతోంది. సోమవారం వేకువజామున సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, టివి రమణ సహా 13 మంది మిమ్స్ ఉద్యోగులను వారి ఇళ్ల వద్ద పోలీసులు అరెస్ట్ చేసి పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో నాయకులు మాట్లాడుతూ సమస్యలపై స్పందించకుండా, మెడికల్ కళాశాలను ముట్టడి స్తారంటూ పోలీసులకు యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చి అరెస్టులు చేయించిందన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్టులు చేయడం అన్యాయమని, మిమ్స్ ఉద్యోగులు వేతన ఒప్పందం చేయాలని, బకాయి ఉన్న డిఎలు చెల్లించాలని కోరడం నేరమా అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం కొనసాగుతుందని, యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. మరోవైపు ఆస్పత్రి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరసన 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరితో ఉద్యోగులు, కార్మికులకు జనవరి జీతాలు, డిఎ బకాయిలు ఇవ్వకుండా, వేతన ఒప్పందం చేయకుండా ఇబ్బంది పెడుతోందని అన్నారు.

రాష్ట్రంలో బిజెపి, జనసేన ఉనికేలేదు

- పొత్తులకు భయపడం : మంత్రి బొత్స

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలో బిజెపి, జనసేన పార్టీల ఉనికే లేదని, ఎన్నికల తర్వాత టిడిపి కనపడకుండా పోతుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి పొత్తుపై భయపడేది లేదని, రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరొకసారి ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. విశాఖలోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా మేదమెట్ల సిద్ధం సభకు వచ్చిన జనం ప్రతిపక్షాలకు కనబడలేదని, కొన్ని పత్రికలు సిద్ధం సభకు వచ్చిన వారు గ్రాఫిక్స్ అనే భ్రమల్లో ఉన్నారని విమర్శించారు.గత పది రోజులుగా చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయాలు చూస్తున్నామన్నారు. బిజెపితో పొత్తు కోసం వెంపర్లాట, ఏం కావాలంటే అదే ఇస్తామని బిజెపికి దాసోహమవుతూ చంద్రబాబు వారి కాళ్ల వద్ద మోకరిల్లాడని విమర్శించారు. బిజెపి-టిడిపి పొత్తుకు ముందు ఒకరి గురించి ఒకరు మాట్లాడినవి వారు మర్చిపోయినా ప్రజలు మర్చిపోరని అన్నారు. అధికారం కాదు ప్రజా సంక్షేమం ముఖ్యమన్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. పొత్తుకు భయపడకుండా 175కి 175 వస్తాయి అని ధీమాతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వ హయంలో ప్రజల ఆదాయం పెరిగిందని, రైతులకు పెట్టుబడులు పెరిగాయని, ప్రజల దగ్గరకి సచివాలయం ద్వారా పాలనా వెళుతోందని, పిల్లల భవిష్యత్తుకు భరోసా లభించిందని చెప్పారు.

వైఎస్‌ఆర్ కలెక్టరేట్‌లో ఎసిబి దాడులు

- రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సి సెక్షన్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-కడప

వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సి-సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రమీల రూ.50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి గిరిధర్ ఇందుకు సంబంధించిన తెలిపిన వివరాల ప్రకారం.. చుక్కల భూములకు సంబంధించిన ఫైల్ క్లోజ్ చేసి పట్టా భూమిగా మార్చే విషయమై జిల్లాలోని వీరపునాయినిపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన వీరపు శేఖర్ అనే రైతు వద్ద నుంచి సర్వే నంబర్ 451, విస్తీర్ణం 6.64 ఎకరాలకు సంబంధించి రూ.1.50 లక్షలు లంచంగా ఇవ్వాలని ప్రమీల డిమాండ్ చేశారు. తాను అంత డబ్బులు ఒకేసారి ఇవ్వలేనని కొంచెం కొంచెం చెల్లిస్తానని శేఖర్ చెప్పారు. అనంతరం ఎసిబిని రైతు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆ రైతు నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ప్రమీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కర్నూలులోని ఎసిబి కోర్టులో ఆమెను హాజరు పరచనున్నట్లు ఎసిబి డిఎస్‌పి తెలిపారు. దాడుల్లో సిఐలు ఎల్లమ రాజు, శ్రీనివాసరెడ్డి, అలీ, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.



రూ 50 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డ ప్రమీల.

అప్పు తీర్చండి

- అదనపు వడ్డీ చెల్లించండి
- ఇంధన శాఖకు ఆర్ఇసి డిమాండ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

-ఇంధన శాఖలో రుణ బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. వాటిని సకాలంలో తీర్చలేక పోవడంతో రుణ దాతల నుంచి వత్తిళ్లు పెరిగిపోతున్నాయి. అందులో ఎక్కువ రుణాలు ఇచ్చిన గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఇసి) తన బకాయిల కోసం అనునిత్యం రాష్ట్ర ఇంధన శాఖపై వత్తిడి తీసుకువస్తోంది. చివరకు సాధారణ వడ్డీకి అదనంగా జరిమానా వడ్డీని కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు తాజాగా రాష్ట్రానికి లేఖ కూడా రాసింది.రాష్ట్రంలోని డిస్కామ్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భారీగా రుణాలను సేకరిస్తున్న సంగతి తెలిసిందే.

ఇందులో ఆర్ఇసి నుంచే ఎక్కువ రుణాలు ఉన్నాయని తేలింది. ఇప్పటివరకు ఎపి పవర్ డెవలప్‌మెంట్ సంస్థ, రాయలసీమ కరవు నివారణ పథకాల సంస్థ, ఎపి జెన్‌కోతోపాటు మూడు డిస్కామ్‌లైన దక్షిణ, తూర్పు, సెంట్రల్ విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్ఇసి నుంచి తీసుకున్న రుణాలు ఏకంగా రూ.38,666 కోట్లుగా ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎప్పుడు చూసినా వాయిదాలు, వడ్డీల చెల్లింపులు ఓవర్‌డ్యూస్‌గానే ఉంటున్నాయని ఆర్ఇసి చెబుతోంది. అత్యధికంగా కొన్ని వాయిదాలు 66 రోజుల పాటు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని వాయిదాలు డిసెంబర్ నుంచి కూడా చెల్లింపులు జరగలేదంటూ రాష్ట్రానికి ఆర్ఇసి లేఖ రాసింది. డిసెంబర్ నుంచి మొత్తం రూ.1516 కోట్లు తమకు రావాల్సి ఉందని ఈ లేఖలో తెలిపింది.

ఇందులో వడ్డీయే ఏకంగా రూ.601 కోట్లు ఉండగా, జాప్యానికి విధించిన అదనపు జరిమానా రూ.21 కోట్ల వరకు ఉండడం గమనార్హం. వాయిదాల బకాయిల్లో అధికంగా దక్షిణ పవర్ డిస్కామ్ నుంచే ఉండగా, తరువాత స్థానంలో జెన్‌కో, తూర్పు డిస్కామ్, సెంట్రల్ డిస్కామ్‌లు ఉన్నాయి.

ఆర్‌బిఐకి రోజువారీ నివేదిక

ఆర్ఇసి అన్నది నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థ కావడంతో ఇచ్చిన ప్రతి రుణం, డిఫాల్ట్ వివరాలు రోజువారీగా రిజర్వ్‌బ్యాంకు, రుణ అధ్యయన సంస్థలకు చెప్పాల్సి ఉంటుంది. బకాయిలు పెరిగిపోతే క్రెడిట్ రేటింగ్స్‌పైనా వ్యతిరేక ప్రభావం పడుతుందని ఆర్ఇసి చెబుతోంది. ఇదే విషయాన్ని రాష్ట్రానికి కూడా ఆర్ఇసి తన లేఖలో స్పష్టం చేయడం విశేషం. వార్షికాంతం కావడంతో రుణ బకాయిల అంశం తమ సంస్థ ప్రగతిపైనా ప్రభావం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. 90 రోజు కాలపరిమితి దాటితే ఎన్‌పిఏలోకి చేరిపోతారని, ఇదే జరిగితే ఇతర బ్యాంకుల నుంచి కూడా రుణాలు పొందే అవకాశాలు ఉండబోవని హెచ్చరించింది.

ఆర్ఇసికి చెల్లించాల్సిన బకాయిల వివరాలు (రూ. కోట్లలో)

సంస్థ	అసలు	వడ్డీ	జాప్యంపై వడ్డీ	మొత్తం
ఎపిపిడిసిఎల్	50	9.29	0.51	59.80
ఎపిజెన్‌కో	123.76	133.52	4.73	262.02
ఎపిసిపిడిసిఎల్	86.91	67.76	2.37	157.04
ఎపిఎస్పీడిసిఎల్	513.43	303.80	11.71	828.94
ఎపిఇపిడిసిఎల్	118.82	73.88	2.69	195.39
ఎపిఆర్‌డిఎంపి	---	12.97	0.41	13.38
మొత్తం	**892.92**	**601.22**	**21.51**	**1,516.65**

మార్కెట్లకు 'సుప్రీం' భయాలు

- సెన్సెక్స్ 617 పాయింట్ల పతనం
- రూ.3 లక్షల కోట్ల పైగా సంపద ఆవిరి
- ఎస్‌బిఐ షేర్లకు ఎన్నికల బాండ్ల దెబ్బ



ముంబయి : ఎన్నికల బాండ్ల గుట్టు విప్పాల్సిందేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. ఎన్నికల బాండ్ల వల్ల బిజెపి భారీగా లబ్ధి పొందిందని ఇప్పటికే అనేక రిపోర్టులు స్పష్టం చేయగా.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం వాటి పూర్తి వివరాలను వెల్లడించాల్సిందేనని పేర్కొనడంతో మోడి సర్కార్ ఇరుకున పడనుందనే అంచనాల్లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఎన్నికల వేళ ఈ పరిణామం ఎటు దారి తీస్తోందోననే అనుమానాలు నెలకొన్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు మరింత ఒత్తిడిని పెంచాయి. ఈనేపథ్యంలోనే సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 617 పాయింట్లు పతనమై 73,503కు జారుకుంది. ఉదయం 74,175.93 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే ట్రేడింగ్ అయ్యింది. ఒక దశలో 73,433 కనిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 161 పాయింట్ల నష్టంతో 22,333 వద్ద ముగిసింది. అమ్మకాల దెబ్బకు బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3.15 లక్షల కోట్లు హరించుకుపోయి.. రూ.389.66 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ఆ మొత్తం మదుపర్లు నష్టపోయినట్లయ్యింది. 3,039 స్టాక్స్ పతనాన్ని చవి చూడగా.. 924 స్టాక్స్ రాణించగా.. మరో 118 సూచీలు యథాతథంగా నమోదయ్యాయి. దాదాపు పెద్ద సూచీలన్నీ నష్టాలను చవి చూశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఎస్‌బిఐ, హెచ్‌యుఎల్, టాటా కన్స్యూమర్, బజాజ్ ఆటో, ఇండుస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, ఎన్‌టిపిసి షేర్లు 1-3 శాతం పతనమయ్యాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆటో, ఎఫ్ఎంసిజి, చమురు, బ్యాంకింగ్, ఐటి, రియల్టీ, లోహ, విద్యుత్ రంగాల సూచీలు 0.5 నుంచి 1 శాతం మేర నష్టపోయాయి.

ఎస్‌బిఐ షేర్ విలవిల..

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించేందుకు ఎస్‌బిఐ అదనపు సమయం కోరడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. మార్చి 12 కల్లా (నేడు) సమాచారం ఇవ్వాలని ఆదేశించడంతో ఆ బ్యాంక్ సూచీలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఉదయం నుంచి ఎస్‌బిఐ షేర్లు పతనం వైపు పయనించాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో 2శాతం నష్టపోగా.. తుదకు 1.86 శాతం పతనంతో రూ.773.50కు పడిపోయింది. ఇంట్రాడేలో రూ.770.70 కనిష్టాన్ని తాకింది. ఫిబ్రవరి 12 తర్వాత ఒకేరోజు ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి.

సెబీతో స్మాల్ క్యాప్ సూచీలపై ఒత్తిడి..

స్మాల్ క్యాప్ సూచీల కృత్రిమ ధర పెంపునపై దృష్టి సారిస్తున్నట్లు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్మన్ మాదాబి పూరి బుచ్ పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల నిబంధనలను మార్చనున్నట్లు ప్రకటించారు. దీంతో బిఎస్ఇలో స్మాల్ క్యాప్ సూచీ 2 శాతం, మిడ్ క్యాప్ సూచీ 0.24 శాతం చొప్పున పడిపోయాయి.

స్విమ్స్‌లో 479 నర్సు పోస్టుల భర్తీ

- టిటిడి పాలకమండలి నిర్ణయాలు వెల్లడించిన చైర్మన్

ప్రజాశక్తి - తిరుమల



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి

తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో 479 నర్సు పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగిన టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు ఆయన వెల్లడించారు. టిటిడిలోని అన్ని కళాశాలల్లో సిఫార్సు లేకుండా విద్యార్థులకు హాస్టల్ వసతి కోసం అదనంగా భవనాల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. 2014కు ముందు టిటిడిలో నియమించిన కాంట్రాక్టు, పొరుగు సేవా సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. యాత్రా సముదాయంలో లిఫ్ట్‌ల ఏర్పాటుకు రూ.1.88 కోట్లు కేటాయించామని, బాలాజీనగర్ సమీపంలో ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. రూ. 14 కోట్లతో టిటిడిలోని 188 క్వార్టర్స్ ఆధునీకరణ, గోవిందరాజస్వామి ఆలయంలో బాష్యకార్ల సన్నిధిలో మకర తోరణం బంగారు తాపడం, ఐటి సేవల కోసం రూ.12 కోట్లు, శ్రీవాని ట్రస్టు నిధులతో టిటిడిలోని పురాతన ఆలయాల మరమ్మతుకు బోర్డు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీవారి ఆలయ ఉద్యోగి నరసింహన్ కుటుంబానికి రూ.ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని తీర్మానించామని తెలిపారు.

మాజీ బోర్డు సభ్యులు పదేపదే రావొద్దు

టిటిడి ధర్మకర్తల మండలి మాజీ సభ్యులకు సంవత్సరంలో కొన్నిసార్లు మాత్రమే వారి కుటుంబ సభ్యులతో (భార్యాపిల్లలు, తల్లి, తండ్రి) శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశాన్ని బోర్డు కల్పించిందని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, కుటుంబ సభ్యులతో కాకుండా ఇతరులను వెంట బెట్టుకుని పదేపదే తిరుమలకు రావడం మంచి పద్ధతి కాదన్నారు. మాజీ బోర్డు సభ్యుని హోదాలో కేవలం కుటుంబ సభ్యులతో మాత్రమే శ్రీవారి దర్శనానికి రావాలే తప్ప, ఇతరులను వెంట బెట్టుకుని వస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ శ్రీవారి దర్శనానికి అనుమతించేది లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాగుంట, పక్కన జనార్ధన్

టిడిపిలో చేరతా

- ఎంపి మాగుంట వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తాను టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. తన కుటుంబంతో పాటు అభిమానులు, శ్రేయోభిలాషులు కూడా పార్టీలో చేరతారని చెప్పారు. టిడిపి, జనసేన జిల్లా నేతలతో ఆయన తన నివాసంలో కీలకభేటీ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి అధినేత చంద్రబాబుతో మాట్లాడాక పార్టీలో ఎప్పుడు చేరేది నిర్ణయం తీసుకుంటానన్నారు. తన కుమారుడు రాఘవరెడ్డిని ఎంపిగా పోటీ చేయిస్తానని తెలిపారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ.. మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్టీలోకి రానుండడం సంతోషమన్నారు. గతంలో ఆయన పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయినప్పటికీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. మాగుంట కుటుంబాన్ని పార్టీ నేతలందరూ సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఉత్సవంగా మొల్ల జయంతి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రముఖ కవయిత్రి అటుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని శాఖలకూ దిశానిర్దేశం చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 13న ఆమె జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, కార్యదర్శులు, శాఖాధిపతులకు సూచించింది. ఇందుకయ్యే వ్యయాన్ని ఆయా శాఖలు తమకు కేటాయించిన బడ్జెట్ నిధుల నుంచే భరించాలని నిర్దేశించింది.

మహిళలకు 200 డ్రోన్ల పంపిణీ

- కోరమండల్ ఇంటర్నేషనల్ వెల్లడి

హైదరాబాద్ : వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి, మహిళా స్వయం సహాయక బృందాలకు 200 డ్రోన్‌లను అందించినట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ తెలిపింది. రంగారెడ్డి జిల్లాలోని మాణిక్యమ్మగూడ, గుంటూరుతో సహ దేశంలోని 11 ప్రాంతాలలో రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ అందించిన 200 డ్రోన్‌లతో సహా 1,000 డ్రోన్‌లను వివిధ ఎస్‌హెచ్‌జిల సభ్యులకు ప్రధాని మోడి వర్చ్యువల్‌గా అందజేశారని ఆ సంస్థ పేర్కొంది. కోరమాండల్ సరఫరా చేసిన డ్రోన్‌లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని మహిళా ఎస్‌హెచ్‌జి సభ్యులు ఉపయోగిస్తారని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ అరుణ్ అళగప్పన్ తెలిపారు.

పొరుగు దేశాలతో రూపాయల్లో వాణిజ్యం

- మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌తో అనేక దేశాలు రూపాయాల్లో వాణిజ్యం నెరవేర్చడానికి ఆసక్తి చూపుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక సహా పలు గల్ఫ్ దేశాలు ఇందుకు ముందుకు వచ్చాయని.. వాటితో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో లావాదేవీల వ్యయాలను తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. సింగపూర్ ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించిందన్నారు. దేశీయ కరెన్సీలతో వ్యాపారం వల్ల ఉన్న ప్రయోజనాలు ఇతర దేశాలకు క్రమంగా తెలుస్తోందన్నారు. డాలర్ల కొరత ఉన్న దేశాలకూ ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సౌండ్‌బార్ విభాగంలోకి అర్బన్ కంపెనీ

హైదరాబాద్ : దేశీయ సాంకేతికత బ్రాండ్ అయిన అర్బన్ కొత్తగా హార్మోనిక్ సిరీస్ సౌండ్‌బార్‌ల విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. వివిధ విభాగాలను దృష్టిలో ఉంచుకుని బ్రాండ్ హార్మోనిక్ 2240 విత్ డాల్బీ సరౌండ్ సౌండ్ అండ్ హార్మోనిక్ 1120 డీప్ బాస్ హెచ్‌డి సౌండ్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. వీటి ప్రారంభ ధరను రూ.9,999గా నిర్ణయించింది. ఇవి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ లభ్యమవుతాయని అర్బన్ సహ వ్యవస్థాపకుడు ఆశిష్ కుంభట్ తెలిపారు.

సంపాదకీయం

రాష్ట్రానికి చేటు

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ లోకి టిడిపి చేరిక ఆత్మహత్యకు మించిన అపరాధం. ముందు నుంచే ఎన్‌డిఏలో ఉన్న జనసేన, కూటమి వెలుపలున్న టిడిపిలు కలిసి పని చేస్తున్నాయి. తాజాగా ఎన్‌డిఏ గూటికి టిడిపి చేరింది. బిజెపి, టిడిపి, జనసేన పొత్తు ఖరారు చేసుకొని రానున్న ఎన్నికల్లో జాయింట్‌గా పని చేస్తామని శనివారం రాత్రి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఎవరికెన్ని సీట్లో అవగాహనకొచ్చారు. మిగిలింది సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక. అందుకూ సోమవారం కసరత్తు మొదలుపెట్టారు. రాజకీయ పార్టీల పొత్తులు వాటి ఇష్టం. కానీ ఎందుకు ఏమి ఆశించి పొత్తులోకెళ్లారో ప్రజలకు వివరించడం పార్టీల బాధ్యత. బిజెపి, టిడిపి, జనసేన పొత్తు కొత్తదేమీ కాదని సరిపెట్టడం వత్తాసు పలికేవారి పని. గతంలో కలిసుండి విడిపోయి మరలా కలవడం అనేదే చర్చనీయాంశం. 2014లో ఎందుకు కూటమి కట్టారు, 2019లో దేనిపై విభేదించి విడిపోయారు, మరలా 2024లో ఎందుకు కలుస్తున్నారు అనే ప్రశ్నలకు ఆ పార్టీలు ప్రజలకు జవాబు చెప్పాల్సిందే!

2014లో ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నీ తూచ అమలు చేస్తామని బిజెపి చేతిలో చెయ్యేసి చెప్పిందని నాడు టిడిపి, జనసేన ప్రకటించాయి. మోడీ, చంద్రబాబు, పవన్ ఉమ్మడి వేదికలపై సమిష్టిగా చేతులెత్తి అభివాదాలు చేసి మరీ ఓట్లడిగారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో బాబు అధికార పీఠాలెక్కి రాష్ట్రానికి సాధించిందేమిటి? మొదటి నాలుగేళ్లు అక్కడా ఇక్కడా పదవులు పంచుకొని చెట్టపట్టాలేసుకు తిరిగారు. తీరా నాల్గో ఏట బిజెపి హోదా ఇవ్వకుండా, విభజన హామీలివ్వకుండా మోసగించిందని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసిందని బాబు ఎన్‌డిఏ నుంచి బయటికొచ్చి బిజెపి విద్రోహంపై శ్వేతపత్రాలు, ఊరూరా ధర్మ పోరాటాలు, దీక్షలు, అసెంబ్లీలో తీర్మానాలు చేశారు. 2019 ఎన్నికల్లో ఓడిన మరుక్షణం నుంచే బిజెపిపై వ్యతిరేకతను విడనాడారు. ఇప్పుడు ఏకంగా యు టర్న్ తీసుకొని ఎన్‌డిఎ పంచన చేరారు. ఈ ఐదేళ్లల్లో బిజెపి రాష్ట్రానికి చేసిందేమీ లేదు. హోదా, పోలవరం, రైల్వేజోన్, కడప ఉక్కు, రాజధాని ఏదీ ఇవ్వలేదు. ఉన్న విశాఖ స్టీల్‌కు ఎసరు పెట్టింది. వైసిపి మూడు రాజధానులన్నా, మోడీ స్వయంగా శంకుస్థాపన చేసిన అమరావతిని చంపేస్తున్నా కేంద్ర బిజెపి మూగనోము పట్టింది. వైసిపి ప్రభుత్వ నిరంకుశ, అవినీతి, అభివృద్ధి రహిత పాలనకు మద్దతిచ్చింది. ఈ పూర్వరంగంలో జగన్‌ను ఓడించేందుకే బిజెపితో పొత్తు అని టిడిపి, జనసేన చేస్తున్న వాదన చెల్లదు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో బిజెపితో వెళ్లిన పలు పార్టీలు నష్టపోయాయన్నది అనుభవం.

బిజెపితో టిడిపి పొత్తులో టిడిపి లొంగుబాటు కనిపిస్తుంది. నోటా కంటే తక్కువ ఓట్లొచ్చిన బిజెపితో 40 శాతం ఓట్లు తెచ్చుకున్న పార్టీ అదేపనిగా వెంపర్లాడటం టిడిపి దిగజారుడును తెలుపుతుంది. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి కనీసం ప్రాయశ్చిత్తం చేసుకోలేదు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే బిజెపి అంటే టిడిపి శ్రేణుల్లోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. మైనార్టీలు, దళితులు, ఆదివాసీలు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాబు అరెస్ట్‌కు ముందే తొలుత బాబు ఢిల్లీ వెళ్లి బిజెపి పెద్దలతో మాటా మంతీ కలిపారు. ఏమైందోకాని బాబు అరెస్ట్ జరిగిపోయింది. బిజెపి ప్రోద్బలం లేకుండా బాబు అరెస్టు జరగదనేది అందరి మదిలోని మాట. అయినా బిజెపి దోస్తీకై ఢిల్లీలో పడిగాపులు పడ్డారు బాబు, పవన్ ద్వయం. దీంతో ఎవరు ఎవరిని ఆడిస్తున్నారో అర్థమవుతుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం పునాదితో పుట్టిన టిడిపి దిగజారుడు తనమిది. రాష్ట్రానికి ద్రోహం తలపెట్టిన బిజెపితో టిడిపి, జనసేన అంటకాగటంలో కొందరు పరవశించిపోవడం వెనుక వాటి దివాళాకోరుతనం కనిపిస్తుంది. రాష్ట్రాన్ని బిజెపి అంధకారంలోకి నెట్టగా, బిజెపి, టిడిపి, జనసేన పొత్తు పెనుచీకట్లు చీల్చడానికంటున్నారు. రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేసిన బిజెపితో సాన్నిహిత్యం కొత్త శుభారంభంగా వారికి కనిపించింది. రాష్ట్రాన్ని శిథిల సౌధం చేసిన బిజెపి అభివృద్ధికి కాచుకుంటుందట. కూటమిని ఆశీర్వదిస్తే రాష్ట్రం తెప్పరిల్లుతుందని భాష్యాలు చెబుతున్నారు. ఇదంతా బిజెపికి కొమ్ము కాయడానికే. బిజెపి, దాని మద్దతుదార్ల గెలుపు రాష్ట్రానికి మరణశాసనం. వైసిపి నిరంకుశత్వం ప్రజల స్వేచ్ఛకు, హక్కులకు విఘాతం.

మంచి మాట



మీరు (మహిళలు) ఏం చేసినా... మనస్ఫూర్తిగా చేయాలనుకోవాలి. ఎందుకంటే ఏదైనా పనిని కేవలం ఒక లక్ష్యం కోసం చేయడం కాక... దానిలో లీనమై అనుభవించాలి.

- కల్పనా చావ్లా,

భారతదేశంలో పుట్టి అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మహిళ.

'విశాఖ-అమరావతి' ఆర్థిక వ్యూహం- రాష్ట్రాభివృద్ధి!

విశ్లేషణ



డా॥ బి.గంగారావు

'విజన్ విశాఖ' డాక్యుమెంట్ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో మార్చి 5వ తేదీన 'ఎ.పి డెవలప్‌మెంట్ విత్ సి.ఎం'-అనే కార్యక్రమంలో సుదీర్ఘ ప్రసంగం చేశారు. రాష్ట్ర సత్వర అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ విధానం, ఆలోచనలు వెల్లడించారు. రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలంటే విశాఖపట్నం మహానగరంగా అభివృద్ధి కావాలని, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. విశాఖ పరిపాలనా రాజధానిగా మార్పుతో పాటు ముఖ్యమంత్రి విశాఖ నుండే పరిపాలన చేస్తే విదేశీ, స్వదేశీ పెట్టుబడులు విశాఖకు వరదలా వచ్చి విశాఖ రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని అన్నారు. అదే అమరావతి అయితే అంతా ఖాళీ బీడు భూమి అని, రోడ్లు, విద్యుత్, మంచినీరు వంటి కనీస మౌలిక సదుపాయాలకు ఎకరాకు రూ.2 కోట్లు చొప్పున ఖర్చు చేయలని అన్నారు. 20 ఏళ్ళలో కూడా దీనిని పూర్తిచేయలేమని...అదే విశాఖ నగరంలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, కొద్దిపాటి మౌలిక సదుపాయాలు కల్పిస్తే సరిపోతుందనే వాదన తీసుకొచ్చారు.

స్థూలంగా విశాఖ నగరాన్ని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాగా అభివృద్ధి చేస్తే రాష్ట్రం మొత్తం అభివృద్ధి అవుతుందని ముఖ్యమంత్రి వాదన. ఇది పూర్తిగా తప్పు. నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తరువాత ఈ వ్యూహాన్ని ముందుకు తెచ్చారు. పెట్టుబడులకు అనుకూలంగా మహా నగరాలను సృష్టిస్తే అభివృద్ధి జరుగుతుందనే సిద్ధాంతాన్ని అమలులోకి తీసుకొచ్చారు. కానీ గత రెండు దశాబ్దాల అనుభవం చూస్తే ఈ అభివృద్ధి నమూనా తీవ్ర అసమానతలతోపాటు సంపద కేంద్రీకరణ పెంచింది.

హైదరాబాద్ నగరాన్నే పరిశీలిద్దాం. 2022-23లో తెలంగాణ రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్‌జీడిపి) రూ.13.13 లక్షల కోట్లు. సగటు తలసరి ఆదాయం రూ. 3.13 లక్షలు. ఒక్క హైదరాబాద్, దాని చుట్టుపక్కల నుండే సుమారు రూ. 5 లక్షల కోట్లు ఆదాయం వచ్చింది. దాదాపు ఇది 38 శాతం. రంగారెడ్డి తలసరి ఆదాయం రూ. 8.15 లక్షలు, హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4 లక్షలు ఉంది. మిగిలిన జిల్లాలు చూస్తే అత్యధిక జిల్లాల తలసరి ఆదాయాలు రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కంటే దిగువనే ఉన్నాయి.

తెలంగాణ వ్యవసాయ రంగం మీద కోటి యాభై లక్షల మందికి పైగా ఉన్నారు. వీరి నుండి వస్తున్న ఆదాయం కేవలం 16 శాతం లోపే. దీనిని బట్టి అర్థమవుతుందేమిటి? సంపద అంతా హైదరాబాద్ చుట్టే కేంద్రీకృతమౌతున్నది. తీవ్ర అసమానతలు పెరుగుతున్నాయి. వ్యవసాయ రంగంపై ఆధారపడిన ప్రజలు అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడుతున్నారు. హైదరాబాదు మహా నగరంలో కూడా ప్రజల మధ్య అసమానతలు తీవ్రంగా కనిపిస్తాయి.



కర్ణాటకలో జరుగుతున్న మార్పు కూడా తెలంగాణలో వలె ఉంది. కర్ణాటక రాష్ట్ర జిడిపిలో బెంగళూరు నుండే 37 శాతం వస్తున్నది. బెంగళూరు నగర జనాభా రాష్ట్ర జనాభాలో ఆరో వంతు మాత్రమే. బెంగుళూరు తలసరి ఆదాయం రూ. 6.2 లక్షలు ఉంటే రాష్ట్రంలోని 24 జిల్లాల తలసరి ఆదాయాలు రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కంటే దిగువన ఉన్నాయి. కల్బుర్గి జిల్లా అయితే తలసరి ఆదాయం కేవలం లక్షా 25 వేలు మాత్రమే. కర్ణాటకలో అత్యధిక జిల్లాలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నాయి. తెలంగాణ వలె కర్ణాటకలో కూడా సంపద బెంగుళూరు నగరంలో కేంద్రీకరణతో పాటు అసమానతలు, వెనుకబాటు, పేదరికం పెరిగింది.

చంద్రబాబు ఆర్థిక నమూనా కూడా ఇదే. ఇందులో భాగంగానే నూతనంగా అమరావతి అనే మహా నగరాన్ని నిర్మించాలనే ఊహాచిత్రాన్ని ముందుకు తీసుకువచ్చారు. 32 వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. ఆ భూముల్ని బడా వ్యాపార వాణిజ్య సంస్థలకి పంపిణీ చేసి భారీ కట్టడాలు నిర్మిస్తే అమరావతి కూడా హైదరాబాద్, బెంగళూరు వలె ఒక మహా నగరంగా ఏర్పడి రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని చంద్రబాబు చెప్పారు. ఐదేళ్ళపాటు రంగురంగుల గ్రాఫిక్స్ చుట్టూ పరిపాలన తిప్పాడు. విశాఖ, అమరావతి చుట్టూ కేంద్రీకరించి ఆంధ్రప్రదేశ్‌ను నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారు.

స్థూలంగా విశాఖ నగరాన్ని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాగా అభివృద్ధి చేస్తే రాష్ట్రం మొత్తం అభివృద్ధి అవుతుందని ముఖ్యమంత్రి వాదన. ఇది పూర్తిగా తప్పు. నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన తరువాత ఈ వ్యూహాన్ని ముందుకు తెచ్చారు. పెట్టుబడులకు అనుకూలంగా మహా నగరాలను సృష్టిస్తే అభివృద్ధి జరుగుతుందనే సిద్ధాంతాన్ని అమలులోకి తీసుకొచ్చారు. కానీ గత రెండు దశాబ్దాల అనుభవం చూస్తే ఈ అభివృద్ధి నమూనా తీవ్ర అసమానతలతోపాటు సంపద కేంద్రీకరణ పెంచింది. తెలంగాణ వలె కర్ణాటకలో కూడా సంపద బెంగుళూరు నగరంలో కేంద్రీకరణతో పాటు అసమానతలు, వెనుకబాటు, పేదరికం పెరిగింది.

చంద్రబాబు-జగన్‌ల విధానం ఒకటే. పెద్ద పెద్ద రోడ్లు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు, స్టార్ హోటళ్లు, అంతర్జాతీయ స్టేడియంలు, మెగా షాపింగ్ మాల్స్, మెట్రో రైలు, భారీ కట్టడాలు తదితర మౌలిక సదుపాయాలు ఒక నగరం చుట్టూ వస్తే ఆ రాష్ట్రం త్వరిత గతిన అభివృద్ధి అవుతుందని అంటున్నారు. వాస్తవంగా మౌలిక సదుపాయాల కల్పన దృక్పథంలో పాలక వర్గాల్లో తీవ్ర మార్పు వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో ప్రజల తక్షణ అవసరాలు, ఉపాధి, వ్యవసాయ రంగం, అసమానతలు, వెనుకబాటుతనం...వంటివి ఆధారంగా ప్రభుత్వమే మౌలిక సదుపాయాల రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేసింది. భారీ పరిశ్రమలను కూడా ఈ దృక్పథంతోనే ప్రభుత్వం నిర్మించింది. ఇప్పుడు భారత దేశంలో మనం చూస్తున్నవన్నీ ఈ దృక్పథం నుండి వచ్చినవే.

నయా ఉదారవాద విధానాల అమలుతో 1991 అనంతరం మౌలిక సదుపాయాల దృక్పథంలో మార్పు వచ్చింది. అప్పటి వరకు అనుసరించిన విధానానికి స్వస్తి పలికారు. పెట్టుబడిదారుల లాభాలే కేంద్రంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. డెడికేటివ్ కారిడార్లు, ఆరు వరుసల రోడ్లు, బుల్లెట్ రైళ్ళు, స్టార్ హోటళ్ళు, విమానాశ్రయాలు, ప్రభుత్వ భూములు కేటాయింపు వంటి చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే నిర్మించబడ్డ మౌలిక సదుపాయాలను కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేస్తున్నారు. గతంలో బ్రిటీష్ పాలకులు కూడా భారతదేశంలో ముడిసరుకులను తమ దేశానికి తరలించుకుపోవడానికి, అక్కడ తయారైన సరుకులను భారతదేశంలో అమ్ముకోవడానికి భారతదేశంలో పోర్టులు, రైల్వేల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేశారు. ఇదే వ్యూహం నేడు మన రాష్ట్రంలోను, దేశంలోను అమలు జరుగుచున్నది.

జగన్ మోహన్‌రెడ్డి ముందుకు తెచ్చిన హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, ముంబాయి, ఢిల్లీ, కలకత్తా నగరాలన్నీ ప్రభుత్వ పెట్టుబడులతోనే మహా నగరాలుగా అభివృద్ధి అయ్యాయి తప్ప...జగన్ మోహన్‌రెడ్డి, చంద్రబాబుల ఆర్థిక నమూనా ద్వారా కాదనేది అర్థం చేసుకోవాలి.

విశాఖ నగరం అభివృద్ధి క్రమాన్ని పరిశీలిస్తే దేశంలో నగరాల అభివృద్ధికి మూలమేమిటో తెలుసుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి విశాఖ జనాభా కేవలం లక్ష మాత్రమే. స్వాతంత్ర్యం అనంతరం విశాఖలో ఉన్న విదేశీ, స్వదేశీ, పెట్టుబడిదార్ల ఆధీనంలో ఉన్న హిందుస్థాన్ షిప్‌యార్డ్, కాల్‌టెక్స్ ఆయిల్ కంపెనీలను జాతీయం చేశారు. బ్రిటీష్ ఆధీనంలో ఉన్న విశాఖ పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ తరువాత తూర్పు నావికాదళాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి యుద్ధ నౌకల మరమ్మతు యార్డుతోపాటు డిఫెన్స్ కార్యకలాపాల శాఖలను నెలకొల్పారు. ఆ తరువాత బిహెచ్‌పివి, హిందుస్థాన్ జింక్, ఎన్‌టిపిసిలను నెలకొల్పారు. విశాఖ పోర్టును విస్తరించారు. మత్స్యకారులకు ఫిషింగ్ హార్బర్ నిర్మించారు. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కార్యాలయాలు వచ్చాయి. ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించింది. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య సామాజిక, మౌలిక సదుపాయాల కల్పనలలో ఏర్పడ్డాయి. లక్షల మందికి శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. ప్రభుత్వరంగ పరిశ్రమల ఆధారంగా అనేక చిన్న పరిశ్రమల కేంద్రాలు, ప్రైవేట్ భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వ్యాపార, వాణిజ్య, సేవా కార్యకలాపాలు విస్తరణ జరిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ రాకతో విశాఖనగరం మహా నగరంగా మారింది. ఈ ఆర్థిక పరిణామ క్రమాన్ని బిజెపి నేడు ధ్వంసం చేస్తున్నది. జగన్-బాబు జంట బిజెపి విధ్వంసాన్ని మరింత ముందుకు తీసుకెళుతున్నారు.

విభజన వల్ల హైదరాబాద్‌ని కోల్పోయి అనేక కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ రాష్ట్ర జిడిపిని రూ.13.17 లక్షల కోట్లకు, రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.2.19 లక్షలకు పెంచగలిగామని ముఖ్యమంత్రి గొప్పగా తన ప్రసంగంలో పేర్కొన్నారు. వాస్తవంగా విభజన అనంతరం ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ రాష్ట్రంగా మారిపోయింది. రాష్ట్ర ఆర్థిక సామాజిక సర్వే 2022-23 ప్రకారం రాష్ట్ర జిడిపి పారిశ్రామిక వాటా 23.36శాతం, సేవారంగం వాటా 40.45శాతంకి గడిచిన పదేళ్ళలో క్షీణించి వ్యవసాయ రంగం వాటా 37శాతానికి పెరిగింది.

అయితే వ్యవసాయ రంగంలో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2022-23లో వ్యవసాయ రంగం నుండి రూ.4.39 లక్షల కోట్లు ఆధాయం వస్తే ఇందులో అత్యధిక మంది ప్రజలు ఆధారపడ్డ ఆహార పంటల నుండి కేవలం 12.33 శాతం మాత్రమే వచ్చింది. ఉద్యానవనాల నుండి 28 శాతం, పశుసంబంధిత ఆదాయం 32 శాతం, చేపలు, రొయ్యల నుండి 25 శాతం సమకూరింది. 60 శాతం ఆదాయం చేపలు, రొయ్యలు, పౌల్ట్రీ నుండి వస్తున్నదని స్పష్టమౌతున్నది. ఇంకా ఆశ్చర్యం కలిగించే అంశమేమంటే 61,682 మంది మాత్రమే జీవనం సాగిస్తున్న రొయ్యలు, చేపల చెరువుల నుండి లక్షా 11 వేల కోట్ల ఆదాయం వస్తే, 50.92 లక్షల మంది (కౌలు రైతులు మినహా) ఆధారపడి ఉన్న ఆహార పంటల నుండి రూ.54.161 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. దీనిని బట్టి వ్యవసాయ రంగంలో సృష్టించబడుతున్న ఆదాయం ఎవరి చేతుల్లోకి వెళుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

పారిశ్రామిక రంగంలో తయారీ రంగం ఎదుగూ బొదుగూ లేకుండా రాష్ట్ర జిడిపిలో 10 శాతం చుట్టే తిరుగుతున్నది. సేవారంగం నుండి వస్తున్న ఆదాయంతో 35 శాతం రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ రంగం నుండే వస్తున్నది. ఇక రాష్ట్ర తలసరి ఆదాయం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చూస్తే 13 జిల్లాల్లో 9 జిల్లాలు రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కంటే దిగువ స్థాయిలో ఉన్నాయి.

కనుక విశాఖ, అమరావతి మహానగరాల ఆర్థిక నమూనా ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనే జగన్-చంద్రబాబుల విధానం శ్రామిక జనావళి అభివృద్ధికి ఏ మాత్రం దోహదపడేది కాదు. సంపద మరింత కేంద్రీకృతమవుతుంది. అసమానతలు, ప్రాంతాల వెనుకబాటుకు దారితీస్తాయి. నేడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరింత పెరుగుతాయి. కనుక ఈ కార్పొరేట్ ఆర్థిక వ్యూహాన్ని ప్రజలు సంఘటితమై తిప్పికొడితేనే రాష్ట్రానికి, జనానికి మేలు జరుగుతుంది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792/

సెటైర్

నరేంద్ర జాలం!

మోహన సిద్ధార్థ్

అదొక పెద్ద ఆడిటోరియం.. జనంతో కిక్కిరిసింది. చిన్నారుల నుంచి పండు ముదుసలి వరకూ కార్యక్రమం ఎప్పుడు ప్రారంభమవుతుందా! అని ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

ఆడిటోరియంలో లైట్లన్నీ ఆగిపోయాయి. చిమ్మచీకటి. ఇంతలో... ఒక్కసారిగా కలకలం. ఆ గాఢాంధకారంలో... వేల పాములు బుసలు కొడుతున్నాయి. పడగెత్తి కాటేయడానికి సిద్ధమవుతున్నాయి. జనం కేకలు. ఎక్కడికి వెళ్లాలో తెలీక అంతా ఆందోళనగా తాము కూర్చున్న కుర్చీలపైకి ఎక్కారు. ఇంతలో ఒక్కసారిగా బుసలు కొట్టే సర్ప రాజాల స్థానంలో రెడ్ కార్పెట్. దాని నిండా అందంగా పరుచుకున్న గులాబీ పూల రేకులు. హమ్మయ్య! అనుకుని ఆనందంగా కుర్చీల పైనుంచి కిందికి దిగారు. పై నుంచి 500 నోట్ల వర్షం కురుస్తోంది. అందుకునేందుకు ఆత్రంగా చేతులు పైకెత్తారు. అంతలోనే ఒక్కసారిగా ఊబిలో కూరుకుపోతున్నారు. పై నుంచి నిప్పుల వాన మొదలైంది. జనం హాహాకారాలు మిన్నంటాయి. ఇంతలోనే వేగంగా వచ్చిన వేల అనకొండలు.. ఒక్కొక్కటీ ఒక్కొక్కరినీ చుట్టేసి మింగేయడానికి ఆత్రంగా తెరిచిన నోరు... మరోవైపు దూసుకొస్తున్న మదగజాల గుంపు.

ఇంతలో ఆడిటోరియం అంతా వెలుగులు విరజిమ్మాయి.. ఇంతవరకూ గుండె ఆగిపోతుందా! అన్నంత ఆందోళనపడిన జనమంతా..ఇదంతా ఇంద్రజాల ప్రదర్శన అని గుర్తొచ్చి స్థిమితపడ్డారు. కరతాళ ధ్వనులతో తమను ఆశ్చర్యపరిచే అద్భుత ప్రదర్శన ఇచ్చిన ప్రపంచ ప్రఖ్యాత భారత మెజీషియన్లందరికీ అభినందనలు తెలిపారు. ఈ ప్రదర్శన తిలకించేందుకు ప్రపంచ నలుమూలల నుంచీ విచ్చేసిన మెజీషియన్లు... అత్యద్భుతంగా మైమరిపించిన భారత మెజీషియన్లను చూసి కుళ్లుకున్నారు.

ఇంతలో భారతదేశ అతి పెద్ద మెజీషియన్ ...మాటల మాంత్రికుడు.. నరేంద్ర బాహుబలి వేదికపైకి వచ్చారు. 'మోదానీ ... మోదానీ'...నినాదాలు మిన్నంటు తున్నాయి.

ఆత్రం పట్టలేక..అమెరికా నుంచి వచ్చిన ఓ మెజీషియన్..ఇండియా మెజీషియన్‌ని అడిగాడు..'ఏమిటింత కోలాహలం...నినాదాలు...' అని. భారత మెజీషియన్ చెప్పడం మొదలెట్టాడు...



"మీ మెజీషియన్లంతా ఒక గంట..లేకుంటే ఒక పూట..ఇంద్రజాల ప్రదర్శన చేస్తారు..పాతికేళ్లుగా... గుజరాత్‌లో మొదలుపెట్టి...ఇండియా అంతటా మేజిక్ చేస్తూ..ఎప్పుడేం జరుగుతుందో ...అంతుపట్టని విధంగా ఇంద్రజాలం ప్రదర్శిస్తున్న మెజీషియన్‌ను చూసి జనం మైమరిచి చప్పట్లు కొడుతున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ పాఠాలన్నీ ఔపోసనపట్టి, వారి డైరెక్షన్‌కు అనుగుణంగా మైండ్ గేమ్ ఆడటంలో నరేంద్ర బాహుబలికి సాటి మరొకరు లేరు. గోద్రా అల్లర్లతో ఊచకోత కోసి... మత ఉద్ధారకుడుగా ముద్రవేసుకుని, గుజరాత్‌లో నేటికీ మనువాద పాలనను కొనసాగిస్తున్నాడు. 2014లో...ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు...విదేశాల్లో ఉన్న నల్ల ధనమంతా దేశంలోకి....ప్రతి భారతీయుడి ఖాతాలోకి రూ.15 లక్షలు జమ...ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా...విభజన హామీల అమలు...2019లో...దేశం కోసం...జవాన్ల కోసం..మరో అవకాశం ఇవ్వండి... రైతన్నల ఆదాయం రెండింతలు చేస్తా... ఆత్మనిర్భర్ భారత్...అంతా స్వదేశీ...2024లో..ఆర్టికల్ 370 రద్దు చేశాను కాబట్టి 370 సీట్లలో గెలిపించండి... మిత్రపక్షాలతో కలిసి 400 సీట్లపైనే ఇవ్వండి... ' అని చెప్తుండగానే... 'ఇచ్చిన హామీలన్నీ అమలయ్యాయా...!' అనడిగాడు అమెరికన్ మెజీషియన్ ఆత్రం పట్టలేక.

'అమలుజేస్తే నరేంద్రజాలం ఎలా అవుతుంది..!' అంటూ తిరిగి చెప్పసాగాడు.

'ఉపాధి హామీ చిక్కి శల్యమైంది. వ్యవసాయ కార్మికుడు మరింత బక్కచిక్కాడు. వ్యవసాయం గిట్టుబాటుకాక రైతన్న ఉసురుతీసుకుంటున్నాడు. కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను భరించలేక ఉద్యమించిన రైతన్న నల్ల చట్టాలను రద్దు చేయించాడు. కానీ, కనీస మద్దతు ధర లాంటి సమస్యలు వెంటాడుతూనే ఉండటంతో... ఢిల్లీ సాక్షిగా గళం విప్పుతూ సర్కారు క్రూరత్వం కింద నలిగిపోతున్నాడు. అగ్నివీర్ పేరుతో జవాన్లు నాలుగేళ్ల కాంట్రాక్టు ఉద్యోగులయ్యారు. కోవిడ్ మహమ్మారి కొన్ని లక్షల ప్రాణాలను బలిగొన్నా... పళ్లేలు మోగించండి.. దీపాలు వెలిగించండి...అంటూ మెస్మరైజ్ చేశాడు. డబుల్ ఇంజన్ సర్కారు కొలువుదీరిన మణిపూర్‌లో ఆడబిడ్డలను నగ్నంగా నడిరోడ్డుపై నడిపించిన వారికి వత్తాసు పలుకుతూ...నేటికీ ఆ రాష్ట్రం వంక కూడా చూడలేదు... పైగా 140 కోట్ల మందీ నా బిడ్డలు అంటూ కనికట్టు చేస్తున్నాడు. నోరెత్తిన ప్రతిపక్షాలను, బుద్ధిజీవులను 'ఉపా' కేసులు పెట్టి, దర్యాప్తు సంస్థలతో దండ యాత్రలు చేయించి, జైళ్లలో పెట్టిస్తున్నాడు. గోమాత అంటూ దళితులు, ముస్లిములపై దాడులకు పాల్పడుతూ.. బీఫ్ ఎగుమతుల్లో రెండో స్థానానికి దేశాన్ని తీసుకెళ్లాడు.

పైగా 370 సీట్లంటూ ప్రతిపక్షాలతో మైండ్ గేమ్ ఆడుతున్నాడు. దక్షిణాదిన 128 స్థానాల్లో 20 వస్తే గొప్పే. మిగిలిన 415 స్థానాల్లో 355 స్థానాలు సొంతంగా సాధిస్తానంటూ....గోడీ మీడియాతో గోబెల్స్‌ను మించిపోయేలా ప్రచారం చేయిస్తున్నాడు. నితీష్‌కుమార్, చంద్రబాబు లాంటి వాళ్లు రంగులు మార్చుతున్నా... ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఏకమైతే 200 స్థానాలు రావడం కూడా గొప్పేనని విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు. అయోధ్య రామాలయం, ఆర్టికల్ 370 రద్దు, సిఎఎ, ఎన్‌ఆర్‌సి లాంటివి ముందుకు తెస్తూ...ప్రతిపక్షాలవి కుటుంబ పరివార రాజకీయాలంటూ..ఆచరణలో దేశ, విదేశీ కార్పొరేట్ పరివారానికి సర్వం దోచిపెడుతున్నాడు. ఇంతకన్నా ఇంద్రజాలికుడు, నటుడు... ప్రకాష్‌రాజ్ చెప్పినట్లు ఇప్పటి ప్రపంచంలో లేడు..!

ఇప్పటికే ధరాభారం, నిరుద్యోగం, అవిద్య, అనారోగ్యంతో రుణాల ఊబిలో పీకల్లోతున కూరుకుపోయిన సామాన్యుడు తిరగబడే రోజు... తిక్కకుదిర్చే మంచి రోజులు ముందున్నాయని దేశవ్యాపిత పోరాటాలు, ఇండియా వేదిక సీట్ల సర్దుబాట్లు ఆశలు రేకెత్తిస్తున్నాయి.' అంటూ ముగించాడు.

అభిప్రాయం



జనరిక్ మందులపై అవగాహన ముఖ్యం

అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యుల సూచనల ప్రకారం ఔషధాలు (టాబ్లెట్లు, ఇంజక్షన్లు, టానిక్కులు) తీసుకుంటుంటాం. ప్రస్తుతం మార్కెట్లో బ్రాండెడ్ ఔషధాల ధరలు ఎక్కువగా ఉండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాటిని కొనలేక సతమతమవుతున్నారు. అయితే మరోవైపు మార్కెట్లో 'జనరిక్' పేరుతో తక్కువ ధరకే నాణ్యమైన మందులు లభిస్తున్నప్పటికీ వాటి వినియోగానికి అంత ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

ఒక బ్రాండెడ్ కంపెనీ ఒక మందును తయారుచేసి మార్కెట్లో ప్రవేశపెట్టేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. ఆ మందుపై పెట్టిన ఖర్చులు రాబట్టుకునేందుకు సుమారు 20 సంవత్సరాలు పడుతుంది. దానిని బట్టే ఆ కంపెనీ తయారుచేసిన మందుల ధర ఉంటుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సదరు కంపెనీకి పేటెంట్ హక్కులు 20 సంవత్సరాలకు ఇస్తుంది. అప్పటివరకు ఆ మందును ఏ ఇతర ఫార్మా కంపెనీ తయారు చేయడానికి వీలు లేదు. 20 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఏ ఇతర ఫార్మా కంపెనీ అయినా, ఆ మందును తయారు చేయవచ్చు. ఈ మందులనే జనరిక్ మందులు అంటారు. వీటికి ఖర్చు 30 నుండి 60 శాతం వరకు తగ్గుతుంది. అందుకనే మార్కెట్లో జనరిక్ మందులు, బ్రాండెడ్ మందుల కంటే మూడు నుండి ఐదు రెట్లు తక్కువకు లభిస్తాయి.

మన దేశంలో జనరిక్ మందులను ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉన్న కొన్ని పేరు మోసిన కంపెనీలు కూడా తయారు చేస్తున్నాయి. కరోనా సమయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో తయారుచేసిన జనరిక్ మందులను కరోనా కిట్ల రూపంలో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అయితే ప్రైవేట్ రంగంలో ఉన్న ఫార్మా కంపెనీలు కూడా జనరిక్ మందులు తయారుచేసి ప్రైవేట్ ఆసుపత్రులకు, వాటి ఆధ్వర్యంలో విక్రయించే విక్రయశాలలకు సరఫరా చేస్తాయి. అయితే ప్రభుత్వ, ప్రవేటు రంగాలలో జనరిక్ మందులు తక్కువ ధరకే తయారవుతున్నప్పటికీ ప్రైవేటు రంగంలో తయారవుతున్న మందులను ప్రభుత్వ జనరిక్ మందుల కంటే కొంచెం ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు ఏ మాత్రం ప్రభావం చూపవని మానసికంగా ముద్ర వేస్తున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగాలలో మందులు తయారు చేయాలంటే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ), నేషనల్ అక్రిడిటెడ్ బోర్డ్ ఫర్ లాబరేటరీస్ (ఎన్. ఎ. బి.ఎల్) పరీక్షలు నిర్వహించిన తర్వాత వాటి నాణ్యతను పరీక్షించి ఆమోదం ఇస్తాయి. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో తయారైన మందులు ఒకే నాణ్యత కలిగినవిగా ఉంటాయి. ఒకేలా పనిచేస్తాయి. అందువల్ల తక్కువ ధరకు లభించే జనరిక్ మందులు కూడా మంచి నాణ్యమైనవని మనం గమనించాలి.

ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికాలో ఎక్కువగా జనరిక్ మందులనే వినియోగిస్తారు. అమెరికాలో 10 మంది రోగులలో ఎనిమిది మంది రోగులకు జనరిక్ మందులను అక్కడి వైద్యులు మందుల చీటీలో రాస్తారు. కానీ మన దేశంలో పది మంది రోగులలో 8 మందికి డాక్టర్లు ప్రైవేటు కంపెనీలు తయారు చేస్తున్న బ్రాండెడ్ మందులనే రాస్తున్నారు. ఇందుకు కారణాలు పరిశీలిస్తే ప్రైవేటు కంపెనీలు చేస్తున్న మాయాజాలమని చెప్పుకోవచ్చు.

జనరిక్ మందులపై ప్రజలకు తగినంత అవగాహన లేదు. దీంతో పాటు వీటి ధరలు తక్కువగా ఉండటంతో బ్రాండెడ్ మందుల కంపెనీలు జనరిక్ మందులపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. అందుకే జనరిక్ మందులు చాలా ప్రభావవవంతమైనవన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు ప్రజలకు తెలియచెప్పాలి. అప్పుడే జనరిక్ మందులకు మంచి జనాదరణ లభిస్తుందనటంలో సందేహం లేదు.

- సి.ఎన్.మూర్తి, సెల్ : 8328143489

ఎంపి రఘురామ పిటిషన్‌పై విచారణ

ప్రజాశక్తి–అమరావతి

సిఎం వైఎస్‌ జగన్‌ ఆయన బంధువులు, వాళ్ల కంపెనీలకు వేల కోట్ల రూపాయల ఆయాచిత లబ్ది చేకూరేలా వైసిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ప్రతివాదుల్లోని పలువురు ప్రచారం కోసమే ఈ పిల్‌ వేశామని అంటున్నారని, ఈ పిల్‌పై [illegible] ఎన్నికల తర్వాత విచారణ చేపట్టేలా తమకు అభ్యంతరం లేదని పిటిషనర్‌ తరపున సీనియర్‌ న్యాయవాది ఉన్నం మురళీధరరావు చెప్పారు. వాయిదాకు కారణాలను వివరిస్తూ మెమో దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జస్టిస్‌ దుర్గాప్రసాదరావు, జస్టిస్‌ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణకు హాజరైన ఎంపి రఘురామ కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. వైసిపిని ఓడించేందుకు ప్రజలంతా బయటకు వచ్చి ఓట్లు వేయాలని కోరారు. ఎన్ని వ్యూహాలు పన్నినా, ఎన్ని కుట్రలు చేసినా వైసిపి ప్రభుత్వం కూలిపోతుందని అన్నారు. మరో కేసులో విచారణకు హాజరైన కెఎ పాల్‌తో రఘురామ కొద్ది నిమిషాలు మాట్లాడారు.

భౌతిక స్వాధీనతా ప్రకటన

ICICI Bank

బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హొసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు–560068.

ఏదైతే,

క్రింది సంతకందారులు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీత బకాయి మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినకారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ–పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని దిగువ పేర్కొన్న తేదీలలో స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఏదేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకులోబడి ఉంటుందని తెలియజేయనైనది.

క్ర. సం.	రుణగ్రహీత పేరు / రుణ ఖాతా నెంబర్	ఆస్తి వివరణ/ భౌతికంగా స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	అక్షయ ఎంటర్‌ప్రైజెస్, వెలగపూడి తరుణ్, ఎస్ఆర్ కె ప్రసాద్ వడ్లపట్ల & యర్రగుంట్ల వెంకటేశ్వరరావు/ 19–89/1, మహీంద్రానగర్ గొల్లపూడి, పశ్చిమ గోదావరి విజయవాడ– 521225/ 773905500032.	ఆర్ఎస్ నెం.139/3బి, విస్తీర్ణం0.371/2 సెంట్లతో గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా–జిల్లా, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్–521241లోగల ఆస్తి మొత్తం కవరుచేస్తున్న రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా మరియు ప్రస్తుత మరియు భవిష్యత్ రెండింటితో దానిపై అన్ని భవనాలు మరియు నిర్మాణాలు మరియు అన్ని పాంట్స్ మరియు మెషినరీతో భూమికి స్థిరంగా అమర్చబడిన భూమికి అనుబంధంగా ఉన్న ఏదేని జతచేసినవి (విస్తీర్ణం 0.37 1/2 సెంట్ల ఏరియా: సరిహద్దులు: ఉత్తరం: సి షెడ్యూల్‌లో ఇతరులు, దక్షిణం: ఆర్ఎస్ నెం.95లోని స్థలం, తూర్పు: ఆర్ఎస్ నెం.174 లోని స్థలం, పడమర: 33అ.ల వెడల్పు రోడ్డు./ భౌతిక స్వాధీన తేదీ: 06 మార్చి, 2024.	01-11-2023 Rs. 1,83,78,898.00/-	క్రిష్ణ

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది:12 మార్చి, 2024
ప్రదేశం:విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

HDFC BANK
We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,
బ్రాంచ్ ఆఫీస్ : 50-96-5, ప్లాట్ నెం.175, సీతమ్మధార, పాత SBH ఎదురుగా, విశాఖపట్నం-530013.

డిమాండ్ నోటీసు

Ref : HDFC/5404659/13(2)/JANUARY/2024 Date : 11.01.2024

1) **శ్రీ తిమ్మిశెట్టి విజయ కుమార్ (దరఖాస్తుదారు), తండ్రి. తిమ్మిశెట్టి వెంకట రావు,** డి.నెం.5–60–1/101, 4ఉ5 లైన్, అశోక్‌నగర్, అరుండాల్‌పేట, గుంటూరు–522002.
2) **శ్రీ వెంకట్ రావు తిమ్మిశెట్టి (సహా–దరఖాస్తుదారు), తండ్రి. తిమ్మిశెట్టి రఘుపతి రావు,** డి.నెం.5–60–1/101, 4ఉ5 లైన్, అశోక్‌నగర్, అరుండాల్‌పేట, గుంటూరు–522002.
3) **శ్రీమతి వెంకాయమ్మ తిమ్మిశెట్టి (సహా–దరఖాస్తుదారు),** డి.నెం.5–60–1/101, 4ఉ5 లైన్, అశోక్‌నగర్, అరుండాల్‌పేట, గుంటూరు–522002.
4) **శ్రీమతి శేషు కుమారి తిమ్మిశెట్టి (సహా–దరఖాస్తుదారు),** డి.నెం.5–60–1/101, 4ఉ5 లైన్, అశోక్‌నగర్, అరుండాల్‌పేట, గుంటూరు–522002.
5) **శ్రీ శ్రీనివాస రావు పూల (హామీదారు), తండ్రి. వీరయ్య,** డి.నెం.1–39, ఓర్వకల్లు, అచ్చంపేట, గుంటూరు–522409.

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ యొక్క సెక్షను 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (ఇప్పటి నుండి "చట్టం" అని పిలువబడును)

అయ్యా / అమ్మా

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, ఇప్పటి నుండి "చట్టం" అని చెప్పబడును నందలి నిబంధనల ప్రకారం, బ్యాంక్ వారిచే అధీకృత అధికారిగా నియమించబడిన ఈ దిగువ సంతకందారుడు మీకు ఈ దిగువ చెప్పిన నోటీసు జారీ చేయుచున్నారు.

మీలో దిగువ చిరునామా నెం.**1 నుండి 5** వారి అభ్యర్థన మేరకు మా కిసాన్ గోల్డ్ కార్డు స్కీమ్ క్రింద మీకు **రూ.1,05,00,000/- (అక్షరాల ఒక కోటి ఐదు లక్షల రూపాయలు మాత్రమే)** ఈ దిగువ షెడ్యూలు ఆస్తులు తనఖా ఉంచి, **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్.,** రిజిస్టర్డ్ కార్యాలయము హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పారెల్(డబ్ల్యూ), ముంబాయి–400013 వారి యొక్క **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** డి.నెం.5–87–90,. మెయిన్ రోడ్డు, లక్ష్మీనురం, గుంటూరు–522007, ఆంధ్రప్రదేశ్ ద్వారా ఋణము మీకు మంజూరు చేయబడినది. ఋణము ఖాతా పూర్తి వివరములు ఈ దిగువ పట్టిక నందు చెప్పబడినది.

ఋణము సంఖ్య	ఉత్పత్తి	మంజూరు చేసిన తేదీ	ఋణము మొత్తము	ఖాతా నిలుపు మొత్తము	ఖాతా ముగింపు తేది
50200035649771	Retail Agri Cash Credit	09.02.2019	రూ.50,00,000/-	రూ.24,42,213/-	11.01.2024
50200035652150	Retail Agri Cash Credit	18.07.2020	రూ.55,00,000/-	రూ.66,78,005/-	11.01.2024
మొత్తం			రూ.1,05,0,000/-	రూ.91,20,218/-	

ఋణము మంజూరు లెటరు మరియు లోన్ ఒప్పందము యొక్క షెడ్యూలు నందలి నియమములు మరియు నిబంధనల ప్రకారం, ఈ ఋణము తిరిగి చెల్లించవలెను. అందులకు మీ చిరునామాదారులందరూ అంగీకరించినారు మరియు సంతకం చేసినారు. చిరునామాదారుడు నెం.1 వారి యొక్క ఈ షెడ్యూలు నందు చెప్పిన ఆస్తిని **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారికి చిరునామాదారుడు నెం.1 మరియు కుటుంబ సభ్యులుగా ఉన్న వారిని వినియోగించిన ఋణము తిరిగి చెల్లింపునకు హామీగా ఉంచినారు.

ఆఫర్ లెటరు నందు చెప్పిన అన్ని నియమములు మరియు నిబంధనలు మీరు అంగీకరించి ఋణ ఒప్పందము కొరకు అనేక దస్తావేజులు ఈ ఋణము పొందుటకు వీలుగా ఈ షెడ్యూలు ఆస్తిని తనఖా ఉంచిన అమలు చేసినారు.

వాయిదాలు / వడ్డీ చెల్లింపులో మీరు విఫలమైనందున సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్, 2002 యొక్క సెక్షన్ 2(0) నందు చెప్పబడిన విధంగా మీ ఖాతా **తేది.01.10.2023** నాటి నుండి నిరర్థక ఆస్తిగా మార్పు చేయబడినది.

కావున ఈ సంధర్భములో, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ యొక్క సెక్షన్ 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 నందలి నిబంధనలు ప్రకారం, బ్యాంక్ వారు మీకు మంజూరు చేసిన ఋణము తిరిగి వసూలు చేసికొనుటకు నిర్ణయించినారు.

కావున **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారు సదరు పై చట్టం యొక్క సెక్షను 13(2) క్రింద ఈ దిగువ చెప్పిన బ్యాంక్ వారి నుండి పొందిన ఋణ మొత్తములను చెల్లించవలసినదిగా కోరుతూ ఈ నోటీసు మీకు జారీ చేయుచున్నారు. **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారి యొక్క బకాయి **రూ.91,20,218/- (అక్షరాల తొంభై ఒక్క లక్షల ఇరవై వేల రెండు వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే)** వడ్డీతో కలిపి, ఈ నోటీసు తేది నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా మిమ్ములను కోరడమైనది మరియు ఒప్పందపూర్వక తదుపరి వడ్డీలు, సాధారణ సంబంధిత ఇతర ఖర్చులు కాస్ట్స్, ఛార్జీలు మొదలగునవి కూడా, పైన చెప్పిన బకాయి మొత్తము పై చెల్లింపునకు మీరు బాధ్యులుగా ఉన్నారు.

హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి., వారికి పైన చెప్పిన బకాయి మొత్తము **తేది.11.01.2024 నాటికి రూ.91,20,218/- (అక్షరాల తొంభై ఒక్క లక్షల ఇరవై వేల రెండు వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ మరియు సంబంధిత సాధారణ ఖర్చులు, కాస్ట్స్ పైన నోటీసులో చెప్పిన ప్రకారం చెల్లింపులో విఫలమైన ఎడల సదరు పై చట్టం యొక్క సెక్షను 13(2) క్రింద మరియు అదే చట్టం నందలి సెక్షను 13 లోని సబ్–సెక్షన్ (4) ప్రకారం మరియు చట్టం నందలి వర్తించు ఏ నిబంధనల ప్రకారం **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** వారు తమ అన్ని లేదా ఏదేని హక్కులను అమలు చేయగలరు.

ఈ పై సదరు చట్టం నందలి సెక్షను 13 యొక్క సబ్–సెక్షన్ 13 నందలి నిబంధనలు ప్రకారం మీరు ఈ దిగువ వివరముగా చెప్పిన సెక్యూర్డ్ ఎసెట్స్, అమ్మకం, లీజు లేదా మరే ఇతర విధములుగా **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారి యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి తేకుండా బదిలీ చేయుట నిషేధించబడినది. ఈ నోటీసు, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి లభించే అన్ని చట్టబద్ధ హక్కులు / చర్యలు లోబడి, ఏ విధమైన చట్టపూర్వక కార్యకలాపాలు / చర్యలు ప్రకారం అమలులో ఉన్న ఏ చట్టం ద్వారా లేదా సాధారణ ప్రస్తుత చట్టం ప్రకారం తగు చర్యలు తీసికొనుటకు వీలుగా, ఏవిధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా జారీ చేయబడినది. ఈ సదరు పై చట్టం క్రింద ఈ చట్టపూర్వక ఆదేశములు / విరోధములకు వ్యతిరేకంగా మీరు ప్రవర్తించిన ఎడల అట్టి పనులు నేరంగా భావించబడునని ఈ నోటీసు ద్వారా మీరు గమనించవలెను.

ఒకవేళ మీరు ఋణము చెల్లింపులో విఫలమైన ఎడల **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్** వారిచే ఈ దిగువ చెప్పిన సెక్యూర్డ్ ఆస్తుల పై తగు చర్యలు తీసికొనుటకు ఉద్దేశించినారు.

షెడ్యూలు ఆస్తి వివరములు : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్–జిల్లా, నల్లపాడు గ్రామ పంచాయితీ ఏరియా, ప్రస్తుతం కొత్త గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామం, సర్వే నెం.473/ఎ, 473/బి, ప్లాట్ నెం.44 & 45 లోని విస్తీర్ణం 408 చ॥గ॥లులోని ఆస్తి. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.39 కి చెందిన స్థలం – 42.00 అ॥లు, **దక్షిణం :** ప్లాట్ నెం.46, ఆత్మకూరి విజయ లక్ష్మీ గారికి చెందిన స్థలం – 89.60 అ॥లు, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు – 96.70 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.43 & 42 కు చెందిన సథలం – 46.60 అ॥లు.

తేది : 11.03.2024, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు లిమిటెడ్

HDFC BANK
We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,
బ్రాంచ్ ఆఫీస్ : 50-96-5, ప్లాట్ నెం.175, సీతమ్మధార, పాత SBH ఎదురుగా, విశాఖపట్నం-530013.

డిమాండ్ నోటీసు

Ref : HDFC/5604058/13(2)/FEB/2024 Date : 03.02.2024

1) **శ్రీమతి సజ్జా శివపార్వతి (దరఖాస్తుదారు), W/D/O సజ్జా గోపాల కృష్ణ,** ఇంటి నెం.2–52, నాగాయలంక, నాగాయలంక మండలం, కృష్ణా జిల్లా–521120.
2) **శ్రీ సజ్జా గోపాల కృష్ణ (సహా–దరఖాస్తుదారు), తండ్రి. రామ కోటయ్య సజ్జా,** ఇంటి నెం.2–52, నాగాయలంక, నాగాయలంక మండలం, కృష్ణా జిల్లా–521120.
3) **శ్రీ సజ్జా గిరీష్ కుమార్ (సహా–దరఖాస్తుదారు), తండ్రి. గోపాలకృష్ణ సజ్జా,** ఇంటి నెం.2–52, నాగాయలంక, నాగాయలంక మండలం, కృష్ణా జిల్లా–521120.
4) **శ్రీ సుఖవాసి యుగంధర్ (హామీదారు), తండ్రి. రామ్మోహన్ రావు సుఖవాసి,** ఇంటి నెం.9–80–1, నాగాయలంక, నాగాయలంక మండలం, కృష్ణా జిల్లా–521120.

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ యొక్క సెక్షను 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (ఇప్పటి నుండి "చట్టం" అని పిలువబడును)

అయ్యా / అమ్మా

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, ఇప్పటి నుండి "చట్టం" అని చెప్పబడును నందలి నిబంధనల ప్రకారం, బ్యాంక్ వారిచే అధీకృత అధికారిగా నియమించబడిన ఈ దిగువ సంతకందారుడు మీకు ఈ దిగువ చెప్పిన నోటీసు జారీ చేయుచున్నారు.

మీలో దిగువ చిరునామా నెం.**1 నుండి 4** వారి అభ్యర్థన మేరకు మా కిసాన్ గోల్డ్ కార్డు స్కీమ్ క్రింద మీకు **రూ.1,13,00,000/- (అక్షరాల ఒక కోటి పదమూడు లక్షల రూపాయలు మాత్రమే)** ఈ దిగువ షెడ్యూలు ఆస్తులు తనఖా ఉంచి, **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్.,** రిజిస్టర్డ్ కార్యాలయము హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పారెల్(డబ్ల్యూ), ముంబాయి–400013 వారి యొక్క **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** డి.నెం.7–169, రాబర్ట్‌సన్‌పేట, కృష్ణా జిల్లా, మచిలీపట్నం–521001, ఆంధ్రప్రదేశ్ ద్వారా ఋణము మీకు మంజూరు చేయబడినది. ఋణము ఖాతా పూర్తి వివరములు ఈ దిగువ పట్టిక నందు చెప్పబడినది.

ఋణము సంఖ్య	ఉత్పత్తి	మంజూరు చేసిన తేదీ	ఋణము మొత్తము	ఖాతా నిలుపు మొత్తము	ఖాతా ముగింపు తేది
50200035859342	Retail Agri Cash Credit	10.08.2020	రూ.1,13,00,000/-	రూ.1,38,05,816.83	02.02.2024
మొత్తం			రూ.1,13,00,000/-	రూ.1,38,05,816.83	

ఋణము మంజూరు లెటరు మరియు లోన్ ఒప్పందము యొక్క షెడ్యూలు నందలి నియమములు మరియు నిబంధనల ప్రకారం, ఈ ఋణము తిరిగి చెల్లించవలెను. అందులకు మీ చిరునామాదారులందరూ అంగీకరించినారు మరియు సంతకం చేసినారు. చిరునామాదారుడు నెం.1 వారి యొక్క ఈ షెడ్యూలు నందు చెప్పిన ఆస్తిని **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారికి చిరునామాదారుడు నెం.1 మరియు కుటుంబ సభ్యులుగా ఉన్న వారిని వినియోగించిన ఋణము తిరిగి చెల్లింపునకు హామీగా ఉంచినారు.

ఆఫర్ లెటరు నందు చెప్పిన అన్ని నియమములు మరియు నిబంధనలు మీరు అంగీకరించి ఋణ ఒప్పందము కొరకు అనేక దస్తావేజులు ఈ ఋణము పొందుటకు వీలుగా ఈ షెడ్యూలు ఆస్తిని తనఖా ఉంచిన అమలు చేసినారు.

వాయిదాలు / వడ్డీ చెల్లింపులో మీరు విఫలమైనందున సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్, 2002 యొక్క సెక్షన్ 2(0) నందు చెప్పబడిన విధంగా మీ ఖాతా **తేది.01.04.2023** నాటి నుండి నిరర్థక ఆస్తిగా మార్పు చేయబడినది.

కావున ఈ సంధర్భములో, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ యొక్క సెక్షన్ 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 నందలి నిబంధనలు ప్రకారం, బ్యాంక్ వారు మీకు మంజూరు చేసిన ఋణము తిరిగి వసూలు చేసికొనుటకు నిర్ణయించినారు.

కావున **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారు సదరు పై చట్టం యొక్క సెక్షను 13(2) క్రింద ఈ దిగువ చెప్పిన బ్యాంక్ వారి నుండి పొందిన ఋణ మొత్తములను చెల్లించవలసినదిగా కోరుతూ ఈ నోటీసు మీకు జారీ చేయుచున్నారు. **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారి యొక్క బకాయి **రూ.1,38,05,816.83 పై (అక్షరాల ఒక కోటి ముప్పై ఎనిమిది లక్షల ఐదు వేల ఎనిమిది వందల పదహారు రూపాయల ఎనభై మూడు పైసలు మాత్రమే)** వడ్డీతో కలిపి, ఈ నోటీసు తేది నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా మిమ్ములను కోరడమైనది మరియు ఒప్పందపూర్వక తదుపరి వడ్డీలు, సాధారణ సంబంధిత ఇతర ఖర్చులు కాస్ట్స్, ఛార్జీలు మొదలగునవి కూడా, పైన చెప్పిన బకాయి మొత్తము పై చెల్లింపునకు మీరు బాధ్యులుగా ఉన్నారు.

హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి., వారికి పైన చెప్పిన బకాయి మొత్తము **తేది.02.02.2024 నాటికి రూ.1,38,05,816.83 పై (అక్షరాల ఒక కోటి ముప్పై ఎనిమిది లక్షల ఐదు వేల ఎనిమిది వందల పదహారు రూపాయల ఎనభై మూడు పైసలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ మరియు సంబంధిత సాధారణ ఖర్చులు, కాస్ట్స్ పైన నోటీసులో చెప్పిన ప్రకారం చెల్లింపులో విఫలమైన ఎడల సదరు పై చట్టం యొక్క సెక్షను 13(2) క్రింద మరియు అదే చట్టం నందలి సెక్షను 13 లోని సబ్–సెక్షన్ (4) ప్రకారం మరియు చట్టం నందలి వర్తించు ఏ నిబంధనల ప్రకారం **హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,** వారు తమ అన్ని లేదా ఏదేని హక్కులను అమలు చేయగలరు.

ఈ పై సదరు చట్టం నందలి సెక్షను 13 యొక్క సబ్–సెక్షన్ 13 నందలి నిబంధనలు ప్రకారం మీరు ఈ దిగువ వివరముగా చెప్పిన సెక్యూర్డ్ ఎసెట్స్, అమ్మకం, లీజు లేదా మరే ఇతర విధములుగా **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లి.,** వారి యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి తేకుండా బదిలీ చేయుట నిషేధించబడినది. ఈ నోటీసు, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి లభించే అన్ని చట్టబద్ధ హక్కులు / చర్యలు లోబడి, ఏ విధమైన చట్టపూర్వక కార్యకలాపాలు / చర్యలు ప్రకారం అమలులో ఉన్న ఏ చట్టం ద్వారా లేదా సాధారణ ప్రస్తుత చట్టం ప్రకారం తగు చర్యలు తీసికొనుటకు వీలుగా, ఏవిధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా జారీ చేయబడినది. ఈ సదరు పై చట్టం క్రింద ఈ చట్టపూర్వక ఆదేశములు / విరోధములకు వ్యతిరేకంగా మీరు ప్రవర్తించిన ఎడల అట్టి పనులు నేరంగా భావించబడునని ఈ నోటీసు ద్వారా మీరు గమనించవలెను.

ఒకవేళ మీరు ఋణము చెల్లింపులో విఫలమైన ఎడల **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్** వారిచే ఈ దిగువ చెప్పిన సెక్యూర్డ్ ఆస్తుల పై తగు చర్యలు తీసికొనుటకు ఉద్దేశించినారు.

షెడ్యూలు ఆస్తి వివరములు : కృష్ణా జిల్లా, అవనిగడ్డ సబ్–రిజిస్ట్రీ, నాగాయలంక మండలం, నాగాయలంక వద్ద గల ఆర్.ఎస్.నెం.104/9 లోని విస్తీర్ణం ఎకరా 0–07 1/4 సెంట్లు / 351 చ॥గ॥లుతో గల (దగ్గరలో గల డి.నెం.2–52) ఖాళీ ఇంటి స్థలం శ్రీ సజ్జా గోపాల కృష్ణ గారి పేరున కలదు. **హద్దులు : తూర్పు :** నాగాయలంక పంచాయితీ రోడ్డు కొంతవరకు మరియు 10 లింకుల వెడల్పు గల లేన్ కొంతవరకు, **దక్షిణం :** టి. రాము గారి స్థలం, **పడమర :** వి. రాజేంద్ర ప్రసాద్ గారి స్థలం, **ఉత్తరం :** ఎస్. రామ కోటయ్య గారి స్థలం.

తేది : 11.03.2024, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు లిమిటెడ్

HDFC BANK
We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., 50-96-5, ప్లాట్ నెం.75, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) (రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం–2002 ప్రకారం **హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్,** రిజిస్టర్డ్ కార్యాలయం బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి–400013 మరియు కార్యాలయం / రీజనల్ కార్యాలయం **హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్,** # డి.నెం.7–169, [illegible] మచిలీపట్నం–521001, ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 9వ నిబంధనతో చదివే 13(2)వ విభాగము క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణం **రూ.49,67,700.61 పై (అక్షరాల [illegible])** మరియు **తేది.11.12.2023** నుండి చెల్లించవలసిన భవిష్య వడ్డీ మరియు పీనల్ వడ్డీ మరియు ఖర్చుల, చార్జీలతో సహా చెల్లించమని కోరుతూ **ఋణగ్రహీతలు : 1) [illegible]** **2) [illegible]** వారిని కోరుతూ **తేది.11.12.2023 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు) విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "9"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్.,** వారు **తేది.06.03.2024 న స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి **మెస్సర్స్ హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్** యొక్క ఛార్జీకి **తేది.10.12.2023 నాటికి రూ.49,67,700.61 పై (అక్షరాల [illegible])** + దానిపై వర్తించు భవిష్య వడ్డీతో సహా లోబడి ఉంటాయని ఋణగ్రహీత/లకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తులను తిరిగి పొందుటకు మరియు గడువు లభ్యతపై ఋణగ్రహీత సదరు చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

కృష్ణా జిల్లా, [illegible]

తేది : 06-03-2024
ప్రదేశం : విశాఖపట్నం

సం/-అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

HDFC BANK
We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., 50-96-5, ప్లాట్ నెం.75, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) (రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం–2002 ప్రకారం **హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్,** రిజిస్టర్డ్ కార్యాలయం బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి–400013 మరియు కార్యాలయం / రీజనల్ కార్యాలయం **హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్,** # [illegible] ప్రాతినిధ్యం వహిస్తున్న అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 9వ నిబంధనతో చదివే 13(2)వ విభాగము క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణం **రూ.41,35,112/- (అక్షరాల [illegible])** మరియు **తేది.29.12.2023** నుండి చెల్లించవలసిన భవిష్య వడ్డీ మరియు పీనల్ వడ్డీ మరియు ఖర్చుల, చార్జీలతో సహా చెల్లించమని కోరుతూ **ఋణగ్రహీతలు : 1) శ్రీ లగడపాటి వెంకట రావు (దరఖాస్తుదారు),** [illegible] వారిని కోరుతూ **తేది.29.12.2023 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు) విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "9"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్.,** వారు **తేది.07.03.2024 న స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి **మెస్సర్స్ హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్** యొక్క ఛార్జీకి **తేది.26.12.2023 నాటికి రూ.41,35,112/- (అక్షరాల [illegible])** + దానిపై వర్తించు భవిష్య వడ్డీతో సహా లోబడి ఉంటాయని ఋణగ్రహీత/లకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తులను తిరిగి పొందుటకు మరియు గడువు లభ్యతపై ఋణగ్రహీత సదరు చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ జిల్లా, వినుకొండ టౌన్ & మున్సిపాలిటీ వద్ద గల 31 చ॥గ॥లు విస్తీర్ణమునకు సమానమైన 31 చ॥గ॥లులోని డి.నెం. 366/2, డి.నెం.28–254 తో ఉన్న స్థలం **శ్రీ లగడపాటి వెంకట రావు గారి** పేరున కలదు. **హద్దులు : తూర్పు :** షేక్ సమీవున్ గారి స్థలం – 15", **దక్షిణం :** నరసారావుపేట కు వెళ్ళు రోడ్డు – 12", **పడమర :** దరఖాస్తుదారుని భూమి యొక్క స్థలం – 30", **ఉత్తరం :** బజార్ – 14".

తేది : 07-03-2024
ప్రదేశం : విశాఖపట్నం

సం/-అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

HDFC BANK
We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., 50-96-5, ప్లాట్ నెం.75, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) (రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం–2002 ప్రకారం **హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్,** రిజిస్టర్డ్ కార్యాలయం బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి–400013 మరియు కార్యాలయం / రీజనల్ కార్యాలయం **హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, #** డి.నెం. 48–18–19బి, గ్రౌండ్ ఫ్లోర్ మహనాడు రోడ్డు, కరెన్సీ నగర్, విజయవాడ–520008, ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 9వ నిబంధనతో చదివే 13(2)వ విభాగము క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణం **రూ.92,76,753/- (అక్షరాల తొంభై రెండు లక్షల డెబ్బై ఆరు వేల ఏడు వందల యాభై మూడు రూపాయలు మాత్రమే)** మరియు **తేది.29.12.2023** నుండి చెల్లించవలసిన భవిష్య వడ్డీ మరియు పీనల్ వడ్డీ మరియు ఖర్చుల, చార్జీలతో సహా చెల్లించమని కోరుతూ **ఋణగ్రహీతలు : 1) శ్రీ ముద్దాన వెంకట రమణ (దరఖాస్తుదారు), తండ్రి. వెంకట సుబ్బారావు,** ఫ్లాట్ నెం.191, 5వ అంతస్తు, ఫ్లాట్ నెం, శివ సాయి ఎన్‌క్లేవ్, నాగార్జున నగర్, విజయవాడ మండలం, కృష్ణా జిల్లా, విజయవాడ–520008. **2) శ్రీమతి ముద్దాన భార్గవి (సహా–దరఖాస్తుదారు), భర్త. ముద్దాన వెంకటరమణ,** ఫ్లాట్ నెం.191, 5వ అంతస్తు, ఫ్లాట్ నెం, శివ సాయి ఎన్‌క్లేవ్, నాగార్జున నగర్, విజయవాడ మండలం, కృష్ణా జిల్లా, విజయవాడ–520008. **3) శ్రీ కొల్లా రమేష (హామీదారు), తండ్రి. వెకటేశ్వర రావు,** డి.నెం. 59–6–3ఎ, రామచంద్ర రావు రోడ్డు, గాయత్రీ నగర్, విజయవాడ మండలం, కృష్ణా జిల్లా, విజయవాడ–520008 వారిని కోరుతూ **తేది.16.08.2023 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు మరియు **తేది.29.12.2023 న ప్రచురించినారు.**

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు) విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "9"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్.,** వారు **తేది.07.03.2024 న స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి **మెస్సర్స్ హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్** యొక్క ఛార్జీకి **తేది.24.07.2023 నాటికి రూ.92,76,753/- (అక్షరాల తొంభై రెండు లక్షల డెబ్బై ఆరు వేల ఏడు వందల యాభై మూడు రూపాయలు మాత్రమే)** + దానిపై వర్తించు భవిష్య వడ్డీతో సహా లోబడి ఉంటాయని ఋణగ్రహీత/లకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తులను తిరిగి పొందుటకు మరియు గడువు లభ్యతపై ఋణగ్రహీత సదరు చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

ఐటమ్ నెం.1 : ఒంగోలు సబ్ రిజిస్ట్రీ, ఒంగోలు టౌన్, బైపాస్ వెస్ట్ సైడ్, ఒంగోలు మున్సిపల్ పరిధి, ఒంగోలు రూరల్, సర్వే నెం.237/1 లోని మొత్తం విస్తీర్ణం 2108 6/9 చ॥గ॥లులోని 1549 చ॥గ॥లులోని రోడ్డు కొరకు తీసివేసిన తరువాత 559 6/9 చ॥గ॥లు విస్తీర్ణం 56 చ॥గ॥లు లేదా 48.72 చ॥మీ॥లులోని స్థలం అన్ని ఉపయోగాలు మరియు ఈజిమెంటరీ హక్కులతో కలదు (దగ్గరలో గల డోర్ నెం.7–294/2) **హద్దులు : తూర్పు :** గోరంట్ల వాణి గారి ఆస్తి, **దక్షిణం :** భువనాల వెంకటేశ్వర రెడ్డి మరియు సోదరులు మరియు తన్నీరు రాజ్యలక్ష్మి గార్ల ఆస్తి, **పడమర :** తిరుమల రాజు గారి ఆస్తి, **ఉత్తరం :** డొంక (సుజాత నగర్ రోడ్డు)

తేది : 07-03-2024
ప్రదేశం : విశాఖపట్నం

సం/-అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదు కార్యాలయం చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013
శాఖ చిరునామా: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డో.నం: 54-15-4సి/1, 5వ అంతస్తు, ఆర్‌కె గల్లేరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీసు రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008

స్థిరాస్తి అమ్మకం కొరకు నోటీసు

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలుకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ–రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారుసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క అధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం **28.03.2024న** దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ–రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి **"ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది"** ఆధారంగా. రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ఇ -వేలం 28.03.2024న మ. 2గం.లకు . ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి యొక్క డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలిగి ఉన్న సీల్డ్ ఎన్వలప్‌ను టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ అధీకృత అధికారికి శాఖ చిరునామా : **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్,** డోర్ నెం. 54.15.4సి/1, 5వ అంతస్తు, ఆర్.కె. గల్లేరియా శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్డు, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ–520008 వద్ద **27.03.2024, సా.5గం.ల** లోపు సమర్పించాలి.

క్రింద వివరించిన క్లుప్త వివరాల ప్రకారం "పరిస్థితి ఎక్కడ ఉంది" ప్రాతిపదికన సురక్షి ఆస్తి/ స్థిరాస్తి విక్రయం ఉంటుంది.

క్ర. సం	లోన్ ఎకౌంట్ నెం. మరియు శాఖ	రుణగ్రహీత(లు)/ సహ–రుణగ్రహీత(లు) చట్టపరమైన వారసులు/ చట్టపరమైన ప్రతినిధి/ హామీదారు(లు) పేర్లు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వ్ ధర	బయానా	స్వాధీనతా రకం
5.	10147431	శ్రీ. ఏవూరి నాగరాజు (రుణగ్రహీత) శ్రీమతి. ఏవూరి ఇంద్రజ (సహ రుణగ్రహీత)	Rs.39,44,870/- & 23.09.2021	రూ.13,90,000/- (పదమూడు లక్షల తొంభై వేల రూపాయలు మాత్రమే)	రూ.1,39,000/- (ఒక లక్షా ముప్పై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ: కృష్ణాజిలా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రార్, సుబ్బాయిగూడెం గ్రామ పంచాయితీ మరియు గ్రామం, ఆర్.ఎస్.నం.35/2ఎ1ఎ, 35/2ఎ1బి, 35/2సి1 లో ఎపిసిఆర్‌డిఎ విజయవాడ వైడ్ ఎల్.పి.నం.53/2016 ద్వారా ఆమోదించబడిన లే అవుట్, ప్లాట్ నం.203 లే అవుట్ ప్లాన్ కొలత 200 చ.గ.లు., ప్లాట్ నం.204 కొలత 150 చ.గ.లు., ప్లాట్ నం.211 కొలత 150 చ.గ.లు. ప్లాట్ నం.212 కొలత 200 చ.గ.లు. మొత్తం 04 ఓపెన్ ప్లాట్ల కొలత 700 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు** : 40–0 అ.ల. వెడల్పు రోడ్డు 70–0 అ.లు., **దక్షిణం** : 40–0 అ.లు. వెడల్పు రోడ్డు 90–0 అ.లు., **పడమర** : 40–0 అ.లు. వెడల్పు రోడ్డు 70–0 అ.లు., **ఉత్తరం** : ప్లాట్ నం.205 మరియు 210 90–0 అ.లు. పేర్కొన్న సరిహద్దుల ఖాళీ సైట్ పరిధి 700 చ.గ.లు. లేదా 585.29 చ.మీ.లు. తో పాటు సౌలభ్యాలు మరియు దాని అనుబంధ హక్కులు.						
6.	TCHHL04 54000100 071861	శ్రీ. ప్రసాద్ కొత్తపల్లి, శ్రీమతి. ధనలక్ష్మి కొత్తపల్లి	రూ.30,33,305/- (ముప్పై లక్షల ముప్పై మూడు వేల మూడు వందల ఐదు రూపాయలు మాత్రమే) మరియు 11.05.2022	రూ.17,00,000/- (పదిహేడు లక్షల రూపాయలు మాత్రమే)	రూ.1,70,000/- (ఒక లక్షా డెబ్బై వేల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్, షెడ్యూల్–ఎ : కృష్ణాజిల్లా, విజయవాడ **తూర్పు** జిల్లా రిజిస్ట్రార్, గుణదల ఎస్ఆర్ఓ, విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామ పంచాయితీ మరియు గ్రామం ఆర్.ఎస్.నం.149/7 సైట్ కొలత 484 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు** : కె.గాంధీ ఆస్తి, **దక్షిణం** : బి.సాంబశివరావు ఆస్తి, **పడమర** : ఎన్.సాంబశివరావు ఆస్తి, **ఉత్తరం** : గ్రామ పంచాయితీ రోడ్డు. ఈ సరిహద్దుల మధ్య పేర్కొనబడిని వాటా పరిధి 36.00 చ.గ.లు. లేదా 30.10 చ.మీ.లు. మొత్తం బయట కొలిచే పరిధి 484 చ.గ.లు. లేదా 404.66 చ.మీ.లు. షెడ్యూల్–బి : పైన పేర్కొన్న మొత్తం ఎ షెడ్యూల్ ఆస్తి "శ్రీ కృష్ణా రెసిడెన్సీ" పేరు మరియు శైలితో నిర్మించబడిన అపార్టుమెంట్లతో గ్రౌండ్, ఒకటవ, రెండవ మరియు మూడవ అంతస్తులు అందులోని రెండవ అంతస్తులో ఆ ఫ్లాట్ నం.ఎస్ఎఫ్.1, ఉన్న **హద్దులు : తూర్పు** : బాల్కనీ మరియు ఓపెన్ టు స్కై, **దక్షిణం** : ఓపెన్ టు స్కై, **పడమర** : ఎస్ఎఫ్.1 మరియు ఎస్ఎఫ్.2 మధ్య ఉమ్మడి గోడ, **ఉత్తరం** : ఫ్లాట్ నం.ఎస్ఎఫ్.4 మరియు కామన్ కారిడార్. పై సరిహద్దుల మధ్య 2వ అంతస్తు, ఫ్లాట్ నం.ఎస్ఎఫ్.1, కొలత 750 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 100 చ.అ.లు. బాల్కనీ ఏరియా, 120 అ.లు. కామన్ ఏరియా, 80 చ.అ.ల. కార్ పార్కింగ్ తో అన్నీ సౌకర్యాలు, ఫిక్చర్లు, ఫిట్టింగులు తో కలిపి కామన్ సౌకర్యాలలో ఉమ్మడి హక్కులు అనగా.. మెట్లకేస్, కామన్ కారిడార్, లిఫ్ట్, నీరు, డ్రైనేజితో కలిపి దానికి సంబంధించిన అన్నీ సౌలభ్య హక్కులు.						
7.	10134363	శ్రీ. నల్లని చక్రవర్తులు సౌజన్య, శ్రీ.రాజమణికంఠ కె.	రూ.25,99,363/- (ఇరవై ఐదు లక్షల తొంభై తొమ్మిది వేల మూడు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) మరియు 14.04.2022	రూ.17,10,000/- (పదిహేడు లక్షల పది వేల రూపాయలు మాత్రమే)	రూ.1,71,000/- (ఒక లక్షా డెబ్బై ఒక్క వేల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం ఉపజిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామ పంచాయతీ, ఆర్.ఎస్.నం.119/2, ప్లాట్ నం.4 సైట్ కొలత 246.8 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు** : 33' అ.లు. వెడల్పు రోడ్డు 40.4 అ.లు., **దక్షిణం** : రామకృష్ణ నగర్ 55.0 అ.లు., **పడమర** : ఎమ్.వి.రమణకు చెందిన ప్లాట్ నం.3 40.4 అ.లు. **ఉత్తరం** : జిఆర్ సుబ్రమణ్యంకు చెందిన ప్లాట్ నం.5–55.0 అ.లు. ఈ సరిహద్దుల మధ్య పేర్కొనబడిని ఉమ్మడి వాటా పరిధి 49.2 చ.గ.లు. లేదా 41.1 చ.మీ.లు. మొత్తం బయట కొలిచే పరిధి 246.8 చ.గ.లు. లేదా 206.35 చ.మీ.లు. షెడ్యూల్–బి : పైన పేర్కొన్న మొత్తం షెడ్యూల్–ఎ ఆస్తిలో "బాలాజీ టవర్స్" పేరు మరియు శైలిలో నిర్మించబడిన అపార్టుమెంట్లలోని రెండవ అంతస్తులో ఆ ఫ్లాట్ నం.ఎస్ఎఫ్–1 లో ఉన్న **హద్దులు** : ఈ ఫ్లాట్ మరియు ఎస్ఎఫ్–2 మధ్య ఉమ్మడి గోడ, **దక్షిణం** : ఓపెన్ టు స్కై మరియు కామన్ కారిడార్, **పడమర** : బాల్కనీ, ఓపెన్ టు స్కై, **ఉత్తరం** : కామన్ కారిడార్, మెట్లు. పై సరిహద్దుల మధ్య ఎస్ఎఫ్–1 కొలత 875 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 150 చ.అ.లు. కామన్ ఏరియాలు, 20 చ.అ.లు. పార్కింగ్, తో అన్నీ సౌకర్యాలు, ఫిక్చర్లు, ఫిట్టింగులతో కలిపి కామన్ సౌకర్యాలలో ఉమ్మడి హక్కులు అనగా.. మెట్లకేస్, తో కలిపి దానికి సంబంధించిన సౌలభ్య హక్కులు.						
9.	10056428	శ్రీ. బల్లి వికాస్ (రుణగ్రహీత) శ్రీ.బల్లి నాగేశ్వరరావు (సహ రుణగ్రహీత)	రూ.23,28,905/- (ఇరవై మూడు లక్షల ఇరవై ఎనిమిది వేల తొమ్మిది వందల ఐదు రూపాయలు మాత్రమే) మరియు 27.04.2021	రూ.12,80,000/- (పన్నెండు లక్షల ఎనభై వేల రూపాయలు మాత్రమే)	రూ.1,28,000/- (ఒక లక్షా ఇరవై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : షెడ్యూల్ : ఎ.పి., కృష్ణాజిల్లా, ఎస్ఆర్ఓ మైలవరం–521 230, రెడ్డిగూడెం మండలం, పటనాగులూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ఎస్‌సి వీధి, ఆర్.ఎస్.నం.125/2 సబ్ డివిజన్ తర్వాత ఆర్.ఎస్.నం.125/2సి, డో.నం.1–153/ఎ వద్ద, విస్తీర్ణం ఎసి. 0.14 సెంట్లు., బయట ఎసి. 0.33 సెంట్లు. తో అన్నీ సౌలభ్య హక్కులతో కలిపి ఆర్‌సిసి రూఫ్డ్ భవనంతో గ్రౌండ్ మరియు ఒకటవ అంతస్తులు ఉన్న **హద్దులు** : అంశం నం.1 : విస్తీర్ణం 150 చ.గ.లు. **హద్దులు : తూర్పు** : డ్రైనేజి కాలువ, **దక్షిణం** : బల్లి ఫ్రాన్సిస్ మరియు ఇతరుల ఆస్తి, **పడమర** : బస్ షెల్టర్, **ఉత్తరం** : పిఎన్‌జిఎస్‌వై రోడ్డు. అంశం నం.2 : విస్తీర్ణం 150 చ.గ.లు. **హద్దులు** : ఆరేతమ్మ కాలువ, **దక్షిణం** : పిఎన్‌జిఎస్‌వై రోడ్డు, **పడమర** : కొలుసు కోనమ్మ స్థలం, **ఉత్తరం** : మిక్కిలి జాన్ స్థలం, సైట్ అంశం నం.1 మరియు 2 మొత్తం 300 గజాల తో దానిపై ప్రతిపాదిత నిర్మాణం.						
10.	10124413	శ్రీ.ఎస్.కోటేశ్వరరావు, శ్రీమతి. పుష్పలత	రూ.20,72,293/- (ఇరవై లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే) మరియు 12.10.2022	రూ.17,00,000/- (పదిహేడు లక్షల రూపాయలు మాత్రమే)	రూ.1,70,000/- (ఒక లక్షా డెబ్బై వేల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : కృష్ణాజిల్లా, ఎస్ఆర్ఓ జగ్గయ్యపేట పరిధిలోని వాత్సవాయి మండలం, భీమవరం గ్రామం మరియు గ్రామ పంచాయతీలో శ్రీ.శంకబత్తుల కోటేశ్వరరావు పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.12939/2017 మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ టిఎల్‌పి నం.141/2015/ఆర్ ఆర్.ఎస్.నం.327/1బి, 2,3, 328/1(పి), 2ఎ1, 2ఎ2, 2బి మరియు 330/2ఎ(పి) మరియు 327/2 లో విస్తీర్ణం 516 చ.గ.లు. ఎసి. 2.00 సెంట్లు. తేది : 02.04.2015న రిఫరెన్స్ ఆర్.సి.నం.సిఎఫ్‌జి5–10/2013 క్రింద డి.టి.సి.పి.లే అవుట్ నం.3217/138/2015/ఆర్3 ఆమోదం ప్రకారం ప్లాట్ నం.115. **హద్దులు** : **తూర్పు** 33–0 అ.లు. వెడల్పు రోడ్డు 99–0 అ.లు., **పడమర** : ప్లాట్ నం.138,137,136 లో ఆస్తి 99–0 అ.లు., **ఉత్తరం** : ప్లాట్ నం.128 లో ఆస్తి 47–0 అ.లు., **దక్షిణం** : ప్లాట్ నం.124 లో ఆస్తి 47–0 అ.లు.						
11.	10514991 & 10687761	శ్రీ.పదాల గోపి, శ్రీమతి. పదాల అనురాధ, వర్ధన కిరాణ	ఒప్పందం నం.**10687761** క్రింద చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.2,06,518/-** మరియు ఒప్పందం నం.**10514991** క్రింద చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.13,95,487/-** మొత్తం **రూ.1602005/- – మరియు 31-01-2022**	రూ.9,95,000/- (తొమ్మిది లక్షల తొంభై ఐదు వేల రూపాయలు మాత్రమే)	రూ.99,500/- (తొంభై తొమ్మిది వేల ఐదు వందల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్. **అంశం నం.1 :** కృష్ణాజిల్లా, నున్న సబ్ రిజిస్ట్రార్, విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామ పంచాయతీ మరియు గ్రామం ఆర్.ఎస్.నం.758/2, సైట్ కొలత 2200 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు** : బి.భాస్కరరెడ్డి ఆస్తి మరియు రోడ్డు, **దక్షిణం** : జెట్టి సాయిబాబా ఆస్తి, **పడమర** : సిహెచ్.వెంకటేశ్వరరావు ఆస్తి, **ఉత్తరం** : వై.వెంకట రెడ్డి మరియు ఇతరుల ఆస్తి. ఈ సరిహద్దుల మధ్య రెసిడెన్షియల్ సైట్ పరిధి 2200 చ.గ.లు. లేదా 1839.48 చ.మీ.లు., ఆ బ్లాక్ నం.1 లో నిర్మించబడిన 1200 చ.గ.లు. లేదా 1003.32 మీ.లు. బయట ఉమ్మడి సైట్ ఆ పేర్కొనబడిని వాటా పరిధి 25 చ.గ.లు. లేదా 20.90 చ.మీ.లు. **అంశం నం.2 :** పైన పేర్కొన్న అంశం నం.1 ఆస్తిలో "మహేశ్వరాయ్ టవర్స్" పేరు మరియు శైలిలో నిర్మించబడిన అపార్టుమెంట్లలోని బ్లాక్ నం.1, 3వ అంతస్తు, ఫ్లాట్ నం.టిఎఫ్–జి, బేరింగ్ మూల్యాంకనం నం.3327, డో.నం.14–175/4జి ఉన్న **హద్దులు : తూర్పు** : ఓపెన్ టు స్కై, మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, **దక్షిణం** : ఓపెన్ టు స్కై, **పడమర** : ఫ్లాట్ నం.టిఎఫ్–హెచ్, **ఉత్తరం** : కామన్ కారిడార్. పై సరిహద్దుల మధ్య మూడవ అంతస్తులో ఫ్లాట్ నం.టిఎఫ్–జి కొలత 680 చ.అ.లు. ప్లింత్ ఏరియా, 20 చ.అ.లు. కామన్ ఏరియా, 100 చ.అ.లు. కార్ పార్కింగ్ తో అన్నీ సౌకర్యాలు, ఫిక్చర్లు, ఫిట్టింగులతో కలిపి కామన్ ఏరియాలు మరియు సౌకర్యాలలో ఉమ్మడి హక్కులతో దానికి సంబంధించిన అన్నీ సౌలభ్య హక్కులు.						
12.	10229198	శ్రీ.కొలగాని ఏడుకొండలు (రుణగ్రహీత) శ్రీమతి. కొలగాని వీరరంగమ్మ (సహ రుణగ్రహీత)	Rs.12,70,441/- & 16.11.2021	రూ.5,45,000/- (ఐదు లక్షల నలభై ఐదు వేల రూపాయలు మాత్రమే)	రూ.54,500/- (యాభై నాలుగు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రార్, సుబ్బాయిగూడెం గ్రామ పంచాయతీ మరియు గ్రామం ఆర్.ఎస్.నం.35/2ఎ1ఎ, 35/2ఎ1బి, 35/2సి1 లో ఉన్న ఎపిసిఆర్‌డిఎ విజయవాడ వైడ్ ఎల్.పి.నం.53/2016 ద్వారా ఆమోదించబడిన లే అవుట్, ప్లాట్ నం.207 లే అవుట్ ప్లాన్ కొలత 248.75 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు** : ప్లాట్ నం.208, **దక్షిణం** : ప్లాట్ నం.206, **పడమర** : 40–0 అ.లు. వెడల్పు రోడ్డు, **ఉత్తరం** : ఇతరుల ఆస్తి. పేర్కొన్న సరిహద్దుల ఖాళీ సైట్ పరిధిలో 248.75 చ.గ.లు. లేదా 207.97 చ.మీ.లు. తో పాటు సౌలభ్యాలు మరియు దాని అనుబంధ హక్కులు.						
13.	10421835	శ్రీ.వరద కోటేశ్వరరావు, శ్రీమతి. వరద లోక కళ్యాణి	రూ.9,83,782/- (తొమ్మిది లక్షల ఎనభై మూడు వేల ఏడు వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) మరియు 15.11.2022	రూ.6,85,000/- (ఆరు లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే)	రూ.68,500/- (అరవై ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : కృష్ణాజిల్లా, ఎస్ఆర్ఓ జగ్గయ్యపేట, జగ్గయ్యపేట మండలం, షేర్ ఎమ్‌డి పేట, రవికంపాడు శివారులో ప్లాట్ నం.31 'శ్రీ.వరద కోటేశ్వరరావు పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్ సేల్ డీడ్ నం.5689/2018 మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ సర్వే నం.56 లో సైట్ విస్తీర్ణం ఎసి. 11.50 సెంట్లు. "సిద్దార్థ టౌన్‌షిప్" ఎల్.పి.నం.49/2016/విజిఎ మరియు క్రింది విధమైన **హద్దులు** : సరిహద్దులు : **తూర్పు** : 40 అ.లు. వెడల్పు రోడ్డు 36 అ.లు., **దక్షిణం** : ప్లాట్ నం.30 లో స్థలం 50 అ.లు., **పడమర** : ప్లాట్ నం.55లో స్థలం 36 అ.లు., **ఉత్తరం** : ప్లాట్ నం.32లో స్థలం 50 అ.లు. ఈ సరిహద్దుల ఓపెన్ ప్లాట్ పరిధి 200 చ.గ.లు.						
14.	10556840	శ్రీ.బండి శ్రీనివాస్, శ్రీమతి. బండి సాయిలక్ష్మి	రూ.9,41,379/- (తొమ్మిది లక్షల నలభై ఒక్క వేల మూడు వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు 12.12.2022	రూ.4,60,000/- (నాలుగు లక్షల అరవై వేల రూపాయలు మాత్రమే)	రూ.46,000/- (నలభై ఆరు వేల రూపాయలు మాత్రమే)	భౌతికం
స్థిరాస్తి వివరణ : నందిగామ ఎస్ఆర్ఓ, చందర్లపాడు మండలం, ముప్పల గ్రామ పంచాయితీ ఏరియా, ముప్పల గ్రామంలో ఆర్.సి.నం.225/4, 225/5, ఎపిసిఆర్‌డిఎ ఎల్.పి.నం.28/2016, శ్రీ.బండి శ్రీనివాస్ పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.1991/2019 మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ విస్తీర్ణం 150 చ.గ.లు. మరియు క్రింది విధమైన **హద్దులు** : **సరిహద్దులు** : 40–00 అ.లు. వెడల్పు రోడ్డు 30–0 అ.లు., **దక్షిణం** : ప్లాట్ నం.26 సరిహద్దు 45–0 అ.లు., **పడమర** : ఇతరుల స్థలం 30–0 అ.లు., **ఉత్తరం** : ప్లాట్ నం.28 సరిహద్దు 45–0 అ.లు. ఈ సరిహద్దుల మధ్య ఓపెన్ స్థలం పరిధిలో 150–0 చ.గ.లు. లేదా 125–419 చ.మీ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు.						

వేలం వద్ద, సాధారణ ప్రజలు వ్యక్తిగతంగా వారి బిడ్(లు) దాఖలు చేయుటకు ఆహ్వానించడమైనది రుణగ్రహీత(లు)/సహ–రుణగ్రహీత(లు) ఈ నోటీసు ప్రచురించిన 15 రోజులలోపు మొత్తం బకాయిలను తదుపరి వడ్డీతో చెల్లించడానికి ఇక్కడ చివరి అవకాశం ఇవ్వబడింది. లేని పక్షంలో స్థిరాస్తి షెడ్యూల్ ప్రకారం విక్రయించబడుతుంది. పైన పేర్కొన్న విధంగా చెల్లించాల్సిన మొత్తం, వడ్డీ మరియు ఖర్చులు (అమ్మకపు ఖర్చుతో సహా) పైన పేర్కొన్న మొత్తాన్ని 'అధీకృత అధికారికి టెండర్ చేస్తే ఇ వేలం నిలిపివేయబడుతుంది లేదా అటువంటి సురక్షితమైన రుణం, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించినట్లు ఇ-వేలం తేదీకి ముందే అతని సంతృప్తికి రుజువు ఇచ్చినట్లయితే.

ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి, ఈ అమ్మకానికి సంబంధించి ఏ విధమైన విధిని కలిగి ఉన్నా, అయితే, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వేలం వేయాలి, అమ్మిన ప్రవచనంలో ఆసక్తిని సంపాదించడానికి కొనుగోలుదారుడు ప్రయత్నిస్తాడు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో సూచించిన షరతులకు లోబడి ఉండవలెను మరియు తదుపరి షరతులు అనుసరించవలెను:

గమనిక : ఇ-వేలం 28.03.2024న మ.2.00గం.ల నుండి 3.00గం.ల మధ్యన ప్రతి 10 నిమిషాల పొడగింపుతో పోర్టల్ https://bankauctions.in/ ద్వారా జరుగుతుంది.

నియమాలు మరియు నిబంధనలు:

1) దిగువ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్నట్లుగా క్రింది సంతకందారునికి ఉన్నంత సమాచారం మేరకు సరైనవి, కాని క్రింది సంతకందారుడు ఈ ప్రొక్లేమేషన్‌లో ఏదేని పొరపాటు, మిస్‌స్టేట్‌మెంట్ లేదా లోపానికి సమాధానం ఇవ్వరు. మొత్తం బిడ్ లేదా బిడ్డరుదారుకు ఏదేని వివాదాలు తలెత్తితే, ఆ లాట్ మళ్లీ ఒకసారి వేలం కొరకు ఉంచబడును.
2) ఆస్తిని రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు.
3) బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (పది వేల రూపాయలు)
4) ఆస్తి కొనుగోలు కోసం సమర్పించిన అన్ని బిడ్‌లు పైన పేర్కొన్న విధంగా ఎర్నెస్ట్ మనీతో పాటు "టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" కి అనుకూలంగా ఉండే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అందించబడతాయి. చెల్లించవలసిన శాఖ చిరునామా: ఎన్ఆఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ ఐఎమ్‌పిఎస్ ద్వారా ఇఎమ్‌డి కోసం, దయచేసి అధీకృత అధికారిని సంప్రదించండి. వేలం సఫలీకృతంకాని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగిఇవ్వబడును.
5) అధికృతగల బిడ్డరుదారు బిడ్‌కు చట్టపరంగా అర్హతపొందినగా అన్నివిధాలా కల్పించిన ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతారు మరియు తదుపరిగా అతని ద్వారా బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫర్‌చేసిన ధర సరిగాలేనట్లుగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్ యొక్క క్షీణత అనుమతించుట ఆధీకృత అధికారి యొక్క విచక్షణ మేరకు ఉంటుంది.
6) రికార్డు అయిన కారణాల కొరకు అమ్మకమును వాయిదా వేయుట/నిలిపివేయుట అనునది 'ఆధీకృత అధికారి' యొక్క విచక్షణ మేరకు ఉంటుంది.
7) ఆస్తి యొక్క తనిఖీ **20.03.2024న ఉ.11 గం.ల నుండి సా.5.00గం.ల మధ్యలో** చేపట్టవచ్చును.
8) కొనుగోలుదారుగా ప్రకటించబడు వ్యక్తి, సదరు డిక్లేరేషన్ తరువాత వెంటనే, కొనుగోలుచేసిన మొత్తం/బిడ్‌లో ఇరవై ఐదు శాతంను 24 గం.లలోపు **'ఆధీకృత అధికారి'**కి డిపాజిట్ చేయవలెను మరియు సదరు డిపాజిట్ విషయంలో విఫలమైన యెడల, ఆస్తి వెంటనే ప్రైవేట్ ట్రీటీ ద్వారా తాజా వేలం/అమ్మకానికి ఉంచబడుతుంది.
9) పై విధంగా చేసిన ప్రారంభ డిపాజిట్ విషయంలో, కొనుగోలు యొక్క మిగిలిన మొత్తంను ఆస్తి అమ్మకం నిర్ధారణ తేది నుండి 15వ రోజున లేదా ఆలోగా ఆధీకృత అధికారి కొనుగోలుదారు చెల్లించవలెను, లేదా ఒకవేళ 15వ రోజు ఆదివారం లేదా ఇతర సెలవు రోజువస్తే, 15వ రోజు తరువాత మొదటి రోజున చెల్లించవలెను.
10) పైన పేర్కొన్న సమయంలో ఏదైన విఫలం చెందితే, ప్రైవేట్ ట్రీటి ద్వారా ఆస్తిని తాజాగా వేలం/విక్రయం జరుపబడును. డిపాజిట్ టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఇఎండి సహా వదులుకోవాల్సి ఉంటుంది మరియు విఫలమైన కొనుగోలుదారుడు ఆస్థి దావాలు కోల్పోవలసి ఉంటుంది.
11) ఆస్తికి సంబంధించిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి తెలిసినంత వరకు ఏదేని రుణాభారాలు వివరాలు: నిల్. ఆస్తికి పెట్టబడిన క్లెయిలు ఏవేని ఉన్నట్లయితే మరియు దీని స్వభావం మరియు విలువపై కలిగియున్న ఏదేని ఇతర తెలిసిన వివరాలు : లేవు. పైవి కాక ఇతరములు ఏవీలేవు.
12) ఏదైనా ఇతర వివరాల కోసం లేదా ఇ-వేలం పై ఆన్‌లైన్ శిక్షణ కోసం కాబోయే బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్ 4క్లోజర్, బ్లాక్ నం.605 ఎ, 6వ అంతస్తు, మైత్రివనం కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్–500038 ద్వారా దీని కార్డినేటర్స్ **శ్రీ.అరిజిత్ కుమార్ దాస్, మొబైల్ నం: 8142000725, 8142000066, 8142000062 ఇ మెయిల్ : arijit@bankauctions.in మరియు ఇ మెయిల్ : info@bankauctions.in లేదా మనిష్ బన్సాల్, ఇ మెయిల్ ఐడి: Manish.bansal@tatacapital.com** ని సంప్రదించవచ్చు. ఆధీకృత అధికారి ఫోన్ నెం. 8588983696, దయచేసి మీ ప్రశ్నను వాట్సప్ నెం. 9999078669 లో పంపండి.
13) 1% టిడిఎస్ వర్తించబడును మరియు గరిష్టంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది.
14) పై వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ **http://surl.li/rfvur లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు.**
15. దయచేసి **https://www.tatacapital.com/property-disposal.html** లింక్‌ని కూడా సందర్శించండి.

దయచేసి గమనించండి– టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 12.03.2024

సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

చైల్డ్ పోర్న్ కేసు

మద్రాసు హైకోర్టు తీర్పుపై విచారణకు సుప్రీం అంగీకారం

న్యూఢిల్లీ : బాలల అశ్లీల చిత్రాలను కేవలం డౌన్‌లోడ్ చేసుకోవడం, వీక్షించడం పోక్సో చట్టం కింద, సమాచార సాంకేతిక చట్టం కింద నేరం కాదంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను సవాలు చేస్తున్న పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు సోమవారం అంగీకరించింది. ఈ రూలింగ్‌ను దారుణమైనదిగా వ్యాఖ్యానించింది. బాలల అశ్లీల చిత్రాలను తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడని అభియోగాలు నమోదైన 28ఏళ్ల వ్యక్తిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను మద్రాసు హైకోర్టు జనవరి 11న కొట్టివేసింది. అసభ్య చిత్రాలనే తీవ్రమైన సమస్యతో ప్రస్తుత రోజుల్లో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారిని శిక్షించడానికి బదులుగా ఈ విషయంలో చైతన్యవంతులను చేసే దిశగా సమాజం పరిపక్వత పొందాలని హైకోర్టు ఆనాడు వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పు చట్టాలకు పూర్తి విరుద్ధంగా వుందంటూ రెండు సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. వాటి తరపున సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్.ఫూల్కా చేసిన వాదనలను ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్, జస్టిస్ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీం బెంచ్ పరిగణనలోకి తీసుకుంది. "హైకోర్టు ఇచ్చిన తీర్పు చాలా దారుణంగా వుంది. ఏకసభ్య ధర్మాసనం ఇలా ఎలా చెబుతుంది? మూడు వారాల్లోగా జవాబివ్వాల్సిందిగా నోటీసులు జారీ చేయండి" అని చంద్రచూడ్ పేర్కొన్నారు.

బాలల సంక్షేమం కోసం పనిచేసే ఎన్‌జిఓలు ఫరీదాబాద్‌కి చెందిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్, న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే బచ్‌పన్ బచావో ఆందోళన్‌లు ఈ పిటిషన్లు వేశాయి. చెన్నై నివాసి అయిన ఎస్.హరీష్, తమిళనాడుకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు సమాధానాలు ఇవ్వాలని సుప్రీం కోరింది. హరీష్‌పై పోక్సో చట్టం, సమాచారం సాంకేతిక చట్టం కింద దాఖలైన క్రిమినల్ కేసులను హైకోర్టు కొట్టివేసింది.

సామాజిక భద్రత కరువు

- నిబంధనలు లేవు
- ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు
- అధ్యయనంలో వెల్లడైన గిగ్ వర్కర్ల సమస్యలు

న్యూఢిల్లీ : దేశంలోని గిగ్ వర్కర్ల విషయంలో ప్రభుత్వాలు సీరియస్‌గా దృష్టిని సారించటం లేదు. దీంతో వారు నిబంధనలు, సామాజిక భద్రత లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒక అధ్యయనం ప్రకారం.. యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్‌లలో దాదాపు మూడింట ఒక వంతు మంది రోజుకు 14 గంటలకు పైగా పని చేస్తారు. అయితే 83 శాతం కంటే ఎక్కువ మంది కార్మికులు 10 గంటల కంటే ఎక్కువ, 60 శాతం మంది 12 గంటలకు పైగా పని చేస్తారు. ఈ రంగంలో సామాజిక అసమానతలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఎస్సీ, ఎస్టీల నుంచి 60 శాతానికి పైగా డ్రైవర్లు రోజుకు 14 గంటల కంటే ఎక్కువ పనిచేస్తున్నారు. అయితే ఉన్నతవర్గాల నుంచి మాత్రం 16 శాతం మంది మాత్రమే ఎక్కువ గంటలు పని చేస్తున్నారు. యాప్ ఆధారిత కార్మికులకు బలమైన సామాజిక భద్రత అవసరాన్ని అధ్యయనం నొక్కి చెప్పింది. అలాంటి కార్మికులను పర్యవేక్షించడానికి ప్లాట్‌ఫారమ్‌లు ఉపయోగించే అల్గారిథమ్‌లు, మెకానిజమ్‌ల న్యాయబద్ధతపై ప్రభుత్వం పర్యవేక్షణ చేయాలని అధ్యయనంలో భాగమైన పరిశోధకులు పిలుపునిచ్చారు.

పీపుల్స్ అసోసియేషన్ ఇన్ గ్రాస్‌రూట్ యాక్షన్ అండ్ మూవ్‌మెంట్స్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఈ అధ్యయనాన్ని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, ఫ్రెడరిచ్-ఎబర్ట్-స్టిఫ్టంగ్ ఇండియా, జర్మన్ ఫౌండేషన్ నుంచి సాంకేతిక సహకారంతో నిర్వహించాయి.

తక్కువ జీతం.. ఎక్కువ పని గంటలు

అధ్యయనంలో పాల్గొన్నవారిలో 43 శాతం మంది తమ ఖర్చులన్నింటినీ తీసివేసిన తర్వాత రోజుకు రూ.500, నెలకు రూ. 15,000 కంటే తక్కువ సంపాదిస్తున్నామని తెలిపారు. యాప్ ఆధారిత డెలివరీ వ్యక్తులలో 34 శాతం మంది నెలకు రూ. 10 వేల కంటే తక్కువ సంపాదిస్తున్నారనీ, వారిలో 78 శాతం మంది ప్రతిరోజూ 10 గంటల కంటే ఎక్కువ సమయం పనిలో గడుపుతున్నారని తేలింది.ఈ ఆదాయ అసమానతలు ఇప్పటికే ఉన్న సామాజిక అసమానతలను మరింత తీవ్రతరం చేశాయి. ఈ వర్గాలలో పేదరికం, బాధలను శాశ్వతం చేస్తున్నాయి. మొత్తమ్మీద, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, లక్నో, కోల్‌కతా, జైపూర్, ఇండోర్ అనే ఎనిమిది నగరాల్లో 5302 మంది క్యాబ్ డ్రైవర్లు, 5028 మంది డెలివరీ వ్యక్తులు 50 ప్రశ్నల సర్వేలో పాల్గొన్నారు. ఇందులో 78 శాతం మంది 21 నుంచి 40 సంవత్సరాల వయస్సు గలవారు ఉన్నారు.

ఆదాయాన్ని మించిన ఖర్చులు

క్యాబ్ డ్రైవర్లలో 72 శాతం మంది వారు ఖర్చులను నిర్వహించటంలో ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. 76 శాతం మంది డెలివరీ వ్యక్తులు తమ అవసరాలను తీర్చుకోవటానికి కష్టపడుతున్నారు. 68 శాతం మంది క్యాబ్ డ్రైవర్లు.. తమ మొత్తం ఖర్చులు.. ఆదాయాలను మించిపోతున్నాయని చెప్పారు. యాప్ ఆధారిత క్యాబ్ డ్రైవర్‌లలో 80 శాతం మంది కంపెనీలు అందించే ఛార్జీలతో సంతప్తి చెందటంలేదు. అయితే 73 శాతం మంది యాప్ ఆధారిత డెలివరీ వ్యక్తులు తమ రేట్లపై



అసంతృప్తిని వ్యక్తం చేశారు. 35 శాతం మంది మంది.. కంపెనీలు ఒక్కో రైడ్‌కు కమీషన్ రేటులో 31-40 శాతం మధ్య తగ్గిస్తున్నాయని నివేదించారు. 68 శాతం మంది.. ఈ తగ్గింపులు ఏకపక్షం, అన్యాయమైనవని చెప్పారు.

కస్టమర్ ప్రవర్తనతో ప్రభావం

వారంలో ఒక్కరోజూ సెలవు తీసుకోలేకపోతున్నామని 41 శాతం మంది డ్రైవర్లు చెప్పారు. 48శాతం మంది డెలివరీ వ్యక్తులు కూడా వారానికోసారి సెలవు తీసుకోలేకపోతున్నామని చెప్పారు. 37 శాతం కంటే తక్కువ మంది డ్రైవర్లు తాము యూనియన్‌కు చెందినవారమని చెప్పారు. కార్మికుల మరొక ప్రధాన ఫిర్యాదు ఐడీ డియాక్టివేషన్, కస్టమర్ దుర్వినియోగం సమస్య. ఐడీ బ్లాకింగ్ సమస్య తమను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని 83 శాతం మంది డ్రైవర్లు నివేదించారు. 47 శాతం మంది ఈ సమస్య తమను చాలా ప్రభావితం చేస్తుందని వివరించారు. డెలివరీ వ్యక్తుల విషయంలో, ఇది 87 శాతం కంటే ఎక్కువగా ఉన్నది. కస్టమర్ ప్రవర్తన డ్రైవర్లను ప్రతికూల మార్గంలో ప్రభావితం చేస్తున్నది. అయితే 68 శాతం మంది డెలివరీ వ్యక్తులు ప్రతికూలంగా ప్రభావితమయ్యామని తెలిపారు.

గిగ్ వర్కర్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిని సారించాలని యూనియన్ నాయకులు తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా తమకు భద్రతను కల్పిస్తూ కొన్ని నిబంధనలను తీసుకురావాలని చెప్పారు.

22న జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఎన్నికలు

న్యూఢిల్లీ : దేశరాజధానిలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో ఎట్టకేలకు విద్యార్థి సంఘం ఎన్నికలు ఈ నెల 22న జరగనున్నాయి. దాదాపు నాలుగేళ్ల తర్వాత ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. 2023-24 విద్యార్థి సంఘం ఎన్నికలకు జేఎన్‌యూఎస్‌యూ ఎలక్షన్ కమిటీ షెడ్యూల్‌ను ప్రకటించింది. 24న ఓట్ల లెక్కింపు జరగనుంది.

యువ ఓటర్ల మొగ్గు ఎటు?

- నిరుద్యోగమే ప్రధాన సమస్య

న్యూఢిల్లీ : షెడ్యులు విడుదల కాకపోయినా సార్వత్రిక ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించేశాయి. సబ్సిడీలు, పథకాలకు ప్రధాని 'గ్యారంటీలు' ఇస్తుంటే దీనికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఐదు గ్యారంటీలు ఇచ్చింది. అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 30 లక్షల పోస్టులను భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.8,500 స్టైఫండుతో సంవత్సరం పాటు అప్రెంటీస్‌షిప్ అందిస్తామని, పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టేందుకు చట్టాన్ని తీసుకొస్తామని, సేవల రంగంలో తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్న వారికి సామాజిక భద్రత కల్పిస్తామని, ఐదు వేల కోట్ల రూపాయలతో యువ రోష్నీ పేరిట జాతీయ నిధిని ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో స్టార్టప్‌ల ఏర్పాటుకు చేయూత అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. సైనిక దళాలలో నియామకాల కోసం మూడు సంవత్సరాల కాంట్రాక్ట్ పద్ధతిలో మోడీ ప్రభుత్వం ప్రారంభించిన అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని కూడా ప్రకటించింది.

అమెరికాకు అక్రమ వలసలు

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో నిరుద్యోగ సమస్య నిర్మూలనపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఈ హామీలను బట్టి అర్థమవుతోంది. ఇటీవలి కాలంలో దేశంలో సరైన ఉపాధి లభించక పలు దేశాలకు అక్రమంగా వలస వెళుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. భారత్ నుండి చట్టవిరుద్ధంగా వలస వచ్చే వారి సంఖ్య పెరిగిపోతోందని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సమాచారం చెబుతోంది. 2018-19లో భారత్ నుండి 8,027 మంది, 2019-20లో 1,227 మంది, 2020-21లో 30,662 మంది, 2021-22లో 63,927 మంది, 2022-23లో 96,917 మంది అక్రమంగా వలస వచ్చారని అమెరికా అంచనా వేసింది. అమెరికాలో మంచి జీతాలు లభిస్తాయన్న ఉద్దేశంతో నిరుద్యోగ యువత అక్రమంగా ఆ దేశం బాట పడుతోంది.

ప్రాణలకు తెగించి యుద్ధ భూమికి...

పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదంటే నిరాశా నిస్పృహలకు లోనవుతున్న యువత చివరికి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి యుద్ధ భూమికి వెళ్లేందుకు కూడా వెనుకాడడం లేదు. దాదాపు 800 మంది యువకులు గత సంవత్సరం డిసెంబరులో ఇజ్రాయిల్ వెళ్లారు. ఇంకా పలువురు యువకులు అందుకోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఇజ్రాయిల్‌పై హమాస్ దాడుల తర్వాత 80 వేల మంది పాలస్తీనీయులు ఉద్యోగాలు కోల్పోయారు. వీరి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఇతర దేశాలకు చెందిన యువకులను ఇజ్రాయిల్ నియమించుకుంటోంది. ఇలా యుద్ధ భూమికి వెళ్లిన యువకులు సురక్షితంగా తిరిగి వస్తారని ఎవరూ గ్యారంటీ ఇవ్వలేరు. కేరళకు చెందిన ఓ యువకుడు వలస వెళ్లిన రెండు నెలలలోనే ఓ ఇజ్రాయిల్ వ్యవసాయ క్షేత్రంపై జరిగిన క్షిపణి దాడిలో చనిపోయాడు. యువత ప్రాణాలకు ముప్పు ఉన్నదని తెలిసి కూడా హర్యానా, రాజస్థాన్, బీహార్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, మిజోరం రాష్ట్ర ప్రభుత్వాలు ఇజ్రాయిల్ కోసం నియామక ప్రక్రియను నిర్వహిస్తున్నాయి.

ఉక్రెయిన్‌లో పోరాడేందుకు మన దేశానికి చెందిన పలువురు యువకులు 2022లో అంతర్జాతీయ దండులో చేరారు. 'సైనిక భద్రతా సహాయకులు'గా నియమితులైన సుమారు వంద మందిని రష్యా సైనికులతో కలిసి పోరాడేలా బలవంతం చేశారు. వీరిలో హైదరాబాదుకు చెందిన మహమ్మద్ అఫ్సన్ యుద్ధంలో చనిపోయాడు. ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం తన ప్రభుత్వం నిరుద్యోగులను ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కొందరు యువతకు నియామక పత్రాలు అందజేస్తూ అదేదో గొప్ప ఘనకార్యంగా చెప్పుకుంటున్నారు.

ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం 2022లో భారత్‌లోని యువతలో నిరుద్యోగం 23.22 శాతంగా ఉంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్‌లో కంటే అది ఎక్కువ. 2022-23లో దేశంలోని యువతలో నిరుద్యోగ రేటు 45.4 శాతంగా ఉన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సంస్థ అంచనా వేసింది. దేశంలోని నిరుద్యోగ రేటు (7.5 శాతం) కంటే ఇది ఆరు రెట్లు అధికం.

రేపు ప్రచండ విశ్వాస పరీక్ష

ఖాట్మండు : నేపాల్ ప్రధాని మరోసారి పార్లమెంటు విశ్వాసాన్ని కోరనున్నారు. నేపాలీ కాంగ్రెస్‌తో మొన్నటివరకు సంకీర్ణ ప్రభుత్వం నడిపిన ఆయన గత వారం ఆ సంకీర్ణానికి గుడ్‌బై చెప్పి, పాత మిత్రులు కెపి శర్మ ఓలి నేతృత్వంలోని నేపాలీ కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్)తో చేతులు కలిపి కొత్త సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో పార్లమెంటులో తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉన్నందున ఈ నెల 13న బలపరీక్షకు సిద్ధమయ్యారు. ఆయనకు ఇది మూడో దఫా విశ్వాస పరీక్ష. ఏ మిత్రపక్షమైనా మద్దతు ఉపసంహరించుకున్న పక్షంలో ప్రధాన మంత్రులు 30 రోజుల్లోగా సభా విశ్వాసాన్ని కోరాలని నేపాల్ రాజ్యాంగ నిబంధనలు పేర్కొంటున్నాయి. శనివారం దీనిపై తన సన్నిహితులతో ప్రచండ చర్చించారు. 13వ తేదీన పార్లమెంట్ దిగువ సభలో జరిగే ఓటింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా సభ్యులందరికీ విప్ జారీ చేయాలని సిపిఎన్-మావోయిస్ట్ సెంటర్ పార్లమెంటరీ పార్టీ నిర్ణయించింది. 275మంది సభ్యులు గల ప్రతినిధులసభలో కొత్త సంకీర్ణానికి తగిన మెజారిటీ వుందని నేపాల్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

15లోగా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకం?

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్లుగా అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ, అరుణ్ గోయెల్ ఆకస్మిక రాజీనామాతో ఏర్పడిన ఖాళీలను త్వరలోనే భర్తీ చేయనున్నట్టు తెలుస్తున్నది. ఈనెల 15 లోపు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించే అవకాశం ఉన్నదని సమాచారం. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను పోల్ ప్యానెల్ ప్రకటించే కొన్ని రోజుల ముందు.. గోయెల్ రాజీనామా చేశారు. ఈ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. మరొక ఇసి అనుప్ చంద్ర పాండే ఫిబ్రవరి 14న 65 ఏండ్ల వయసులో పదవీ విరమణ చేశారు. దీంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ పోల్ అథారిటీలో ఏకైక సభ్యుడిగా ఉన్నారు. మార్చి 13 లేదా 14 తేదీల్లో సెలక్షన్ కమిటీ సమావేశం కావచ్చనీ, మార్చి 15లోగా నియామకాలు జరిగే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఇటీవలే సీఈసీ, ఈసీల నియామకంపై కొత్త చట్టం అమల్లోకి రాకముందే, ఎన్నికల కమిషనర్లను ప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి నియమించిన విషయం విదితమే.

చివరి దశలో ఎన్నికలు జరపాలి : కెఎ పాల్

ప్రజాశక్తి-అమరావతి

ఎపిలో చట్టసభలకు జరపాల్సిన ఎన్నికలను మే చివర్లో నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ వద్దకు లంచ్‌మోషన్ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. విచారణ నుంచి జస్టిస్ రావు తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో జస్టిస్ జి నరేందర్, జస్టిస్ ఎన్ విజయ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేయనుంది. ఇవిఎంలు ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా మే చివర్లో చివరి దశలో ఎన్నికలు నిర్వహించాలని, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇసికి వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు రావాల్సి వచ్చిందని కెఎ పాల్ పిల్‌లో పేర్కొన్నారు.

కేరళలో అమలు చేయం : విజయన్

సిఎఎపై ప్రతిపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ : సిఎఎను అమల్లోకి తెచ్చినట్లు కేంద్రంలోని బిజెపి ప్రకటించడంపై వివిధ రాజకీయపార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిఎఎను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసినా కేరళలో మాత్రం ఆ చట్టాన్ని అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. మతపరమైన మార్గాల్లో ప్రజల్లో విభజన సృష్టించే చట్టంగా సిఎఎను విజయన్ విమర్శించారు. దేశంలో కల్లోలం రేపే లక్ష్యంతోనే బిజెపి దీనిని అమలు చేస్తున్నట్లు ప్రకటించిందని అన్నారు. ప్రజలను విభజించే, మతభావాలను రెచ్చగొట్టే, రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను దెబ్బతీసే ఈ చట్టాన్ని అంతా ఐక్యంగా వ్యతిరేకించాలని విజయన్ పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగంగానే దీన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు విజయన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముస్లిం మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే సిఎఎను కేరళలో అమలు చేయబోమని మా ప్రభుత్వం పదేపదే తెలిపింది. దానికే కట్టుబడి ఉంది. ప్రజల మధ్య మత విభజన తెచ్చే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేరళ అంతా ఏకతాటిపై నిలబడాలి' అని ప్రకటనలో విజయన్ తెలిపారు. సిఎఎ 2019ను అమల్లోకి తెచ్చినట్లు కేంద్రం ప్రకటించిన గంటల వ్యవధిలోనే విజయన్ ఈ ప్రకటన విడుదల చేశారు.



రాజకీయ ప్రయోజనాల కోసమే : స్టాలిన్



బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన మనోభావాలను ఉపయోగించుకోవడానికే సిఎఎను అమలు చేస్తున్నట్లు ప్రకటించిందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. అలాగే 'మునిగిపోతున్న బిజెపి అనే నౌకను రక్షించుకోవడానికి మోడీ చేస్తున్న ప్రయత్నం' అని కూడా స్టాలిన్ విమర్శించారు. ముస్లింలకు, శ్రీలంకకు చెందిన తమిళలకు ద్రోహం చేయడం ద్వారా మోడీ ప్రజల మధ్య విభజనకు బీజం వేశారని స్టాలిన్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి చేస్తున్న ఈ రాజకీయాలకు ప్రజలు సరైన బుద్ధి చెబుతారని కూడా స్టాలిన్ తెలిపారు. కాగా, సిఎఎను తమిళనాడులో అమలు చేయమని జనవరిలోనే స్టాలిన్ ప్రకటించారు.

ఇది విభజన రాజకీయం : కాంగ్రెస్

లోక్‌సభ ఎన్నికలకు ముందు సిఎఎ అమలు చేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుపట్టింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాంల్లో ఎన్నికల్లో ప్రయోజనాల కోసం బిజెపి తన సంకుచిత రాజకీయాలతోనే దీన్ని ప్రకటించిందని విమర్శించింది. కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎన్నికల బ్యాండ్ల విషయంలో ఎస్‌బిఐ పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయాన్ని మీడియాలో హెడ్‌లైన్ల నుంచి తప్పించడానికి, కేంద్రం ఈ నిర్ణయాన్ని ప్రకటించిందని కూడా ఆరోపించారు. 2019 డిసెంబరులో పార్లమెంట్ ఆమోదించిన చట్టానికి సంబంధించిన నిబంధనలను నోటిఫై చేయడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి నాలుగేళ్ల మూడు నెలల సమయం పట్టిందని విమర్శించారు. కేవలం ఎన్నికలకు ముందు సంకుచిత రాజకీయాల కోసమే ఈ నోటిఫికేషన్‌ను కేంద్రం తీసుకొచ్చిందని ఆరోపించారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే : అఖిలేష్ యాదవ్

వివిధ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే సిఎఎ అమలు చేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిందని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్‌పి నాయకులు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. బిజెపి రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. ఈ మేరకు అఖిలేష్ యాదవ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'ప్రస్తుతం దేశంలోని అనేక మంది పౌరులు బ్రతుకు తెరువు కోసం బలవంతంగా ఇతర దేశాలకు వెళ్తున్న సమయంలో.. విదేశీయుల కోసం సిఎఎను తీసుకురావడం వల్ల ఏమి జరుగుతుంది? బిజెపి రాజకీయాల ను ప్రజలు అర్థం చేసుకుంటున్నారు' అని అఖిలేష్ యాదవ్ పోస్ట్ చేశారు. 'తమ పదేళ్ల పాలనలో లక్షలాది మంది పౌరులు దేశ పౌరసత్వాన్ని ఎందుకు వదులుకున్నారో బిజెపి ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. అలాగే లోక్‌సభ ఎన్నికలు తరువాత 'ఎన్నికల బాండ్లు, పిఎం కేర్ ఫండ్' గురించి కూడా వివరణ ఇవ్వాలి' అని అఖిలేష్ యాదవ్ జోడించారు.

వివక్ష చూపితే వ్యతిరేకిస్తాం : మమత బెనర్జీ

ప్రజల హక్కులను కాలరాచే విధంగా వుంటే సిఎఎను, తాము వ్యతిరేకిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. సిఎఎ దేశంలో నివసించే ప్రజల సమూహాలపై వివక్ష చూపేదిగా వున్నా లేదా వారి ప్రస్తుత పౌరసత్వ హక్కులను హరించేదిగా వున్నా ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయమని మమతా చెప్పారు.

రోగుల ప్రాణాలు గాలిలో....

- పిఎంజెఎవై కింద ఆస్పత్రులకు అందని నిధులు
- అప్పుల ఊబిలో ఆస్పత్రులు
- వైద్య సేవల నిలిపివేత

న్యూఢిల్లీ : 'ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' (పిఎంజెఎవై) పథకం కింద వైద్య సేవలు పొందుతున్న రోగుల సంఖ్యను పలు రాష్ట్రాలలోని ఆస్పత్రులు తగ్గిస్తున్నాయి. సకాలంలో కేంద్రం నుండి రీయింబర్స్‌మెంట్ రాకపోవడమే దీనికి ప్రధాన కారణం. కేంద్రం నుండి నిధుల విడుదలలో తీవ్రమైన జాప్యం ఏర్పడుతుండడంతో ఆస్పత్రులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఈ పథకం కింద రోగులను ఇకపై చేర్చుకునే ప్రశ్నే లేదని తేల్చి చెబుతున్నాయి.

అహ్మదాబాద్‌లోని బాడీలైన్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి గత ఆరు సంవత్సరాలుగా ప్రతి నెలా 600 మంది రోగులకు ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తోంది. డయాలసిస్ కోసం ఆస్పత్రికి వచ్చిన ప్రతిసారీ రోగికి రూ.300 చొప్పున రవాణా ఖర్చులు చెల్లిస్తోంది. దీనికి ప్రతిఫలంగా ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం కింద కేంద్రం ఈ ఆస్పత్రికి ప్రతి డయాలసిస్ సెషన్‌కూ రూ.2,200 అందిస్తోంది. ఈ నగదు రహిత బీమా పథకం కింద పేదలకు వైద్య చికిత్స నిమిత్తం ఐదు లక్షల రూపాయల వరకూ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇదంతా ఒకప్పటి మాట.

తగ్గిపోతున్న రీయంబర్స్‌మెంట్

గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రీయంబర్స్‌మెంట్ సొమ్ము తగ్గిపోతోంది. మరోవైపు డయాలసిస్ యంత్రాల నిర్వహణ వ్యయం, వైద్య పరికరాల ఖర్చు, సిబ్బంది జీతాలు మాత్రం యధావిధిగానే ఉంటున్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఆస్పత్రి విలవిలలాడుతోంది. ఫిబ్రవరి 26వ తేదీ వరకూ కేంద్రం నుండి ఈ ఆస్పత్రికి రూ.3.4 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. వంద మంది రోగులపై ఖర్చు చేస్తుంటే 30 మంది రోగుల బిల్లులు మాత్రమే వస్తున్నాయని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఈ పథకం కింద వైద్య సేవలు అందజేస్తున్న అన్ని ఆస్పత్రుల పరిస్థితి ఇలాగే ఉంది. ఒక్క గుజరాత్‌లోని ఆస్పత్రులకే 2021 నుండి 2023 జూలై వరకూ రూ.300 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుండి నిధులు అందకపోవడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులకు చికిత్సలు నిలిపివేస్తున్నాయి. గుజరాత్‌లోని 300 బాధిత ఆస్పత్రులు గత సంవత్సరం ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. పెండింగ్ నిధులను రాబట్టుకునేందుకు ఉమ్మడిగా కృషి చేస్తున్నాయి. ఇప్పటికే అనేక ఆస్పత్రులు ఈ పథకం కింద వైద్య సేవలను నిలిపివేశాయి. చెల్లింపులలో జాప్యం, క్లెయిముల తిరస్కరణ కారణంగా ఆస్పత్రులు దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందని ఓ వైద్యశాల నిర్వాహకుడు వాపోయారు.

కాంగ్రెస్‌లో చేరిన బిజెపి ఎంపి రాహుల్ కశ్వన్

జైపూర్ : రాజస్థాన్‌లోని షేఖావతి ప్రాంతానికి చెందిన బిజెపి ఎంపి రాహుల్ కశ్వన్ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమక్షంలో రాహుల్ కశ్వన్ కాంగ్రెస్‌లో చేరారు. చురు నియోజకవర్గం నుంచి వరసగా రెండుసార్లు కశ్వన్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తండ్రి రామ్ సింగ్ కశ్వన్ నాలుగు సార్లు విజయం సాధించారు. కశ్వన్ తాత దీప్ చంద్ కశ్వన్ స్వాతంత్ర్య సమర యోధులు, ఎంపిగానూ పనిచేశారు. బిజెపికి రాహుల్ కశ్వన్ రాజీనామా చేయడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎలనాగకు సాహిత్య అకాడమీ అనువాద అవార్డు

- 24 భాషల్లో అవార్డులు ప్రకటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కరీంనగర్‌కు చెందిన ప్రముఖ రచయిత, కవి, అనువాదకులు, భాషావేత్త నాగరాజు సురేంద్ర (ఎలనాగ)కు ప్రతిష్టాత్మకమైన సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం దక్కింది. 2023కు గానూ తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మళయాళం, తమిళ్, నేపాలీ, ఉర్దూ, ఒడియా వంటి ఇతర భాషల్లో 24 మంది అనువాదకులకు సోమవారం సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటించింది. ఇందులో ఇంగ్లీష్‌లో పవన్ కె వర్మ రచించిన 'గాలిబ్: ది మ్యాన్' పుస్తకాన్ని 'ఎలనాగ' తెలుగులోకి అనువాదం చేశారు. 'గాలిబ్ నాటి కాలం' పేరుతో ఎలనాగ రచించిన ఈ పుస్తకం అనువాద విభాగంలో ప్రస్తుతం అవార్డుకు ఎంపికైంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న అవార్డుల ప్రదానోత్సవంలో పురస్కార గ్రహీతలకు రూ.50 వేల నగదు, తామపత్రం అందించనున్నట్లు సాహిత్య అకాడమీ వెల్లడించింది. ఇప్పటి వరకు దాదాపు 40 గ్రంథాలను ఎలనాగ ప్రచురించారు. కలుపు మొక్క, వాగంకురాలు, పెన్మంటలు-కోకిలమ్మ పదాలు, కొత్తబాని వంటివి సాహిత్య లోకాన్ని అలరించాయి.

రహదారుల నిర్మాణంతోనే సమగ్రాభివృద్ధి

- రాష్ట్రంలో 1,134 కిలోమీటర్ల జాతీయ రహదారులకు శ్రీకారం
- వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధిలో జాతీయ రహదారులు కీలకపాత్ర పోషిస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్లు విలువ చేసే 114 జాతీయ రహదారి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు సోమవారం జరిగాయి. ప్రధాని నరేంద్ర మోడీ వీటిలో కొన్నింటిని ప్రారంభించగా, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలో హర్యానా సెక్షన్‌ను మోడీ ప్రారంభించారు. హర్యానాలో రూ.9,750కోట్ల విలువ చేసే ప్రాజెక్టుకు మోడీ శంకుస్థాపన చేశారు. గురుగ్రామ్‌లో రోడ్ షో కూడా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో రూ.20,500 కోట్ల విలువ చేసే మరో 42 ప్రాజెక్టులను కూడా మోడీ ప్రారంభించారు. వీటిల్లో రూ.14వేల కోట్ల విలువైన బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే కూడా వుంది.

రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.29,395 కోట్లతో చేపట్టిన 1,134 కిలోమీటర్ల రోడ్ల పనులకు సంబంధించి ప్రధాని కొన్నింటికి శంకుస్థాపన చేయడంతోపాటు మరికొన్నింటిని జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని నోవాటెల్‌లో నిర్వహించగా, ప్రధాని నరేంద్ర మోడీ గుర్‌గ్రామ్ నుండి వర్చువల్‌గా పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఆనందపురం-పెందుర్తి- అనకాపల్లి సెక్షన్, గురజాన్‌పల్లి నుంచి అవనిగడ్డకు, గుండుగొలను నుంచి కలపర్రు, నాలుగు లైన్‌ల విజయనగరం బైపాస్, ముర్కుంబట్టు నుంచి చెర్లోపల్లి, దేవరపల్లి నుంచి జీలుగుమల్లి వరకు నిర్మించిన జాతీయ రహదారులను జాతికి అంకితం చేశారు.

అలాగే బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులకు, కర్నూలు నుంచి ఆత్మకూరుకు, ఎన్‌హెచ్ 71లో తమిళనాడు సరిహద్దు నుంచి పుత్తూరు వరకు, పుట్టపర్తి నుంచి కోడూరు, మైదుకూర్ నుంచి బద్వేల్, వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు, బి కొత్తపల్లి నుంచి గోరంట్ల వరకు, తాడిపత్రి నుంచి ముద్దనూర్, సోమయాజుల పల్లె నుంచి డోన్ వరకు, సీతారామపురం నుంచి దత్తులూరు వరకు, కడప, కర్నూలు సరిహద్దు నుంచి జమ్మలమడుగు వరకు, ముదిరెడ్డిపల్లి నుంచి నెల్లూరు సరిహద్దు వరకు చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, ప్రపంచ వ్యాప్తంగా 3వ ఆర్థిక శక్తిగా భారత్ ఎదగాలన్నదే తమ లక్ష్యమని మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి పురందేశ్వరి, నేషనల్ హైవేస్ రాష్ట్ర రీజియన్ రీజినల్ అధికారి రాకేష్ కుమార్ సింగ్, ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజినీర్ వి రామచంద్ర, డిప్యూటీ జనరల్ మేనేజర్ నీరజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా కేసులో 'మహా' సర్కారుకు షాక్

- తీర్పుపై స్టేకు సుప్రీం నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మావోయిస్టులతో లింకు ఉన్న కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించిన ముంబాయి హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన మహారాష్ట్ర సర్కారుకు చుక్కెదురైంది. మహారాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. త్వరగా ఈ కేసులో వాదనలు చేపట్టాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు చేసిన అభ్యర్థనను కూడా సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. సరైన సమయంలోనే ఈ కేసులో విచారణ ఉంటుందన్నారు. నిర్దోషిగా ప్రకటించిన తీర్పును అత్యవసరంగా మార్చాల్సిన అవసరం లేదని ధర్మాసనం తెలిపింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సమంజసంగానే ఉందని, ప్రాథమికంగా నిర్ధారణ అవుతోందని ధర్మాసనం వెల్లడించింది.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం : సీతారాం ఏచూరి

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంపై ఏచూరి స్పందించారు. 'హైకోర్టు చాలా సహేతుకమైన తీర్పు ఇచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని స్వీకరించలేము' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు.

ఆర్థిక గూఢచర్యంపై ప్రత్యేక చట్టం

- లా కమిషన్ సూచన

న్యూఢిల్లీ : ఆర్థిక గూఢచర్యాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని లా కమిషన్ తన తాజా నివేదికలో సిఫార్సు చేసింది. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని బాధ్యులను చేసి శిక్షించాల్సిన అవసరం ఉన్నదని కూడా తెలిపింది. సున్నితమైన ఆర్థిక, వాణిజ్య లేదా ఆర్థికపరమైన విధాన సమాచారాన్ని, సాంకేతిక సమాచారాన్ని పొందేందుకు చట్టవిరుద్ధంగా చేపట్టే చర్యనే ఆర్థిక గూఢచర్యం అంటారు. సాంకేతిక పరిజ్ఞానం పైన, రక్షణ, అణు, టెలికం వంటి రంగాల పైన ఆర్థిక గూఢచర్య చర్యల ద్వారా దాడి చేసే అవకాశం ఉన్నదని ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో లా కమిషన్ తెలిపింది. ఇలాంటి చర్యల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని సూచించింది. ఆర్థిక సుస్థిరత, దేశ భద్రత మధ్య విడదీయరాని బంధం ఉన్నదని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్థిక గుఢచర్యంపై ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని లా కమిషన్ అభిప్రాయపడింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని చెప్పింది. ఆర్థిక వ్యవస్థ, దేశ భద్రతపై ఆర్థిక గూఢచర్యం ప్రభావం చూపుతుందని, ఎందుకంటే అది నేరుగా దేశాన్ని లక్ష్యంగా చేసుకుంటుందని తెలిపింది. వాణిజ్య రహస్యాల దుర్వినియోగం, ఆర్థిక గూఢచర్యం అనేవి ఒకేలా కన్పించినప్పటికీ వాటి మధ్య తేడా ఉన్నదని వివరించింది. ఆర్థిక గూఢచర్యంలో విదేశీ ప్రభుత్వం దేశీయ కంపెనీలు లేదా ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటుందని, వాటి వాణిజ్య రహస్యాలను దొంగిలిస్తుందని లా కమిషన్ తెలిపింది. ఈ చర్య ద్వారా విదేశీ ప్రభుత్వం పొందే ప్రయోజనం దేశ భద్రతపై ప్రభావం చూపుతుందని చెప్పింది. ఆర్థిక గూఢచర్యానికి సంబంధించిన కేసులను ప్రస్తుతం ఐపీసీ, ఉమ్మడి చట్టంలోని నిబంధనల ప్రకారం విచారిస్తున్నప్పటికీ దీనిపై ప్రత్యేకంగా ఓ ప్రత్యేక చట్టాన్ని రూపొందించుకోవడం అవసరమని లా కమిషన్ అభిప్రాయపడింది.

సందేశ్‌ఖలి కేసుపై బెంగాల్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : సందేశ్‌ఖలి దురాగతాల కేసును సిబిఐకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. సందేశ్‌ఖలి కేసు విచారణను, నిందితుడు టిఎంసి నాయకుడు షేక్ షాజహాన్‌ను సిబిఐకి అప్పగించాలని ఈ నెల 5న బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వాన్ని కోల్‌కత్తా హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా మమతా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటీషన్‌ను విచారించిన జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో బెంగాల్ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా ఉన్న వ్యాఖ్యలను తొలగించాలని ఆదేశించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న షాజహాన్‌ను తక్షణమే ఎందుకు అరెస్టు చేయలేదని బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి బెంగాల్ ప్రభుత్వ తరుపున హాజరైన సీనియర్ న్యాయవాదులు ఎ.ఎం సింఘ్వి, జైదీప్ గుప్తా సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. బెంగాల్ పోలీసులు ఈ కేసును నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఇడి తరుపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు ఆరోపించారు.

నూతన ఇసిలను నియమించకుండా కేంద్రాన్ని నిరోధించండి

- సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటీషన్

న్యూఢిల్లీ : 2023 చట్టం ప్రకారం కొత్తగా ఎలక్షన్ కమిషనర్లను నియమించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిరోధించాలని సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలయింది. కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్ ఈ పిటీషన్ దాఖలు చేశారు. అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ, అరుణ్ గోయల్ రాజీనామాతో కేంద్ర ఎన్నికల సంఘంలో రెండు ఎన్నికల కమిషనర్ల పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఈ నెల 15 లోగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్యానెల్ భర్తీ చేస్తుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పిటీషన్ దాఖలయింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, కార్యాలయ నిబంధనలు) చట్టం 2023లో నియమాలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న విషయాన్ని జయ తన పిటీషన్‌లో గుర్తు చేశారు. జనవరి 12న వేసిన పిటీషన్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. త్వరలోనే లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో నూతన ఇసిలు తక్షణమే నియమించాల్సి అవసరం ఉందని, కాబట్టి తన పిటీషన్‌పై త్వరగా తీర్పు చెప్పాలని గౌరవపూర్వకంగా అభ్యర్థిస్తున్నానని పిటీషన్‌లో ఠాగూర్ తెలిపారు.

2023 చట్టం ప్రకారం సిఇసి, ఇసిలను ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్యానెల్ సిఫార్సు ప్రకారం రాష్ట్రపతి నియమిస్తారు. ఈ ప్యానెల్‌లో ప్రధానమంత్రితోపాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి చేత నామినేట్ చేయబడిన ఒక కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 19మంది మృతి

- పలు ఇళ్లు ధ్వంసం

గాజా : రంజాన్ మాసం ప్రారంభపు రోజున సైతం గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆగలేదు. పలు నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ సైన్యం బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 19 మంది మరణించారు. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. గాజాలోఎటు చూస్తే అటు ఆకలి రక్కసి కోరలు చాస్తోంది. రంజాన్ సందర్భంగా ప్రార్థనలు చేసుకోవడానికి అల్ అక్సా మసీదులోకి వెళ్ళనీయకుండా వందలాదిమంది పాలస్తీనియన్లను సైన్యం అడ్డుకుంటోంది. రంజాన్‌కి ముందుగానే కాల్పుల విరమణ ఒప్పందం కుదరకపోవడానికి ప్రధాన కారణం ఇజ్రాయిలే అని హమాస్ పొలిటికల్ బ్యూరో అధినేత ఇస్మాయిల్ హనియె విమర్శించారు. గాజాలో యుద్ధానికి అంతం పలకని ఒప్పందం మాకు వద్దని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఈ యుద్ధంలో 31,045 మంది పాలస్తీనియన్లు మరణించగా, 72,654మంది గాయపడ్డారు. రఫా, గాజా నగరాల్లో నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ జరిపిన తాజా బాంబు దాడుల్లో 19మంది మరణించారు.

పెద్దఎత్తున మానవతా సాయం వెంటనే అందించండి : ఐరాస

గాజాలో పెద్ద ఎత్తున మానవతా సాయం అందాలని, అది కూడా చాలా వేగంగా జరగాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పిలుపునిచ్చారు. ఈ దిశగా వున్న అడ్డకుంలన్నింటినీ తొలగించాలన్నారు. హమాస్ తన చెరలో వున్న బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని కోరారు. గాజాలో నాలుగో వంతు జనాభా కరువు వాతన పడుతున్న నేపథ్యంలో ఈ సాయం అందడమే తక్షణ కర్తవ్యమన్నారు.

సుమత్రా దీవిలో ఆకస్మిక వరదలు

- 26మంది మృతి, 11మంది గల్లంతు



జకార్తా : ఇండోనేషియాలోని సుమత్రా దీవిలో కుండపోత వర్షాలతో ఆకస్మికంగా సంభవించిన వరదలు, మట్టిపెళ్లలు విరిగిపడిన సంఘటనల్లో 26మంది మరణించగా, మరో 11మంది గల్లంతయ్యారని అధికారులు సోమవారం తెలిపారు.

గురువారం నుండి పశ్చిమ సుమత్రా ప్రావిన్స్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో 9 జిల్లాలు, నగరాలు నీట మునిగాయి. నదులు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం పొద్దుపోయిన తర్వాత పెద్ద ఎత్తున మట్టిపెళ్లలు, కొండచరియలు విరిగిపడడంతో నది కట్టలు తెగి ఊర్లలోకి వరద ప్రవహించింది. సెలాటన్ జిల్లాలో కొండల పక్కన గల గ్రామాలన్నీ చిన్నాభిన్నమయ్యాయి. ప్రస్తుతానికి నీటి మట్టం తగ్గడంతో సహాయక సిబ్బంది మరిన్ని మృతదేహాలను వెలికితీస్తున్నారు. విద్యుత్ లేకపోవడం, వంతెనలు తెగిపోవడం, రహదారులు ధ్వంసమవడం, పెద్ద మొత్తంలో బురద, రాళ్ల రప్పలతో కూడిన శిధిలాల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. సెలాటన్, దాని పొరుగునే గల పరియామన్ జిలాల్లోని అనేక గ్రామాలు బాగా దెబ్బతిన్నాయని, మరణాలు, నష్టం అక్కడే ఎక్కువ సంభవించిందని సంస్థ ప్రతినిధి అబ్దుల్ ముహారి తెలిపారు. వర్షాల కారణంగా 37వేలకు పైగా ఇళ్లు, భవనాలు నీట మునిగాయి. మూడు ఇళ్లు వరద ఉధృతికి కొట్టుకుపోయాయని చెప్పారు.

బాండ్ల వివరాలు వెల్లడించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఎవరు ఇచ్చారు, ఏ పార్టీకి ఇచ్చారు అనే సమాచారాన్ని సరిపోల్చాలంటే సమయం పడుతుందని, ఎందుకంటే ఆ సమాచారాన్ని వేర్వేరుగా భద్రపరచడం జరిగిందని ఆయన కోర్టుకు తెలియజేశారు. 'తప్పులు చేసి గందరగోళం సృష్టించాలని మేము అనుకోవడం లేదు. మాకు కొంత సమయం ఇవ్వండి. మేము ఆ పనిని పూర్తి చేస్తాం' అని అభ్యర్థించారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా జోక్యం చేసు కుంటూ పొరబాటు జరిగే అవకాశమే లేదని అన్నారు. 'మీ వద్ద కేవైసీ ఉంది. మీది దేశంలోనే నెంబర్ వన్ బ్యాంక్. మీ పనిని సకాలంలో పూర్తి చేస్తారన్న విశ్వాసం మాకు ఉంది' అని చెప్పారు. సమాచారాన్ని సరిపోల్చాలని న్యాయస్థానం తన తీర్పులో చెప్పలేదని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గుర్తు చేశారు.

మీ దగ్గర ఉన్నది ఉన్నట్టుగా సమాచారం ఇవ్వాలని మాత్రమే కోరాం. బాండ్లు కొన్నవారి వివరాలన్నీ సీల్డ్ కవర్‌లో ఉన్నాయని చెప్పారు. వాటిని తెరిచి వివరాలు ఇస్తే సరిపోతుంది. తమ వద్ద ఉన్న సమాచారాన్ని సీల్డ్ కవర్లో ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాం. వాటిని మేం తెరవలేదు. బాండ్ల రద్దుపై ఫిబ్రవరి 15న తీర్పునిచ్చాం. ఇవాళ (సోమవారం) మార్చి 11. ఈ 26 రోజుల్లో ఏం చర్యలు తీసుకున్నారో ఎస్‌బిఐ అప్లికేషన్‌లో పేర్కొనలేదు. మార్చి 12 సాయంత్రం పని గంటలు ముగిసేలోగా దాతల వివరాలను ఇసికి అందజేయాల్సిందే. బాండ్లు కొన్నవారి వివరాలు మీ వద్ద సిద్ధంగా ఉన్నప్పుడు రాజకీయ పార్టీల వివరాలు అందించడానికి మూడు వారాల గడువెందుకు. అని కోర్టు ప్రశ్నించింది. దీనికి అటు నుంచి సమాధానం లేదు. ఎస్‌బిఐ బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఎస్‌బిఐకి చెంప పెట్టు లాంటిదని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అభిప్రాయ పడ్డారు. కోర్టు ఉత్తర్వులకు సంబంధించి ఎస్‌బిఐ చైర్మన్ అఫిడవిట్ దాఖలు చేయాలని కోరారు. కోర్టు ఉత్తర్వులు పాటించకకుంటే ధిక్కరణ చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎలక్టోరల్ బాండ్ల విధానం రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ, ఈ స్కీమును ప్రవేశపెట్టిన 2019 ఏప్రిల్ 12 నుండి 2024 ఫిబ్రవరి 15న రద్దు చేసేవరకు ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసినవారు, వాటిని స్వీకరించినవారి వివరాలను మార్చి 6 కల్లా వెల్లడించాలని సుప్రీం కోర్టు ఫిబ్రవరి15న ఎస్‌బిఐని ఆదేశించిన సంగతి తెలిసిందే.

రాజకీయ నిధుల్లో పారదర్శకత దిశగా ఇదొక అడుగు: సీతారాం ఏచూరి

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను అందజేయడానికి గడువును పొడిగించాలన్న ఎస్‌బిఐ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించడాన్ని సిపిఎం, సిపిఐ స్వాగతించాయి. సోమవారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల నిధుల్లో పారదర్శకత దిశగా ఇదొక ముఖ్యమైన అడుగు అని వ్యాఖ్యానించారు. సుప్రీం తాజా ఆదేశం ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని ఏచూరి తెలిపారు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ పథకం 'రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసిందన్నారు. వారు (బిజెపి) కార్పొరేట్‌లతో డీల్స్ కుదుర్చుకోడానికి, రాజకీయ పక్షాలను కొనుగోలు చేయడానికి ఉపయోగించారని, ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దుష్ట సంస్కృతికి ఇదే కారణమని అన్నారు. ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు వెలువరించిన ఒక మైలురాయి వంటిదని ఆయన అన్నారు.

అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేర్చండి

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్‌ఆర్ మినీ సెక్రటేరియట్ భవనాలను, మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా పులివెందుల మెయిన్ రోడ్డులో రూ.11.4 కోట్లతో నిర్మించిన సెంట్రల్ బోలే వార్డు, బైపాస్ రోడ్డులో రూ.20.69 కోట్లతో నిర్మించిన వైఎస్.జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, రూ.80 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన గాంధీ జంక్షన్, పులివెందుల పట్టణ సమీపంలో వంద ఎకరాల్లో రూ.65.99 లక్షలతో నిర్మించిన వైఎస్‌ఆర్ ఉలిమెల్ల లేక్ జగన్ ప్రారంభించిన వాటిలో ఉన్నాయి. అనంతరం ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ.175 కోట్లతో ఆదిత్య బిర్లా సంస్థ నిర్మించిన సూట్స్, వస్త్ర తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన ఇడుపులపాయకు వెళ్లారు. రూ.39.13 కోట్ల ప్రభుత్వం, పాడా నిధులతో నిర్మించిన వైఎస్‌ఆర్ మెమోరియల్ పార్కును ప్రారంభించారు. అనంతరం కడప ఎయిర్‌పోర్టు నుంచి తాడేపల్లి బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ సిఎం ఎస్‌బి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలం సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.వి.సతీష్ కుమార్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఎంటి.కృష్ణబాబు, కలెక్టర్ విజయ్‌రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముంగిట అమల్లోకి సిఎఎ

(మొదటి పేజీ తరువాయి)

పెద్దయెత్తున నిరసనలు వెల్లువెత్తాయి. . రాజధాని ఢిల్లీతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముస్లింలు, వారికి మద్దతుగా ప్రగతిశీల శక్తు లు నిరసనలు చేపట్టాయి. దీంతో వెనక్కి తగ్గిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల ముంగిట మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. కూడుకున్న చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. నోటిఫై చేసిన సిఎఎ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని కేంద్రం తెలిపింది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

పలుచోట్ల భద్రత కట్టుదిట్టం

సిఎఎను అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లోని పలు చోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈశాన్య ఢిల్లీలోని షాహీన్‌బాగ్, జామియా, ఇతర సున్నిత ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు. పోలీసులతో పాటు పారా మిలటరీ బలగాలను కొన్ని చోట్ల మోహరించారు. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది, పారామిలటరీ బలగాల ద్వారా పెట్రోలింగ్, చెకింగ్ నిర్వహిస్తున్నారు.

చైనా ఆధునీకరణపైనే దృష్టి!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత స్థాయి స్వయంప్రతిపత్తితో 'ఒక దేశం, రెండు వ్యవస్థలు' అన్న సూత్రాన్ని కచ్చితంగా, సమగ్రంగా అమలు చేస్తామని తీర్మానం పేర్కొంది.

జిన్‌పింగ్ దార్శనితకు సంపూర్ణ మద్దతు

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ దార్శనికతకు, దేశాభివృద్ధి కోసం ఆయన రూపొందించిన ప్రణాళికలకు సిపిపిసిసి వార్షిక సమావేశాలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. వారం రోజుల పాటు సాగిన ఈ సమావేశాలు సోమవారంతో ముగిశాయి. కమ్యూనిస్టు పార్టీపై తన పట్టును మరింత సంఘటితపరుచుకోవడంలో జిన్‌పింగ్ విజయం సాధించారని ఆసియా సొసైటీ పాలసీ ఇనిస్టిట్యూట్‌కి చెందిన నీల్ థామస్ వ్యాఖ్యానించారు.



మీ కోసం

అల్లం, వెల్లుల్లి ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే కాగితంలో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి.

జీవన సౌరభం

వ్యతిరేకత అనేది కార్యసాధకుడిలో పట్టుదలను పెంచుతుందే కానీ కార్య విరమణకు పురికొల్పదు.



భళా భళీ బొమ్మలు

నయగారమె బొమ్మలు
నాట్యమాడు బొమ్మలు
కమనీయమె బొమ్మలు
రమణీయమె బొమ్మలు

సొగసైన బొమ్మలు
సోయగాల బొమ్మలు
రమ్యమైన బొమ్మలు
సౌమ్యమైన బొమ్మలు

అలక తీర్చు బొమ్మలు
కలలు తీర్చు బొమ్మలు
నిద్రపుచ్చే బొమ్మలు
ఇంద్రజాల బొమ్మలు

నడిచేటి బొమ్మలు
నవ్వేటి బొమ్మలు
ఏడుపాపు బొమ్మలు
ఆడుకొనే బొమ్మలు

పులకింతల బొమ్మలు
గిలిగింతల బొమ్మలు
వన్నె చిన్నె బొమ్మలు
మన్నికైన బొమ్మలు

ఆటలాడు బొమ్మలు
పాటపాడు బొమ్మలు
మాట్లాడే బొమ్మలు
పోట్లాడే బొమ్మలు

అందమైన బొమ్మలు
ఆనందమె బొమ్మలు
అరుదైన బొమ్మలు
అద్భుతాల బొమ్మలు

కొండపల్లి బొమ్మలు
కొప్పాకలో బొమ్మలు
తెలుగు జాతి బొమ్మలు
ఖ్యాతిపెంచు బొమ్మలు

- గుండాల నరేంద్రబాబు,
94932 35992

గజిబిజి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఆంగ్ల పదాలను పక్కనే ఉన్న బాక్సులో గజిబిజిగా ఇచ్చాం. అవి ఎక్కడున్నాయో గుర్తించండి చూద్దాం.



sun
boat
heart
snail
puppy
carrot

l	c	b	s	u	n
h	a	o	m	l	y
e	r	a	u	i	p
a	r	t	i	a	p
r	o	l	j	n	u
t	t	i	t	s	p

నేను గీసిన బొమ్మ



కె.ధనుష్,
ఏడో తరగతి,
పెద్ద గొట్టిముక్కల,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బాలికా వివాహాలను ఆపి .. భరోసాగా నిలుస్తారు!



శరత్


సరిత

వారిద్దరూ వేర్వేరు ప్రాంతాల వారైనా, వారు ఎంచుకున్న మార్గం ఒక్కటే! తమ చుట్టుపక్కల ఉన్న కుటుంబాల్లో వయసుకు ముందే పెళ్లిపీటలు ఎక్కిస్తున్న బాలబాలికలను కాపాడడమే వారి దినచర్యగా ఉంటోంది. శరత్(16) తన అక్క పెళ్లిని నిలుపుదల చేయడంతో మొదలుపెట్టి ఇప్పటికి రెండు బాల్య వివాహాలను ఆపాడు. అదే రాష్ట్రంలోని సరిత(18) కోవిడ్ కాలం నుంచి ఇప్పటి వరకు ఐదు బాల్య వివాహాలను నిలుపుదల చేసింది. ఆ బాలికలను చదువుల వైపు, చక్కని భవిష్యత్తు వైపూ మళ్లించి, వారికి భరోసాగా నిలుస్తున్నారు.

చట్టబద్ధంగా నిర్ణయించబడిన వివాహ వయస్సు కంటే ముందే కౌమార బాల బాలికలకు వివాహాలు జరపటం ఒరిస్సాలోని నబరంగ్‌పూర్, కంధమల్ జిల్లాల్లో సర్వసాధారణం. పెళ్లితో ఆ బాలికలు తమ కలలను, లక్ష్యాలను దూరం చేసుకుని జీవచ్ఛవాల్లా బతకడం చాలామందికి మామూలు విషయం. కానీ, ఆ ప్రాంతాల్లో ఉంటున్న సరిత, శరత్ మాత్రం అలా చూస్తూ ఊరుకోలేదు. తమ కళ్లెదుట జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించారు. అదేమని వాదించిన పెద్దలకు అవగాహన కల్పించారు.

బాల్యవివాహాలు జరిపించడం వల్ల కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలను ఒక్కో కుటుంబానికి వివరించడం మొదలుపెట్టారు. నాలుగేళ్లుగా ఇదే పని చేస్తున్నారు. శరత్ 13 ఏళ్లప్పుడే తన అక్క రష్మితకి జరుగుతున్న బాల్య వివాహాన్ని నిలుపుదల చేశాడు. 16 ఏళ్ల రష్మిత డ్రాపౌట్‌గా ఇంటికే పరిమితమవ్వడంతో కుటుంబంలోని పెద్దలు ఆమెకి పెళ్లి నిశ్చయించారు. ఆ సంగతి తెలిసిన, ముగ్గురు పిల్లల్లో చిన్నవాడైన శరత్ పెళ్లి వద్దని వాదించాడు. చదువుకోవాలనుకుంటున్న అక్కను మళ్లీ స్కూల్లో చేర్పించమని చెప్పాడు. స్థానిక స్వచ్ఛంద సంస్థ సహాయంతో అక్క పెళ్లిని నియంత్రించాడు. ఆ రోజు శరత్ చూపించిన చొరవ వల్ల రష్మిత ప్రస్తుతం ప్లస్-2 చదువుతోంది. చదువుకుంటూనే తమ్ముడు శరత్ చేస్తున్న బాల్యవివాహాల నిలుపుదలలో కూడా తన వంతు సాయం చేస్తోంది.



తన ప్రాంతంలో జరుగుతున్న బాల్య వివాహాల గురించి శరత్ చాలా ఆందోళన చెందుతాడు. 'ఇక్కడ 15 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయడం చాలా సాధారణం. ఈ పరిస్థితిని మార్చాలన్న లక్ష్యంతో నేను ప్రతి రోజూ నా తీరిక సమయంలో మా చుట్టుపక్కల ఇళ్లకు వెళతాను. వివాహానికి చట్ట బద్ధ వయసు గురించి అక్కడి వాళ్లల్లో చాలామందికి అవగాహన లేదు. వాళ్లందరినీ ఒక్కొక్కరిగా కలుస్తాను. మా ప్రాంతంలోని బాలురని కూడా స్థానికంగా వారానికొకసారి నిర్వహించే అద్వైక సెషన్స్‌కి తీసుకెళతాను' అంటున్న శరత్ ఈ పనులన్నింటినీ అక్క రష్మితతో కలిసి చేస్తున్నాడు.

సరిత ... తన స్నేహితుల్లో చాలా మందికి 18 ఏళ్ల లోపే వివాహం జరగటం ప్రత్యక్షంగా చూసింది. వారంతా ఆకర్షణకు లోనై ఇంటి నుండి వెళ్లిపోయినవారు. ఈ పరిస్థితినే సరిత మార్చాలనుకుంది. 'ఇక్కడ చాలామంది యువకులు మైనర్ బాలికలను ప్రలోభాలకు గురిచేస్తారు. ఎంతలా అంటే తల్లిదండ్రులను వదిలిపెట్టి డబ్బు, నగలతో తమతో వచ్చేసేలా వారిని సిద్ధపరుస్తారు. అలా ఇల్లు వదిలిన ఆడపిల్లలు, గర్భిణీలుగా ఇంటికి తిరిగివచ్చిన సంఘటనలు అనేకం. కోవిడ్ సమయంలో ఈ పరిస్థితి బాగా కనిపించింది. ఎప్పుడైతే ఆ పిల్లలు ఇంటికి చేరుతారో వెంటనే ఆ ఇంటివారు ఎవరికో ఒకరికి వారిని ఇచ్చి పెళ్లి చేసేయాలని నిశ్చయిస్తారు. అలా జరగకుండా ఉండాలని స్థానిక అంగన్వాడీ వర్కర్లతో కలిసి పనిచేస్తున్నాను.

కోవిడ్ నుండి ఇప్పటి వరకు 5 బాల్య వివాహాలను నిలుపుదల చేశాను. ముఖ్యంగా ఇల్లు వదిలి వెళ్లిపోయిన బాలికలను ప్రత్యేకంగా కలుస్తాను. వాళ్లంతా బడి మానేసి ఇంటికే పరిమితమైనవారు. అందుకే వారిని తిరిగి స్కూలుకు వెళ్లమని చెబుతాను' అని తన కార్యాచరణని సరిత వివరిస్తోంది.

ఈ ఇద్దరూ అనుసరిస్తున్న విధానాలు బాల్య వివాహాల్లో పెద్ద మార్పుకు దారితీస్తాయని బలంగా నమ్ముతున్నారు. వీరు ఎంచుకున్న మార్గం ప్రస్తుతం చిన్నదిగా కనిపించవచ్చు. కలిసివచ్చిన చేయూత కూడా తక్కువగా ఉండవచ్చు. కానీ, వీరి అడుగులు ఎంతోమంది యువత అనుసరించదగ్గవి. తమ ప్రాంతంలో జరుగుతున్న మూఢ నమ్మకాలకు, ప్రలోభాలకు లోనవ్వకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత నేటి యువత మీద ఎంతో ఉంది.

వేసవిలో జుట్టు సంరక్షణ ఇలా ...

వేసవి కాలంలో జుట్టు ఆరోగ్యం క్రమంగా దెబ్బతింటుంది. ఎండ వేడి నేరుగా తలకు తగలడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. దీంతో చుండ్రు సమస్య అధికమవుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే, జుట్టును సంరక్షించుకోవచ్చని నిపుణులు అంటున్నారు.



- బయటకు వెళ్లేప్పుడు, జుట్టును స్కార్ఫ్ లేదా క్యాప్‌తో కవర్ చేసి ఉంచాలి.
- కొంతమంది ఎండ వేడి తట్టుకోలేక, రోజూ తలస్నానం చేస్తూ ఉంటారు. దీనివల్ల జుట్టులోని తేమ, నూనె తొలగిపోయి జుట్టు నిర్జీవంగా తయారవుతుంది. కాబట్టి వీలైనంత వరకు తక్కువసార్లు తలస్నానం చేయాలి.
- జుట్టు కుదుళ్ల బలంగా తయారయ్యేందుకు గోరువెచ్చని నూనెతో మర్దన చేయాలి.
- సాధారణంగా పొడవాటి జుట్టు ఉన్నవారికి వేసవి వేడి వాతావరణంలో జుట్టుపై శ్రద్ధ పెట్టడం పెద్ద సమస్య. కాబట్టి పొడవు జుట్టు ఉన్న వారు జుట్టు రాలకుండా, చిట్లకుండా ఉండేలా పైకి టై చేసుకోవాలి.
- సముద్రం, ఈత కొలనుల్లో స్నానాలు చేసినప్పుడు జుట్టు పొడిబారుతుంది. బలహీనంగా, పెళుసుగా మారుతుంది. కాబట్టి అటువంటిచోట స్నానం చేసిన తరువాత మంచి నీళ్లతో మరోసారి తలస్నానం చేయాలి.
- వేడినీటి స్నానం శరీరానికే కాదు, జుట్టుకు కూడా మంచిదే. అయితే వేడినీటి స్నానం తరువాత చివరగా జుట్టును చల్లటి నీటితో కడగాలి. ఇలా చేస్తే, జుట్టుకు బలం పెరిగి మెరుపుగా తయారవుతుంది.
- అలాగే తలస్నానం చేసిన తరువాత జుట్టు తడి ఆరాలని అదే పనిగా గట్టిగా రుద్దకూడదు. మెల్లిగా తుడవాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు జుట్టుకు లేదా మాడుకు సన్‌స్క్రీన్ లోషన్ రాయాలి.
- సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నప్పుడు రాత్రి పడుకోబోయే ముందు తలస్నానం చేయాలి. అలా సాధ్యం కానప్పుడు ఆ లోషన్లకు బదులు కొబ్బరినూనెతో మర్దనా చేయాలి.
- వేసవికాలంలో జుట్టుకు నిమ్మరసం వాడినట్లయితే మరింత నిర్జీవంగా మారొచ్చు. కాబట్టి కాఫీ డికాషన్ లాంటి కండీషనర్లను వాడటం మంచిది.

ఓవరాల్‌గా 'ఓపెన్ హైమర్' సత్తా
సందడిగా 'ఆస్కార్' వేడుకలు

సినీ ప్రపంచంలో అత్యుత్తమ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలు అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో వైభవంగా జరిగాయి. ఈ ఏడాది బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డు 'బార్బీ' చిత్రంలోని 'వాట్ వాస్ ఐ మేడ్ ఫర్' అనే పాటకు వచ్చింది. ప్రముఖ దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ తెరకెక్కించిన బయోగ్రాఫికల్ థ్రిల్లర్ 'ఓపెన్ హైమర్' సినిమా సత్తా చాటింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, దర్శకుడితో సహా పలు అవార్డులను కైవసం చేసుకుంది. ఆ తర్వాత 'పూర్ థింగ్స్' సినిమా కూడా తన హవాను కొనసాగించి కొన్ని కేటగిరీల్లో ఆస్కార్‌ను గెలుపొందింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖులు ఈ వేడుకలను సామాజిక మాధ్యమాల్లో వీక్షించారు.



ఉత్తమచిత్రం-ఓమెన్ హైమర్
ఉత్తమ దర్శకుడు-క్రిస్టఫర్ నోలన్-ఓపెన్ హైమర్
ఉత్తమ నటుడు-కిలియన్ మర్ఫీ-ఓపెన్ హైమర్
ఉత్తమ నటి-ఎమ్మాస్టోన్-పూర్‌థింగ్స్
ఉత్తమ సహాయ నటుడు-రాబర్ట్ డౌనీ జూనియర్-ఓపెన్ హైమర్
ఉత్తమ సహాయ నటి-డేవైన్ జో రాండాల్ఫ్-ది హోల్డోవర్స్
ఉత్తమ సినిమాటోగ్రఫీ- ఓపెన్‌హైమర్
ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్-20 డేస్ ఇన్ మరియోపోల్
బెస్ట్ హెయిర్ స్టయిల్ అండ్ మేకప్ : నడియా స్టేసీ, మార్క్ కౌలియర్-పూర్‌థింగ్స్
బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే-కార్డ్ జెఫర్‌సన్-అమెరికన్ ఫిక్షన్
బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్స్ ప్లే-జస్టిన్ ట్రైట్, అర్థర్ హరారీ-అనాటమీ ఆఫ్ ఎ ఫాల్
బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్-ది బాయ్ అండ్ ది హిరాన్
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్-హోలి వెడ్డింగ్‌టన్-పూర్‌థింగ్స్
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్-జేమ్స్ ప్రైస్, షోనా హెత్-పూర్‌థింగ్స్
ఉత్తమ ఇంటర్నేషనల్ ఫిల్మ్-ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్
ఉత్తమ ఎడిటింగ్-జెన్నిఫర్ లేమ్-ఓపెన్‌హైమర్
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్-గాడ్జిల్లా మైనస్ వన్
ఉత్తమ డాక్యుమెంటరీ-షార్ట్ సబ్జెక్ట్-ది లాస్ట్ రిపేర్‌షాప్
ఉత్తమ ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్-ఓపెన్ హైమర్
ఉత్తమ సౌండ్- ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్
ఉత్తమ ఒరిజినల్ సాంగ్ : వాట్ వాస్ ఐ మేడ్ ఫర్-బార్బీ
ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్- ది వండర్‌ఫుల్ స్టోరీ ఆఫ్ హెన్రీ సుగర్

ఓటీటీల్లో అవార్డు పొందిన సినిమాలు

ఆస్కార్ అవార్డులు సొంతం చేసుకున్న సినిమాలు ఓటీటీల్లో ఎక్కడ స్ట్రీమింగ్ అవుతున్నాయో తెలుసుకునే ప్రయత్నాలను సినీ ప్రియులు చేస్తున్నారు. ఓపెన్‌హైమర్ జియో సినిమా నుంచి ఈనెల 21 నుంచి అందుబాటులోకి రానుంది. పూర్‌థింగ్స్ డిస్నీ హాట్‌స్టార్‌లోనూ, ది హోల్డోవర్స్ అమెజాన్ ప్రైమ్‌లోనూ, అమెరికన్ ఫిక్షన్ అమెజాన్ ప్రైమ్ వీడియోలోనూ, అనాటమీ ఆఫ్ ఎ ఫాల్ అమెజాన్ ప్రైమ్ వీడియో, ది జోన్ ఆఫ్ ఎ ఫాల్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో, బార్బీ జియో సినిమాలో అందుబాటులో ఉన్నాయి.

ఈ ఏడాది వేడుకల్లోనూ 'నాటు నాటు'

ప్రస్తుత వేడుకల్లోనూ ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు సంబంధించిన నృత్యాలు ప్రదర్శితమయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియోలు ఆర్ఆర్ఆర్ హ్యాష్‌ట్యాగ్ ఎక్స్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చాయి. గతేడాది బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో 'నాటు నాటు' పాట ఆస్కార్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ పాటలోని స్టెప్స్ తాజాగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మిగతా సినిమాలతోపాటుగా దీనిని కూడా ప్రదర్శించారు.

దర్శకుడు సూర్య కిరణ్ మృతి



టాలీవుడ్‌లో విషాదం చోటుచేసుకుంది. తెలుగులో 'సత్యం' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సూర్యకిరణ్ కన్ను మూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. మాస్టర్ సురేష్ పేరుతో 200లకు పైగా చిత్రాల్లో బాలనటుడిగా, సహాయ నటుడిగా నటించిన ఆయన ఆ తర్వాత దర్శకుడిగా మారి 'సత్యం', 'ధన 51, 'బ్రహ్మాస్త్రం', 'రాజుభాయ్', 'చాప్టర్ 6' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. తెలుగులో 'రాక్షసుడు', 'దొంగమొగుడు', 'స్వయం కృషి', 'సంకీర్తన', 'ఖైదీ నం.786', 'కొండవీటి దొంగ' చిత్రాల్లో నటించారు. బాలనటుడిగా కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు అవార్డులను, దర్శకుడిగా రెండు నంది పురస్కారాలను అందుకున్నారు. సూర్యకిరణ్ మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు చెన్నైలో జరగనున్నాయి.

త్వరలో కిరణ్ అబ్బవరం పెళ్లి..!



యువ నటుడు కిరణ్ అబ్బవరం త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో నటుడిగా ఆయన ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. అదే సినిమాలో హీరోయిన్‌గా రహస్య గోరక్ నటించారు. అప్పటి నుంచి వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు. గతేడాది 'వినరో భాగ్యము విష్ణు కథ', 'మీటర్', 'రూల్స్ రంజన్' చిత్రాల్లో కిరణ్ నటించారు. ప్రస్తుతం 'దిల్ రుబా', మరో పీరియాడిక్ మూవీ చేస్తున్నారు. 'రాజావారు రాణిగారు' తర్వాత 'షర్బత్' అనే తమిళ చిత్రంలో రహస్య నటించారు. ఇరుకుటుంబాల పెద్దల అంగీకారంతో ఈ నెల 13న నిశ్చితార్థం జరగనుంది.

ప్లే-ఆఫ్ రేసునుంచి యుపి ఔట్

- **గుజరాత్ చేతిలో 8పరుగుల తేడాతో అనూహ్య ఓటమి**
- **బెంగళూరు ఆశలు సజీవం**



బెత్ మూనీ (74నాటౌట్)

న్యూఢిల్లీ: ప్లేఆఫ్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో యుపి వారియర్స్ అనూహ్యంగా ఓటమిపాలైంది. ఐదు మ్యాచుల్లో ఓడి దాదాపు ప్లే-ఆఫ్‌కు దూరమైన గుజరాత్ జట్టు చేసితో యుపి 8పరుగుల తేడాతో ఓడింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 154పరుగులు చేయగా.. ఛేదనలో యుపి జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి ఐదు వికెట్లు కోల్పోయి 144పరుగులే చేసింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ప్లే-ఆఫ్స్‌కు చేరే ఛాన్స్ ఉన్న యుపి జట్టు ఆఖరి మ్యాచ్‌లో ఓటమితో రేసునుంచి నిష్క్రమించింది. తొలుత యుపి బౌలర్లు ఎక్లేస్టోన్, దీప్తి శర్మకి తోడు ఆటపట్టు, గైక్వాడ్ కూడా రాణించడంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్‌ను 20 ఓవర్లలో 152పరుగులే చేసింది. ఓపెనర్లు బెత్ మూనీ (74నాటౌట్, 10ఫోర్లు, సిక్సర్), లారా వోల్వార్డ్ (43, 8ఫోర్లు, సిక్సర్) తొలి వికెట్‌కు 7.5ఓవర్లలో 60పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. ఓపెనర్లకు తోడు గార్డినర్(15), బ్రైస్(11) మాత్రమే రెండంకెల స్కోర్ మాత్రమే చేశారు. ఛేదనలో యుపి టాపార్డర్ బ్యాటర్లు హీలీ(4), నవ్‌గైర్(0), ఆటపట్టు(0)కి తోడు హారీస్(1), సెహ్రావత్(8) నిరాశపరిచారు. దీంతో యుపి జట్టు 35పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో దీప్తి శర్మ(88), పూనమ్ ఖెమ్నార్(36) పోరాడినా ప్రయోజనం లేకపోయింది. 18ఓవర్లు పూర్తయ్యేసరికి యుపి జట్టు 113పరుగులే చేసింది. 19వ ఓవర్లో 14పరుగులు, 20ఓవర్లో 17పరుగులు చేసి ఓటమిపాలైంది. గుజరాత్ బౌలర్లు షబ్నమ్‌కు మూడు, బ్రైస్, గార్డినర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షబ్నమ్‌కు లభించింది. ఈ ఓటమితో యుపి జట్టు దాదాపు ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించగా.. బెంగళూరు ప్లే-ఆఫ్‌కు చేరడం దాదాపు ఖాయమైంది.

ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్



క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. మూడోరోజు విజయానికి అవసరమైన 202పరుగులను ఆస్ట్రేలియా మరో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ(98నాటౌట్), మిఛెల్ మార్ష్(80) కలిసి 140పరుగులు జతచేసి ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చారు. చివర్లో కమిన్స్(32 నాటౌట్) రాణించాడు. దీంతో ఆస్ట్రేలియా 7వికెట్లు నష్టపోయి 271 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది అలెక్స్ క్యారీకి, సిరీస్ హెన్రీకి లభించాయి.


ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 పురుషుల డబుల్స్ టైటిల్స్‌తో సాత్విక్-చిరాగ్ శెట్టి

పారిస్ ఒలింపిక్స్‌కు 28మంది హాకీ ఆటగాళ్లతో ప్రాబబుల్స్



భువనేశ్వర్: టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు ఆటగాళ్ల శిక్షణకు సిద్ధమైంది. 28మంది ఆటగాళ్లతో కూడిన జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) సోమవారం ప్రకటించింది. ఈనెల 12 నుంచి 31వరకు భువనేశ్వర్‌లోని కలింగ స్టేడియంలో వీరందరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఫ్రాన్స్‌లోని పారిస్ వేదికగా 2024 ఒలింపిక్స్ జరగనున్న దృష్ట్యా ఆటగాళ్లకు సన్నాహాలను చక్కదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023-24 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో భారత ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకొని ఈ శిక్షణా శిబిరానికి చేరుకోనున్నారు. ఈ ఏడాది ప్రో లీగ్ ఆడేందుకు జూన్ 1న లండన్‌కు, ఆ తర్వాత నెదర్లాండ్స్ పర్యటనలకు భారత హాకీ జట్టు వెళ్లనుంది. అలాగే మే 22న బెల్జియం పర్యటనకు పయనం కావాల్సి ఉంది. ఆటగాళ్లకు శిక్షణ పూర్తయిన వెంటనే భారత బృందం ఆస్ట్రేలియాకు పయనం కానుందని పురుషుల జట్టు చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ తెలిపాడు.

జట్టు : గోల్‌కీపర్లు: కృషన్ బహదూర్, పిఆర్ శ్రీజేశ్, సూరజ్ కర్కేరా **డిఫెండర్లు:** హర్మన్‌ప్రీత్, జర్మన్‌ప్రీత్, అమిత్ రోహిదాస్, గుర్జాజ్, సంజయ్, సుమిత్, అమిర్ అలీ **మిడ్‌ఫీల్డర్లు:** మన్‌ప్రీత్, హార్దిక్, వివేక్ సాగర్, రబిచంద్రన్, షంషేర్, నీలకంఠ, రాజ్‌కుమార్, విష్ణుకాంత్, **ఫార్వర్డ్స్:** ఆకాశ్‌దీప్, మన్‌దీప్, లలిత్ కుమార్, అభిషేక్, దిల్‌ప్రీత్, సుఖ్‌జీత్, గుర్జంత్, మహ్మద్, బాబీసింగ్, అరైజిత్.

ముంబయికి ఆధిక్యత
విదర్భతో రంజీట్రోఫీ ఫైనల్


ముషీర్ ఖాన్-రాహానే అర్ధసెంచరీలు

ముంబయి: రంజీట్రోఫీ ఫైనల్లో ముంబయి జట్టు పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ జట్టును కేవలం 105పరుగులకే ఆలౌట్ చేయడంతో ముంబయికి ముంబయికి 132పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబయి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 141పరుగులు చేసింది. మూడు వికెట్ల నష్టానికి 31పరుగులతో రెండో రోజు ఆటను ప్రారంభించిన విదర్భను 105 పరుగులకే ఆలౌట్ చేసింది. ఆ జట్టులో యశ్ రాథోడ్ (27) టాప్ స్కోరర్‌గా కాగా.. అథర్వ తైడే (23), ఆదిత్య థాక్రే (19), యశ్ ఠాకూర్ (16) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. కెరీర్‌లో చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడుతున్న పేసర్ ధవళ్ కులకర్ణి (3/15) అదరగొట్టాడు. తనుష్ కొటియన్ (3/7), శామ్స్ ములాని (3/32) బౌలింగ్‌లో విజృంభించారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 119 పరుగుల ఆధిక్యం సంపాదించిన ముంబయి జట్టు.. రెండోరోజు ఆట ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. ప్రస్తుతం 260 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్లు పృథ్వీ షా(11), భూపేన్ లాల్వానీ(18) తక్కువ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి 34 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో ముషీర్ ఖాన్ (51నాటౌట్; 135బంతుల్లో 3ఫోర్లు), కెప్టెన్ అజింక్య రహానె (58నాటౌట్; 109బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్) అర్థ శతకాలతో ఆదుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68